19-06Pg1exHMNWJQEBPRCKLT.qxd:19-06Pg1exHMNWJQEBPRCKLT.qxd 1/1/02 6:06 AM Page 1

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విశాఖపట్నం : fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 139 పేజీలు: 16 వెల: 6.50



19-06pg2fV.qxd OK:19-06pg2fV.qxd 1/1/02 6:33 AM Page 1





గురువారం కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ సిఎం సువేందు అధికారితో భేటీ అయిన మంత్రి లోకేష్

# పశ్చిమ బెంగాల్ సిఎం సువేందు అధికారితో మంత్రి లోకేష్ భేటీ

### సిఎంకు ఏపి సంక్షేమ పథకాల అమలు, టెక్నాలజీ వినియోగం, పెట్టుబడుల సాధనను వివరించిన మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 18, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్ బంధం మరింత బలోపేతం కావాలని ఏపీ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు.గురువారం సాయంత్రం తరువాత కోల్‌కత్తాలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని కోల్ కతాలోని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంగళగిరి చేనేత శాలువాతో సీఎంను లోకేష్ సత్కరించారు. ఏపిలో అమలు చేస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం గురించి లోకేష్ వివరించారు.

దేశంలోనే ఏ రాష్ట్రంలో ఇవ్వనటువంటి గరిష్ఠ ప్రయోజనంతో కూడిన సంక్షేమ పథకాలు అర్హులైన వారికి పారదర్శకంగా అందజేస్తున్న ఏపీ ప్రభుత్వ మెకానిజం సీఎంకు వివరించారు. పశ్చిమ బెంగాల్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును సిఎంను అడిగి తెలుసుకున్నారు. ఏపీలో అమలవుతున్న డిజిటల్ గవర్నెన్స్, రియల్ టైమ్ మానిటరింగ్ ఫలితాలను సిఎంకు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ పశ్చిమ బెంగాల్ మధ్య ఉన్న సాంస్కృతిక బంధాలను మరింత బలోపేతం చేద్దామని కోరారు. పశ్చిమ బెంగాల్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించాలని, తిరుమలలో పశ్చిమ బెంగాల్ భవన్ నిర్మాణానికి అన్ని విధాలా సాయం అందిస్తామని సీఎంకు విన్నవించారు. మత్స్య సంపద పెంపు, ఎగుమతుల విషయంలో పరస్పర సహకారంతో మరింత అభివృద్ధి సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. మంత్రి నారా లోకేష్ ప్రతిపాదనలపై పశ్చిమ బెంగాల్ సిఎం సానుకూలంగా స్పందించారు.

# ఐపిఎస్ అధికారి సునీల్‌పై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

### ఎప్పటిలోగా సరెండర్ అవుతారు?

### సమయమివ్వాలన్న సునీల్ నాయక్ తరఫు న్యాయవాది

### విచారణ నేటికి వాయిదా

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఐపిఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పార్లమెంట్ సభ్యుడిపై కస్టోడియల్ టార్చర్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొం టున్న ఐపిఎస్ అధికారికి ముందస్తు బెయిల్ రక్షణగా మారకూడదని స్పష్టం చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయస్థానం పిటిషనర్‌ను ఉద్దేశించి 'ఎప్పటిలోగా సరెండర్ అవుతారు?' అని ప్రశ్నించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధిపై కస్టోడియల్ టార్చర్ ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని న్యాయస్థానం పేర్కొంది. పార్లమెంట్‌పై దాడి చేసిన వ్యక్తులకు, ఒక పార్లమెంట్ సభ్యుడిని కస్టడీలో వేధించిన వారికి మధ్య పెద్ద తేడా లేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి సంఘటనల్లో పాల్గొనకుండా ఒక సీనియర్ ఐపిఎస్అధికారి తనను తాను నియంత్రించుకోవాల్సిన బాధ్యత ఉందని వ్యాఖ్యానించింది. ఎంపిని వేధింపులకు గురిచేయబోతున్నారని సునీల్ కుమార్ నాయక్‌కు ముందే తెలుసునని హైకోర్టు తెలిపింది. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని పేర్కొంది.

# ఇసుక లూటీపై ఇడి విచారణ

### రాష్ట్ర మైనింగ్, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

**సచివాలయం, జూన్ 18 ప్రభాతవార్త:** గత వైసిపి ప్రభుత్వ అనాలోచిత, అడ్డగోలు నిర్ణయాల వల్ల సర్వనాశనమైన రాష్ట్ర మైనింగ్ రంగాన్ని కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్లలో విప్లవాత్మక సంస్కరణల ద్వారా తిరిగి పట్టాలెక్కించిందని రాష్ట్ర మైనింగ్, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనా లోపాల వల్ల మైనింగ్ వృద్ధి రేటు 24నుంచి 7శాతానికి పడిపోయి, రాష్ట్ర ఖజానాకు ఏకంగా రూ.19,137 కోట్ల నష్టం వాటిల్లిందని గణాంకాలతో సహా శ్వేతపత్రం విడుదల చేశారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ ఇసుక దోపిడిని తాము శాటిలైట్ డేటా ఆధారంగా సాంకేతికంగా నిరూపించామని, 5.08కోట్ల మేజర్ మెట్రిక్ టన్నుల ఇసుకను అక్రమంగా తరలించినందుకు గాను రూ.3,891 కోట్ల రికవరీ డిమాండ్ నోటీసులు జారీచేశామనిప్రకటించారు. ఈ కుంభకోణంపై ఇప్పటికే రాష్ట్రంలో ఎసిబి కేసులు, ఎఫ్‌ఐఆర్‌లు నమోదు కాగా, ప్రస్తుతం ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ కూడా రంగంలో దిగి లోతైన దర్యాప్తు జరుపుతోందని మంత్రి స్పష్టంచేశారు. 2023లో విపరీతమైన డిమాండ్ ఉన్న "సిలికా సాండ్" రంగాన్ని దౌర్జన్యంగా లాక్కొని పారదర్శక ఆన్‌లైన్ ఐడీలను బ్లాక్ చేసి కేవలం 20లీజులను "వామనా ఎంటర్‌ప్రైజెస్" అనే సిండికేట్‌కు కట్టబెట్టడం వల్లే రాష్ట్రంలోని సిమెంట్ ఫ్యాక్టరీలు పక్క రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వచ్చిందని మంత్రి మండిపడ్డారు. ఈ అక్రమాలకు పూర్తి చెక్ పెడుతూ, కూటమి ప్రభుత్వం అధికారం లోనికి వచ్చిన వెంటనే ప్రజలపై భారం మోపే సేల్స్ రేట్, డిఎంఎఫ్, మెరిట్ ఫీజులను పూర్తిగా రద్దుచేసి విప్లవాత్మక "ఫ్రీ సాండ్ పాలసీ"ని విజయవంతంగా అమలు చేస్తుందని కొల్లు రవీంద్ర వివరించారు. 5 ప్రభుత్వ శాఖలతో కూడిన "కలెక్టర్ టాస్క్ ఫోర్స్" నిరంతర పర్యవేక్షణ వల్ల మార్కెట్లో ఇసుక ధర 25నుంచి 30శాతం వరకు తగ్గిందని తెలిపారు.

# పారిశ్రామికాభివృద్ధి ఫలాలు

>> అందించాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ సేవలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకు నేలా చూడాలి. ఆర్‌టిఐహెచ్ పరిధిలోని స్టార్టప్ కంపెనీలకు వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు వచ్చేలా చూడాలి. ఈ విధానాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి. దీనికి అనుగుణంగా ఎకో సిస్టం ఏర్పాటు చేసే అంశంపై అధికారులు ఫోకస్ పెట్టాలి. ఇక వచ్చే పరిశ్రమలకు అనుగు ణంగా కరిక్యులమ్ తయారు చేసే దిశగా విద్యా శాఖ ఆలోచన చేయాలి. పరిశ్రమలు, ప్రాజెక్టుల్లో ఎలాంటి ట్రెండ్స్ వస్తున్నాయో గమనించి దానికి అనుగుణంగా కరిక్యులమ్ రూపొందించాలి. రోబో టిక్స్ లాంటి ఆధునిక టెక్నాలజీ కోర్సులు కూడా మన విద్యా సంస్థల్లో ఉండాలి. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి నాన్ సీరియస్ ప్లేయర్స్‌కు ఎపిలో చోటు లేదు. ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చాక... వెంటనే పనులు మొదలు పెట్టేలా చూడాలి. పనులు ప్రారంభించని సంస్థలతో టచ్‌లో ఉంటూ ఫాలో అప్ చేయాలి" అని సూచించారు.

**ఆటోమేషన్‌లో పారిశ్రామిక అనుమతులు:**

"ఇథనాల్ తయారీ విషయంలో ముందడుగు వేయాలి. 40 శాతం ఇథనాల్ బ్లెండ్ చేసేందుకు కేంద్రం అంగీకరిచింది. ఇథనాల్ తయారీ పరిశ్రమ లను ప్రోత్సహిస్తే రైతులకు ప్రయోజనం కలుగు తుంది. ఇథనాల్ బేస్డ్ ఇంధనం ఎక్కువగా ఉపయో గిస్తే దిగుమతి చేసుకునే ఇంధన భారం తగ్గు తుంది. బయో ఫ్యూయల్స్ రంగాన్ని మరింత ప్రోత్సహించాల్సి ఉంది. ఈ విష యంపై ఆయిల్ కంపెనీలతో సంప్రదింపులు జరపాలి. అలాగే వివిధ రంగాల్లో ప్రాజెక్టులు తీసుకురావడంతో పాటు.. విద్యుత్ సరఫరా అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రాజెక్టులు వచ్చేలా చూడాలి. ఈ ఏడాది డిమాండ్‌లో 17 శాతం వృద్ధి నమోదైంది. ఐటి, పరిశ్రమలు, వాణిజ్య విభాగాల వినియోగానికి అనుగుణంగా విద్యుత్ ఎంత అవసరం అవుతుందో అంచనాలు తయారు చేయాలి. సోలార్ విండ్, పంప్డ్ స్టోరేజితో పాటు బిఇఎస్‌ఎస్ టెక్నాలజీకే ఇక భవిష్యత్తు. 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీకి అనుగుణంగా పంప్డ్ స్టోరేజి సహా ఇతర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు చేపట్టాలి. లీథియం అయాన్ బ్యాటరీల ఉత్పత్తిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఇవిలకు ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీలపై దృష్టి పెట్టాలి. బ్యాటరీ టెక్నాలజీపై ఎక్కువ దృష్టి పెట్టండి. డేటా సెంటర్ల ఏర్పాటు విషయంలో విద్యుత్ వినియోగం అనేది అత్యంత కీలకం. డేటా సెంటర్ల అనుమతుల విషయంలో దీన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఇక మైక్రో ఇరిగేషన్ రైతుల కోసం మైక్రో ఇరిగేషన్ ఎక్విప్మెంట్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి. మైక్రో ఇరిగేషన్ పరికరాల తయారీ కంపెనీలను ఎంకరేజ్ చేద్దాం. అమరావతిలో ఎఐ, ఆల్గారిథమ్స్ క్వాంటం అప్లికేషన్ల రూపకల్పన మొదలైంది. ప్రాజెక్టుల అనుమతులు, భూ కేటాయింపులు వంటివి సులభతరంగా అందించాలి. మరోవైపు ఆటోమొబైల్ పరిశ్రమలకు శ్రీసిటీ సహా అనంతపురం జిల్లా కూడా కీలకం. తిరుపతి, శ్రీసిటీలు రాయల్ ఎన్‌ఫీల్డ్, ఇసుజు, హీరో లాంటి ఆటోమొబైల్ కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయి. అనంతపురంలో కియా కార్ల ఉత్పత్తి జరుగుతోంది. పుట్టపర్తిలో 5వ జనరేషన్ ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ కేంద్రం వేగంగా గ్రౌండ్ కావాలి. ఫైటర్ జెట్ తయారీ కేంద్రం పనుల విషయంలో నిరంతరం ఫాలో అప్ చేస్తూ ఉండాలి. కేంద్రానికీ ఎప్పటికప్పుడు నివేదికలివ్వాలి. ఏమైనా ఇబ్బందులు వస్తే వెంటనే పరిష్కారం చూపాలి. బెంగళూరు- పుట్టపర్తి డిఫెన్సు కారిడార్‌గా మారుతుంది. ఏరోస్పేస్ కారిడార్‌గా ఈ ప్రాంతాన్ని మార్చాలి. తాడిపత్రి-అనంతపూర్ మధ్య ఓ ఎయిర్ స్ట్రిప్ వచ్చేలా చూడాలి" అని సిఎం చంద్రబాబు సూచించారు.

**జొన్నగిరి... స్వర్ణగిరి:**

"పర్యాటకులు ఎక్కువ సమయం రాష్ట్రంలో గడిపేలా హోటళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి. మహీంద్రా క్లబ్ సంస్థ బీచ్ రిసార్ట్స్, పులికాట్ లేక్ వద్ద కూడా ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. అరకు లాంటి ప్రాంతాల్లోనూ ఐటిడిఎ భాగస్వామ్యంతో మహీంద్రా ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. టెంపుల్ టూరిజంను ప్రోత్సహించేలా కొత్తగా అభివృద్ధి చెందుతున్న పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలను గుర్తించి వాటి వద్ద పెట్టుబడులు వచ్చేలా చూడాలి. తిరుపతి, అమరావతి, విశాఖలలో బాబా రామ్‌దేవ్ యోగా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. గండికోట, పోలవరం ప్రాజెక్టు, అనంతపురం, కర్నూలు వద్ద పెద్ద ఎత్తున హోటళ్లు రావాల్సి ఉంది. హార్సిలీ హిల్స్ వద్ద మంచి రిసార్టులు ఏర్పాటు చేస్తే టూరిస్టులు మరింతగా పెరుగుతారు. సూర్యలంక బీచ్ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలి. బెస్ట్ బీచ్ టూరిజం స్పాట్‌గా సూర్యలంకను తీర్చిదిద్దాలి. పర్యాటక కార్యకలాపాలు పెద్ద ఎత్తున జరిగేలా చర్యలు చేపట్టాలి. అమరావతిలో వచ్చే పెట్టుబడులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఓ కేంద్రీకృత వ్యవస్థను ఏర్పాటు చేయాలి. డిస్ట్రిక్ట్ కూలింగ్, పైప్డ్ గ్యాస్, విద్యుత్ లాంటివి పూల్‌గా ఇచ్చే పరిస్థితి వస్తే ప్రాజెక్టుల వ్యయం తగ్గుతుంది. రేర్ ఎర్త్ మినరల్స్‌కు ఎపి కేంద్రంగా మారాలి. రేర్ ఎర్త్ మినరల్స్‌కు సంబంధించిన ఎండ్ టూ ఎండ్ సొల్యూషన్స్ ఎపిలో అందుబాటులో ఉండేలా ఎకోసిస్టమ్ రావాలి. రేర్ ఎర్త్ మినరల్స్‌పై ఓ ప్రత్యేక విద్యా సంస్థ ఏర్పాటు చేస్తే బాగుంటుందేమో ఆలోచన చేయాలి. జొన్నగిరి గోల్డ్ మైన్ 1000 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. జొన్నగిరి అత్యంత పురాతన చరిత్ర ఉంది. ఒకప్పుడు జొన్నగిరికి స్వర్ణగిరి అని పేరుంది. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ రంగానికి ప్రాధాన్యత, ప్రోత్సాహం ఇవ్వాలి. విశాఖ నగరంలో ప్రస్తుత సదుపాయాలను మరింత మెరుగు పరుస్తూనే శాటిలైట్ టౌన్ షిప్‌లు అభివృద్ధి జరిగేలా చూడాలి. పరిశ్రమలతో పాటు.. హౌసింగ్ కూడా ఉండాలి. పారిశ్రామిక ప్రాంతాల వద్ద అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు జరిగేలా చూడాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

# గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటు చేయండి

>> నది కావడంతో, ఎలాంటి కాలయాపన చేయకుండా సొసైటీ త్వరగా కార్యరూపం దాల్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గురువారం వెలగపూడి సచివాలయంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ 'రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఒక నర్సరీ ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలి. ఎక్కడైనా పంచాయతీలో ఏర్పాటు సాధ్యం కాకపోతే, కనీసం మూడు, నాలుగు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా చేసి, ఉమ్మడిగా ఒక నర్సరీ ఉండేలా వెంటనే పనులు ప్రారంభించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'విబి జి రామ్ జీ' పథకం కిందకు నర్సరీల పెంపకాన్ని కూడా అనుసంధానించాం. ఈ పథకం ద్వారా లభించే నిధులు, ఉపాధి దినాలను సమర్థంగా ఉపయోగించుకుని, గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలి" అన్నారు.

**ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లండి:**

పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చల్లడానికి 2.6 కోట్ల సీడ్ బాల్స్ సిద్ధం చేసినట్లు అటవీ శాఖ అధికారులు డిప్యూటీ సిఎం పవన్‌కి తెలియజేశారు. ఈ వర్షాకాలంలోనే వీటిని అటవీ, ఖాళీ ప్రాంతాలలో వెదజల్లేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. కొండ కోనల్లో విత్తనాలను చల్లడానికి ఈసారి సుమారు 40 నుంచి 50 అత్యాధునిక డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు అధికారులు వివరించారు.

ఈ ప్రణాళికపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, "సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితం చేయకుండా, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలి. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలను కలుపుకొని దీనిని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలి" అని సూచించారు.

**అరుదైన మొక్కల సంరక్షణపై అభినందనలు:**

రాష్ట్రంలో అంతరించిపోతున్న అరుదైన వృక్ష జాతులను రక్షించేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అటవీ శాఖ ఉన్నతాధికారులైన పిసిసిఎఫ్, హెచ్‌ఓఎఫ్‌ఎఫ్ లను, వాళ్ల బృందాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో పాములేరు వాగు వెంబడి కేవలం 10 మాత్రమే మిగిలి ఉన్న అత్యంత అరుదైన, అంతరించిపోతున్న వెదురు జాతిని అధికారులు గుర్తించారు. క్షేత్రస్థాయిలో చేసిన లోతైన పరిశోధనలు, ఆధునిక మాలిక్యులర్ సైన్స్ ద్వారా ఈ కొత్త జాతిని గుర్తించారు. దీనికి 'బాంబూసా ఆంధ్రికమ్' అని నామకరణం చేశారు.

ఈ చివరి పది మొక్కలను కాపాడటమే కాకుండా, వాటి సంఖ్యను మరింత పెంచేందుకు అటవీ శాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయడం పట్ల డిప్యూటీ సిఎం పవన్ అభినందించారు. అదేవిధంగా, శేషాచలం అడవుల్లో మాత్రమే కనిపించే, ప్రస్తుతం అంతరించిపోయే దశకు చేరిన ఈత చెట్టు మాదిరి ఉండే 'సైకాస్ శేషాచలన్సిస్' మొక్కల పెంపకానికి, వాటి సంరక్షణకు కూడా అటవీ శాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేస్తుందని తెలుసుకొని అభినందించారు. ఈ సమావేశంలో అటవీ పర్యావరణశాఖల ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్థిక శాఖ కార్యదర్శి వినయ్ చంద్, పిసిసిఎఫ్ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, సిసిఎఫ్ సోషల్ ఫారెస్ట్, జూలాజికల్ పార్క్స్ బి.ఎన్.ఎన్. మూర్తి, సిసిఎఫ్ వైల్డ్ లైఫ్ ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

19-06-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
పంచమి సా.5.06,
ఆశ్లేష ఉ.10.10
వర్జ్యం : రా.9.49-రా.11.23
దు.ఉ.8.12-ఉ.9.04, 2)మ.12.35-మ.1.27
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** బ్యాంకు లావాదేవీలు అనుకూలిస్తాయి. కీలక నిర్ణయంలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది.

**వృషభం:** సేవా కార్యక్రమాలలో పాల్గొం టారు. భూముల విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. వస్త్రలాభం.

**మిథునం:** వృత్తిలో మెలకువలు అవసరం. వాతావరణంలో స్వల్ప మార్పుల వలన ఆరోగ్యం మీద కొంతమేర ప్రభావం ఉంటుంది.

**కర్కాటకం:** అయిష్టంగా కొన్ని కార్యక్రమాలు చేయవలసి రావడం కొంత ఇబ్బందికి లోను చేస్తుంది. ఆస్తి వివాదాలు.

**సింహం:** జీవిత భాగస్వామి సహకారం మీకు మనోధైర్యాన్నిస్తుంది. భాగస్వామ్య వ్యాపారాలు మినహా ఇతర వ్యాపారాలు అనుకూలం.

**కన్య :** ఉద్యోగాల పరంగా అదనపు బాధ్యతలు నిర్వహించవలసి వస్తుంది. నమ్మి ఎవరికి పనిని అప్పగించవద్దు.

**తుల :** ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు కీలకమైన పత్రాలపై సంతకాలు చేయునప్పుడు జాగ్రత్తలు పాటించండి.

**వృశ్చికం:** ప్రతి వాతావరణంలో కొన్ని అనుకూలంగా ఫలితాలు సాధిస్తారు. మీ వైరి వర్గం మిమ్ములను బాధించకపోవడం ఊరట కలిగిస్తుంది.

**ధనుస్సు:** ఒర్పు నేర్పులతో మందకొండిగా సాగుతున్న వ్యవహారాలలో కొంత పురోభివృద్ధి సాధిస్తారు. వాహన సౌఖ్యం.

**మకరం:** కార్యాలయంపై అధికారులకు వివరణ ఇచ్చుకోవలసి వస్తుంది. వివాదాలకు దూరంగా ఉండండి. స్పెక్యులేషన్ లాభించదు.

**కుంభం:** పుకారులకు ప్రాధాన్యత నివ్వడం వలన నిజానిజాలు తెలుసుకోవడంలో వైఫల్యం చెందుతారు. బంధువుల కలయిక.

**మీనం:** సెల్ఫ్ డ్రైవింగ్ సాధ్యమైనంత వరకు చేయక పోవడం ఉత్తమం. ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జగన్ మాతో వస్తే మేం చేసిన అభివృద్ధి ఏంటో చూపిస్తా

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్18(ప్రభాతవార్త):** ప్రధాని మోడీ చలువ సిఎం చంద్రబాబు చొరవ తోనే రాష్ట్రానికి రెండేళ్లలోనే ఎన్నడు లేని విధంగా 10 లక్షల కోట్ల రూపాయలు నిధులు వచ్చాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ స్పష్టం చేశారు.తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బిజెపి అధ్యక్షుడు మాధవ్ పర్యటించారు. పోస్టల్ శాఖ ద్వారా ప్రవేశపెట్టిన పథకాల నమోదు స్టాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం 35 వేల కోట్ల రూపాయలు ఇచ్చిందని, విశాఖ రైల్వే జోన్ ప్రధాని ప్రధాని సాధ్యం చేశారని గుర్తు చేశారు. జగన్, షర్మిల పాదయాత్ర చేసి ఈ అభివృద్ధిని చూసుకోవాలని ఎద్దేవా చేశారు డీఎస్సీ పోస్టుపై అధికారులు వివరణ ఇచ్చిన జగన్ ఫ్రెస్టేషన్లో రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.

పేదల సంక్షేమానికి 160కిపైగా పథకాలను ప్రధాని మోడీ ప్రవేశపెట్టారన్నారు. పోస్టల్ డిపార్టుమెంట్ ద్వారా పొదుపు, బీమా పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కేవలం రూ.750 చెల్లిస్తే రూ.15లక్షల ప్రమాద బీమా కల్పించారని, డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు.

అమరావతి నిర్మాణానికే కేంద్రం రూ.30 వేల కోట్ల నిధులు ఇచ్చిందన్నారు. జగన్ మాతో వస్తే , మేం చేసిన అభివృద్ధి ఏంటో చూపిస్తామని మాధవ్ అన్నారు. ఫ్రస్టేషన్, సెన్సేషన్ కోసమే జగన్ కొత్త నాటకాలని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో డీఎస్సీ అత్యంత పారదర్శకంగా జరిగిందని మాధవ్ స్పష్టం చేశారు.



వారణాసిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం నమామి గంగే సభ్యులు గంగానదిలో 'జలయోగా' చేస్తున్న దృశ్యం

# అనాథ పిల్లలకు 'తల్లికి వందనం'

>> లభిస్తుందని మంత్రి లోకేష్ అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెం.1 స్థానంలో ఉందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో విద్యాశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎంశ్రీ పథకంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన అధికారులను మంత్రి లోకేష్ అభినందించారు. కడప మోడల్‌లో ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభించామని, మెగా పిటిఎం నాటికి పూర్తిస్థాయిలో కిట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 430 కెజిబివిల్లో విద్యనభ్యసిస్తున్న 1,06,360 మంది విద్యార్థినులకు 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అన్నారు. కెజిబివిలతో పాటు ఎపి రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో కూడా బంక్ బెడ్స్ ఏర్పాటుచేయాలని మంత్రి ఆదేశించారు.

**జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు కిట్స్ పంపిణీ**

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్ల పంపిణీ చేపట్టినట్లు మంత్రి లోకేష్ చెప్పారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూళ్ల అనుమతుల్లో అనవసరమైన నిబంధనలను తొలగించాలని అన్నారు. ప్రైవేటు స్కూళ్లలో నిర్ణయించిన ఫీజులను స్కూళ్ల వెలుపల బోర్డులపై ప్రదర్శించడంతోపాటు పబ్లిక్ డొమైన్‌లో పొందుపర్చాలని మంత్రి లోకేష్ ఆదేశించారు.

**తెలుగు అకాడమీ పుస్తకాలు ఇక ఆన్‌లైన్‌లో:**

తెలుగు అకాడమీ ముద్రించే టెక్స్ట్‌బుక్స్ ప్రజలందరికీ సులభంగా అందుబాటులోకి వచ్చేలా అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి ప్రముఖ ఇ-కామర్స్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్స్ ద్వారా విక్రయించాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. ప్రజలు నేరుగా ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసే సదుపాయాన్ని వీలైనంత త్వరగా కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.

**విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరుపై ప్రత్యేక దృష్టి:**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు వారి హాజరు శాతాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యాశాఖ మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన కర్నూలు, అనంతపురం, మార్కాపురం, అల్లూరి సీతారామరాజు, పోలవరం తదితర జిల్లాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆయా జిల్లాలలో ఉపాధ్యాయుల లభ్యతను సమీక్షిస్తూ విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఒక ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేయాలని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల పాఠశాల హాజరు 95శాతానికి తగ్గకుండా పక్కా చర్యలు తీసుకోవాలని, అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా అత్యంత పారదర్శకంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**మాతృభాషను విస్మరించొద్దు**

పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలవుతున్న విద్యార్థుల్లో అధికశాతం మ్యాథ్స్, సైన్స్, తెలుగు సబ్జెక్టుల్లో విఫలమవుతున్న విషయాన్ని అధికారులు మంత్రి లోకేష్‌దృష్టికి తెచ్చారు. "ఎట్టిపరిస్థితుల్లో మాతృభాష తెలుగును విస్మరించొద్దు, ఈ విషయంలో ఉపాధ్యాయులను అప్రమత్తం చేయండి, ఆయా సబ్జెక్టుల్లో బ్రిడ్జి కోర్సు మెటీరియల్ తయారుచేసి విద్యార్థులకు అందజేయాలి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఇప్పటినుంచే వారికి అదనపు తరగతులు నిర్వహించి శిక్షణ ఇవ్వాలి" అని అధికారులకు మంత్రి లోకేష్ సూచించారు.

# అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందం

### చారిత్రక డీల్‌పై వర్చువల్‌గా ట్రంప్, పెజెష్కియాన్ సంతకాలు

### తక్షణమే అమల్లోకి... పశ్చిమాసియాలో సైనిక చర్య ముగింపు

### నేడు స్విట్జర్లాండ్‌లో చర్చలు... 60 రోజుల్లో తుది ఒప్పందం

### తెరుచుకున్న హార్ముజ్ జలసంధి.. తగ్గిన ముడిచమురు ధరలు

**పారిస్, జూన్ 18:** అమెరికా- ఇరాన్ మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ ఇరు దేశాల అధ్యక్షులు చారిత్రాత్మక మైత్రి ఒప్పందంపై అధికారికంగా సంతకాలు చేశారు. అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు 19వ తేదీన ఇరు దేశాలు అధికారికంగా శాంతి ఒప్పందం చేసుకోను న్నాయి. 14అంశాల ఆధారంగా ఇరు దేశాలు ఒప్పందం చేసుకు న్నాయి. గురువారం ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ వర్చువల్ పద్ధతిలో 14 అంశాల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. గత కొంతకాలంగా కొనసాగుతున్న శత్రుత్వానికి బ్రేక్ వేస్తూ జరిగిన ఈ ఒప్పందం అంతర్జాతీయ దౌత్య రంగంలో ఒక ముందడుగుగా నిలిచింది. ఫ్రాన్స్‌లోని వర్సాలీస్ ప్యాలీలో జరిగిన ప్రత్యేక విందు సందర్భంగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సమక్షంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందంపై సంతకం చేయగా, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెస్కి యాన్ కూడా టెహ్రాన్ నుంచి దీనికి ఆమోదం తెలపడంతో ఈ ఒప్పందం తక్షణమే అమలులోకి వచ్చింది. అయితే, ఈ చారిత్రాత్మక ఒప్పందం అంత సులభంగా సాధ్యపడలేదు. కొన్ని నెలలుగా ఒమన్ తో ఇతరదేశాలు నేతృత్వంలో తెరవెనుక తీవ్రమైన దౌత్య సంప్రదింపులు జరిగాయి.పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న తరుణంలో, ఇరు దేశాలు పట్టువిడుపులకు వెళ్లకుండా ఒప్పందానికి ముందుకు వచ్చాయి. అమెరికా ఇరాన్ మధ్య ఒప్పం దంలో ఇరు దేశాలు అంతర్జాతీయ శాంతిని దృష్టిలో ఉంచుకుని ఈ ఒప్పందానికి అంగీకరించాయి.

**నేడు స్విట్జర్లాండ్‌లో చర్చలు:** అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరగా, ఇప్పుడు దాన్ని అమలు చేసేందుకు ఇరు దేశాలు సిద్ధ మవుతున్నాయి. ఈమేరకు తొలి దశ చర్చలు స్విట్జర్లాండ్‌లో జరగనున్నాయి. శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని బుర్గెన్‌స్టాక్ పర్వత ప్రాంత రిసార్ట్‌లో అమెరికా, ఇరాన్ ప్రతినిధులు సమావేశం కానున్నట్లు స్విస్ ప్రభుత్వం వెల్లడించింది. అందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. స్విస్ విదేశాంగ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, అమెరికా, ఇరాన్‌తో పాటు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులుకూడా ఆ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ తాత్కాలిక అవగాహన ఒప్పందాన్ని పూర్తి స్థాయి శాశ్వత ఒప్పందంగా మార్చడానికి ఇరు దేశాలకు 60 రోజుల గడువును విధించారు.

# మద్యం స్కాం కేసు.. సునీల్ అరెస్ట్

### హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న ఇడి

### కోర్టుకు తరలింపు... 14 రోజుల రిమాండ్

### కారుమూరి నాగేశ్వరరావుకు ఇడి నోటీసులు

**విజయవాడ,జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం రవాణా కుంభకోణం, మనీలాండరింగ్ కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ వేగవంతం చేసింది. ఈ కేసులో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్ కుమార్‌ను ఈరోజు హైదరా బాద్‌లో ఇడిఅధికారులు అరెస్ట్‌చేశారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఎ) కింద ఈ అరెస్ట్ జరిగింది. తాజా పరిణామాలతో ఈ స్కామ్‌లో ఇడి అధికారికంగా అరెస్ట్ చేసిన వారి సంఖ్య మూడుకు చేరింది. సునీల్ తరఫున సీనియర్ న్యాయవాది అశోక్‌రెడ్డి వాదనలు వినిపించారు. సిగ్మా, సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు మద్యం రవాణాలో అక్రమాలు జరిగాయని ఇడి కోర్టుకు తెలిపింది. కారుమూరి నాగేశ్వరరావు పలుకుబడితో కాంట్రాక్టులు దక్కించుకున్నారని పేర్కొంది. ఈ కేసులో కారుమూరి కుమారుడు సునీల్ భారీగా లబ్ధి పొందినట్లు ఆధారాలు ఉన్నాయని చెప్పింది. కారుమూరి కుటుంబసభ్యుల మధ్య రూ.7 కోట్ల లావాదేవీలు జరిగినట్లు ఆధారాలున్నాయని ఇడి కోర్టుకు వివరించింది.కాంట్రాక్టులు ఇప్పించిందుకు సునీల్‌కు సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ నుంచి రూ.28 కోట్లు ముడుపులు వచ్చాయని పేర్కొంది. ఈ కేసులో లోతైన దర్యాప్తు జరుగుతోందని వెల్లడించింది. అన్ని ఆధారాలను సరైన సమయంలో కోర్టుకు సమర్పిస్తామని చెప్పింది. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు కారుమూరి సునీల్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం సునీల్‌ను చంచల్‌గూడ జైలుకు ఈడీ అధికారులు తరలించారు.

**కారుమూరి నాగేశ్వరరావుకు ఇడి నోటీసులు**

మద్యం రవాణా కుంభకోణం కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు ఇడి నోటీసులు జారీ చేసింది. ఈనెల 23న హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని తెలిపింది. సిగ్మా సంస్థ నుంచి సునీల్‌కు చెందిన సుదర్శన కన్‌స్ట్రక్షన్ సంస్థ సబ్ కాంట్రాక్ట్ పొందింది. కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మద్యం రవాణా బాధ్యతలను సునీల్ హైదరాబాద్ కార్యాలయం నుంచే పర్యవేక్షించారు.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
విశాఖపట్నం
: fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 139 పేజీలు: 16 వెల: 6.50

బెంగాల్ సిఎం సువేందుతో
## మంత్రి లోకేష్ భేటీ
జగన్ మాతో వస్తే అభివృద్ధి చూపిస్తాం: మాధవ్
2లో

# పేదలకూ పారిశ్రామికాభివృద్ధి ఫలాలు

- ఇథనాల్, సెమీ కండక్టర్ల పరిశ్రమలకు ప్రోత్సాహం
- ఆటోమేషన్‌లో పారిశ్రామిక అనుమతులు: సిఎం చంద్రబాబు
- ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేస్తేనే ప్రోత్సాహకాలు: మంత్రి లోకేష్
- ఎస్ఐపిబి సమావేశంలో రూ.30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం


గురువారం సచివాలయంలో ఎస్ఐపిబి సమావేశంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** పారిశ్రామికాభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఎపిలో ఏర్పాటయ్యే పారిశ్రామిక ఎకో సిస్టంను రూపొందించాలని సిఎం స్పష్టం చేశారు. పరిశ్రమలు, కంపెనీలను ధనికులే స్థాపించగలరనే భావన పోయేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సిఎం చంద్రబాబు నేతృత్వంలో 18వ ఎస్ఐపిబి సమావేశం జరిగింది. ఈసమావేశంలో వివిధ కంపెనీల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. మొత్తంగా 50 కంపెనీలకు సంబంధించి రూ.30,515 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపిబి ఆమోదం తెలిపింది. ఈ కంపెనీల ద్వారా మొత్తంగా 29,677 ఉద్యోగాలు రానున్నాయి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలి. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా పేద, మధ్య తరగతి వారికి ఉద్యోగాలు కల్పించడమే కాదు... సామాన్యులు కూడా కంపెనీలు స్థాపించే అవకాశం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు స్టార్టప్ కంపెనీలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం >>2

## పొగాకు రైతులను ఆదుకుంటాం

- ఏదైనా కెజి రూ.200 తగ్గకూడదు
- నో బిడ్... లో బిడ్ ఉండకూడదు
- మార్కెట్‌కు వచ్చిన పంట కొనాల్సిందే
- అనధికార కొనుగోళ్లపై కఠిన చర్యలు
- కేంద్ర ప్రభుత్వంతోనూ మాట్లాడతాం
- ట్రేడర్లు, పొగాకు రైతుల భేటీలో సిఎం

6లో

## ఆక్వా ఫీడ్ ధర కెజికి రూ.4 తగ్గింపు

- కంపెనీల అంగీకారం...
- ధరల స్థిరీకరణపై కమిటీ
- రైతులు, ఫీడ్ తయారీదారులతో సమావేశంలో సిఎం


గురువారం సచివాలయంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

## గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటు చేయండి

- జులై 3నాటికి ప్రక్రియ పూర్తి కావాలి
- ప్రతి గ్రామంలో నర్సరీ ఉండాల్సిందే
- విబి జి రామ్‌జి కింద నర్సరీల పెంపకం అనుసంధానం
- ప్రజా ఉద్యమంలా సీడ్ బాల్స్ ప్రోగ్రాం
- అటవీ శాఖ అధికారులకు డి.సిఎం పవన్ ఆదేశం

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా ప్రతిపాదించిన 'గ్రీనింగ్ సొసైటీ' ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. జులై 3వతేదీ నాటికి ఈ సొసైటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి కావాలని స్పష్టం చేశారు. గ్రీనింగ్ సొసైటీకి సంబంధించిన నిబంధనలు, నియామకాలు, విధివిధానాల ప్రతిపాదనలన్నీ కచ్చితంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2025కి అనుగుణంగానే ఉండేలా చూసుకోవాలని స్పష్టంచేశారు. ఈప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగి >>2


గురువారం విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేష్

## అనాథ పిల్లలకు 'తల్లికి వందనం'

- పిఎంశ్రీ నిధుల వినియోగంలో ఎపి నం.1
- జూనియర్ కాలేజీ విద్యార్థులకు కిట్స్ పంపిణి
- మాతృభాషను విస్మరించొద్దు
- కస్తూరిబా హాస్టళ్లలో బెడ్స్ ఏర్పాటు చేయండి
- విద్యాశాఖ అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశం

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని అనాథ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకం డబ్బులు అందేలా పక్కా చర్యలు తీసుకోవాలని అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఈ పథకం అమలు కోసం పిల్లల గార్డియన్ల వివరాలను కచ్చితంగా సేకరించాలని, ఒకవేళ ఎవరూ లేని పక్షంలో ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, అక్కడ నుండి పిల్లలకు అందేలా చూడాలని స్పష్టం చేశారు. అంతే కాకుండా, అనాథ పిల్లల బ్యాంక్ ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేసి, వారి చదువు పూర్తయిన తర్వాత ఆ సొమ్మును స్వతంత్రంగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానం ఆలోచన చెయ్యాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అటువంటి నిర్ణయం తీసుకోవడం వలన తల్లిదండ్రులు లేని పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా, వారి భవిష్యత్తుకు బలమైన ఆర్థిక భరోసా >>2



## కోల్‌కత్తాలో మంత్రి లోకేష్ నేడు ఐసిసి సదస్సుకు హాజరు

**విజయవాడ,జూన్18,ప్రభాతవార్తప్రతినిధి:** పెట్టుబ డులే లక్ష్యంగా ప్రతి అవకాశాన్ని ఏపీ రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వినియోగించుకుంటున్నారు.ఈ క్రమం లోనే గురువారం సాయంత్రం కోల్ కతా నగరా నికి వెళ్ళారు. అక్కడ పశ్చిమ బంగా ప్రభుత్వ అధికారులు. స్థానిక తెలుగు సంఘం సభ్యులు, టీడీపీ శ్రేణులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.ఇక ఈ నెల 19న శుక్రవారం ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(ఐసిసి) ఆధ్వ ర్యంలో ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాల్లు అనే అంశంపై ఐటీసీ సోనార్ హోటల్ లో జరిగే ప్లీనరీలో పాల్గొంటారు.

## ఎక్సైజ్ శాఖలో ఇద్దరికి పదోన్నతి

**విజయవాడ,జూన్18,ప్రభాతవార్తప్రతినిధి:** ఎక్సైజ్ శాఖలో ఇద్దరు అధికారులకు పదోన్న తులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఎక్సైజ్ శాఖలో అదనపు కమిషనర్‌గా వి.అన సూయదేవికి, ఎక్సైజ్‌శాఖలో జాయింట్ కమిష నర్‌గా డి.శ్రీకాంత్‌రెడ్డికి పదోన్నతి ఇచ్చారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని వాటి లో స్పష్టం చేసారు.

## పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులలో ప్రవేశాలు

**తిరుపతి, జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాల యంలో 2026-27 విద్యాసంవత్సరానికి పలు కోర్సు లలో ప్రవేశాల కోసం అర్హత గల అభ్యర్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించబడు తున్నాయి సర్టిఫికెట్ కోర్స్ ఇన్ పల్లియేటివ్ కేర్ పిజిడి ప్లొమా ఇన్ డేటా సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ డిప్లొమా ఇన్ యోగా,పిజి డిప్లొమా ఇన్ యోగా ఆసక్తిగల అభ్యర్థినులు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఎస్‌పిఎంవివి. ఎసి. ఇన్"నుండి దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసు కొని, పూర్తి చేసిన దరఖాస్తును జులై 15వతేదీ సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య పి. సువర్ణలతా దేవి తెలిపారు.కోర్సుల అర్హతలు, ఫీజులు, దరఖాస్తు విధానం తదితర పూర్తి వివ రాల కోసం"డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు. ఎస్‌పిఎం వివి. ఎసి.ఇన్" వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని ఆమె పేర్కొన్నారు.

## మనస్థాపంతో మహిళ మృతి

**సంతకవిటి (విజయనగరం జిల్లా), జూన్ 18 (ప్రభాతవార్త):** సంతకవిటి మండలంలో రామ రాయపురం గ్రామానికి చెందిన కళావతి పొం దూరు మండలంలో పెనుబర్తి సమీపాన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. అయితే దొం గతనం కేసులు కళావతిని, కుమారుడు చిరం జీవిని పోలీసులు పదేపదే విచారణ చేయడంతో ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని కుమారుడు చిరంజీవి చెప్పాడు. అయితే రామారాయంపు రం గ్రామంలో గత నెల 25వ తేదీన ఒక వ్యక్తి ఇంట్లో నాలుగు తులాల బంగారం, పదివేల నగదు దొంగతనం జరిగింది. అయితే ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు చెప్పిన వివరాల ప్రకారం స్థానిక ఎస్సై అనుమాని తులుగా కళావతిని మరియు కుమారుడు చిరంజీవిని విచారణ పేరిట పోలీస్‌స్టేషన్‌కు పదేపదే పిలవడంతో వారిద్దరూ మనస్థాపానికి గురైనట్టు తెలుస్తోంది. అయితే మంగళవారం కూడా మరోసారి స్టేషన్‌కు రావాలని సమాచారం అందించడంతో ఇద్దరు వెళ్లారు. అక్కడ ఎస్సై



గోపాలరావు అందుబాటులో లేకపోవడంతో తిరిగి ఇంటికి బయలుదేరారు. ఇంటికి వస్తున్న సమయంలో ఇద్దరు తీవ్ర మనస్థాపానికి గురై వారు పదేపదే స్టేషన్‌కి రమ్మని పిలవడం ఊర్లో ఉండేవారు వారిపై దొంగలుగా ముద్రలు వేయ డంతో వీరు ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయిం చుకున్నారు. అయితే వీరిద్దరూ పెనుబర్తి సమీపంలో రైల్వే పట్టాల వద్ద రైలు దగ్గరకి సమీపిస్తుండగా చివరి క్షణంలో తల్లి, కుమా రుడు చిరంజీవిని బలవంతంగా పక్కకు నెట్టి తాను రైలు కింద పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయింది. తన కళ్ళముందే తల్లి చనిపోవడం చూసి కుమారుడు మానసిక వేదనతో క్రుంగి పోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**విజయవాడ,జూన్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను మంత్రి నారా లోకేశ్ గురువారం విడుదల చేశారు. ఇంటర్ ఫలితాల లింక్ ద్వారా లేదా వాట్సప్ నంబర్ 9552300009 ద్వారా రిజల్ట్స్ తెలుసుకోవచ్చని తెలిపారు. ఇంట ర్మీడియట్ లో రెండో ఏడాది విద్యార్థులకూ ఇంప్రూవ్‌మెంట్ రాసుకునే అవ కాశం కల్పించడంతో 1.83 లక్షల మందికి పైగా విద్యా ర్థులు తమ మార్కులను మెరుగు పరుచు కున్నారని మంత్రి వెల్లడించారు. ద్వితీయ సంవ త్సరం పరీక్ష రాసిన 91,303 మందిలో 48,149 మంది (53 శాతం) విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని లోకేశ్ వివరించారు. కొ త్తగా పరీక్షరాసిన 1,02,018 మందిలో 57,327 మంది (56శాతం) విద్యార్థులు పాసై, తమ స్కోరును పెంచుకున్నారని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులందరూ ఉన్నత చదువుల వైపు మరింత ఆత్మవిశ్వా సంతో అడుగులు వేయాలని, వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలని లోకేశ్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గతంలో ఫెయిల్ అయిన దాదాపు 1లక్ష మంది విద్యార్థులు ఈ పరీ క్షల ద్వారా పాసై, తమ విద్యాసంవత్సరాన్ని కాపాడు కున్నా రని లోకేశ్ పేర్కొన్నారు. పట్టుదలతో శ్రమించి పరీక్షల్లో విజయం సాధించి మార్కులు మెరుగు పరుచుకున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. ప్రథమసంవత్సరం పరీక్ష రాసిన 2,29,034 మందిలో 1,35,435 మంది (59 శాతం) విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుప రుచుకున్నారని వివరించారు. కొత్తగా పరీక్ష రాసిన 1,09,003 మందిలో 42,379 మంది (39 శాతం) విద్యార్థులు పాసై, మార్కులను పెంచు కున్నారని లోకేశ్ వెల్లడించారు. ఈ ఏడాది ఇంటర్ సెకండియర్ విద్యార్థులకూ ఇంప్రూవ్ మెంట్ సదుపాయం కల్పించారు.గతంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మాత్రమే ఈ అవ కాశం ఉండగా ఈసారి ద్వితీయ ఇంటర్ విద్యా ర్థులూ తమ మార్కుల్ని మెరుగు పరుచుకొనే అవకాశం కల్పిం చారు. విద్యార్థి రాసిన పరీక్షల్లో ఏ ప్రయత్నంలో ఎక్కువ మార్కులు వస్తే, వాటినే తుది ఫలితంగా పరిగణిస్తారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఇంప్రూవ్‌మెంట్ రాసే అవకాశంలేదు. ఇతర రాష్ట్రాల బోర్డుల్లో అమల్లో ఉన్న ఇంప్రూవ్ మెంట్ విధానాలను పరిశీలించిన అనంతరం చర్చించి

# మారుమూలలకు బిఎస్ఎన్ఎల్ సేవలు విస్తరించాలి

### చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు



గురువారం టెలికం అడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి దగుమళ్ళ ప్రసాదరావు

**తిరుపతి,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బిఎస్ఎన్ఎల్ సేవ లను చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లో మారుమూల గ్రా మాలకు చేరువ చేసేందుకు చర్యలు తీసుకోవాలని చిత్తూరు ఎంపి దగ్గుమళ్లప్రసాదరావు, బిఎస్ ఎన్ఎల్ పిజిఎం ఎవి కుమార్ తెలిపారు. సాం కేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని 57 కొత్త 4జి మొబైల్ టవర్స్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలోని బిఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉదయం టెలికాం అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ ఛైర్మన్ చిత్తూరు ఎంపి ప్రసా దరావు అధ్యక్షత వహించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లోని మారుమూల గ్రామాలకు సైతం చేరువ చేసేందుకు పటిష్ట చర్యలకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వ సహ కారంతో బిఎస్ఎన్ఎల్ చేపట్టిన 4జి సాచురేషన్ టవర్ ప్రాజెక్టు పనులు, ఫైబర్ కనెక్టివిటీ సేవలకు సంబంధించిన పలు అంశాల పై సమీక్షి ంచారు. బిఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలనీ, బిఎస్ఎన్ఎల్ సేవలను విస్తృత పరచాలని టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. అలాగే వినియోగదారులు తమ సమస్యలను సలహా మండలి దృష్టికి తీసుకొచ్చి, పరిష్కారం పొం దాలని ఆయన కోరారు. బిఎస్ఎన్ఎల్ పిజిఎం కుమార్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 112 టెలికాం 4జిను నిర్మించినట్లు చెప్పారు. వీటి ఏర్పాటు వల్ల సిగ్నల్స్ అందని, మారు మూల గ్రామీణ ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వచ్చే ఆరు నెలల్లో 57 కొత్త 4జి మొబైల్ టవర్స్ ను పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొం దించుకుని ముందుకు సాగుతున్నట్లు వివరిం చారు. ఇందులో ముఖ్యంగా చిత్తూరు పార్లమెంటు పరిధిలో 22, తిరుపతి పార్లమెంటు పరిధిలో 14, రాజంపేట పార్లమెంట్ పరిధిలో 14 టవర్లను ఏర్పాటు చేసి, త్వరితగతిన పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. ఈ ప్రాజె క్టు వలన గ్రామీణ ప్రాంతాలకు టెలికాం సేవలు విస్తరిస్తాయని, పనులను సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవిన్యూ, రోడ్లు భవనాలు, అటవీశాఖ విభాగా లకు సంబంధించి, ఏదైనా అవరోధాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికా రులతో చర్చించి, సమస్యకు పరిష్కారాన్ని చూపు తానని ఎంపీ దగ్గుమళ్ళ అన్నారు. ఈ సమా వేశంలో బిఎస్ఎన్ఎల్ డిజి ఎంలు వెంకోబారావు, జయశంకర్, దామోదర్, శివరాం, సిబ్బంది, జిల్లాలోని ఎజిఎం,డిఇలు

# విలాసాల కోసం దొంగతనాలు: నలుగురు అరెస్ట్



గురువారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు

**తిరుపతి,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లాలోని పలు మండలాల్లో,పట్టణాల్లో ఒంటరిగా ప్రయాణించే మహిళలనే లక్ష్యంగా చేసు కుని వరుస దొంగతనాలకు పాల్పడిన ముఠాను తిరు పతి క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. తిరు పతి నగరంతోబాటు శ్రీకాళహస్తి, నాయుడుపేట ప్రాంతాల్లో సుమారు 8బంగారు గొలుసు దొంగత నాల కేసులను పోలీసులు చేధించారు. సుమారు 17 లక్షల రూపాయలు విలువైన 128 గ్రాముల (16 సవర్లు) బంగారు ఆభరణాల స్వాధీనం చేసుకు న్నారు. చోరీలకు వినియోగించిన రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు వారినుండి రాబట్టారు. గురువారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ లంకెల సుబ్బ రాయుడు ఈ వివరాలను మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. గత కొంతకాలంగా ఓజిలి, నాయు డుపేట పరిసర మండలాల్లో ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలలోని బంగారు గొలుసులను లాక్కెళ్లే చైన్ స్నాచింగ్ ఘటనలు వరుసగా జరు గుతున్నాయి. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బా రాయుడు ఆదేశాల మేరకు క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసులు,నాయుడుపేట డిఎస్పీ జి. చెంచుబాబు పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృం దాలను ఏర్పాటు చేశారు. నాయుడుపేట రూరల్ సిఐ జి.సంగమేశ్వరరావు, ఓజిలి ఎస్ఐ కె. శ్రీకాంత్ వారి సిబ్బంది నిఘాలో పిగిలాం నరేంద్ర అలియాస్ నవీన్, బల్లి లికిత్ కుమార్ అలియాస్ లిఖిత్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి బంగారుగొలుసులు-6, బంగారు చెవికమ్మ, 128 గ్రాములు (16 సవర్లు), బంగారు నగలుతోబాటు మోటార్ సైకిల్ ,స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు ఓజిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు మహిళల వద్ద, నాయు డుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు మహిళల వద్ద, చిట్టమూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ వద్ద, బాలాయపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ వద్ద, కోట పోలీస్ స్టేషన్ పరిధిలో మరో ఒక మహిళ వద్ద చైన్ స్నాచింగ్ లకు పాల్పడినట్లు అంగీకరించారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో నేరాల వైపు అడు గులు వేస్తున్న యువత తమ జీవితాలను తామే నాశనం చేసుకుంటు న్నారు. నేరాలకు పాల్పడే వారిని అత్యాధునిక సాంకేతిక సహాయంతో కఠిన చర్యలు తీసుకొని వారిని చట్టం ముందు నిలబెడతామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు,వాహనాలు కనిపించిన వెంటనే అత్యవసర సేవల నంబర్ 112కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. ఇంకా నిందితులు నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంకు చెందిన బల్లి వెంకటేశ్వర్లు (34),4. పిగిలాం గణేష్ (32)లను అరెస్ట్ చేశారు. ఈ సమావేశంలో డిఎస్పీలు చెంచు బాబు (నాయు డుపేట), శ్యాంసుందర్ (క్రైమ్)), సిఐలు సంఘ మేశ్వర రావు, శివకుమార్ రెడ్డి ,సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఆర్వీ రాజు ,కానిస్టేబుల్ ఎన్. గంగాధర్ ఈ.భాస్కర్ ,ఎస్. వినయ్ కుమార్ లను

# సర్కారు బడిలో కలెక్టర్ కొడుకు..

### ఆదర్శంగా నిలిచిన పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

### ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని పెంచిన కలెక్టర్ నిర్ణయం



**వీరఘట్టం, జూన్ 18 ప్రభాతవార్త:** ఆయన జిల్లాకు కలెక్టర్, అంతే కాదు జిల్లా మేజిస్ట్రేట్ కూడా. అంత పెద్ద హోదాలో ఉన్న ఆయన అవన్నీ పక్కనపెట్టి తన కుమారుడిని సర్కార్ బడిలో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచారు పార్వ తీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభా కరరెడ్డి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమా ణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం తీసు కుంటున్న చర్యలకు తోడు, ఉన్నతాధికారులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పిం చేందుకు ముందుకు రావడం విశేషమే మరి. కలెక్టర్ కుమారుడైన ఎన్.క్రిష్ ధరణ్ రెడ్డిని పార్వతీపురంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి సమాజానికి ఒక గొప్ప ఆదర్శంగా నిలిచి అందరికీ చెప్పడమే కాదు చేసి చూపిం చారు కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి.

**మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతిలో ప్రవేశం**

కలెక్టర్ కుమారుడు క్రిష్ ధరణ్ రెడ్డి గతంలో విజయవాడలోని పడమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి పూర్తి చేశాడు. కాగా, ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఆయనను పార్వతీపురంలోని ప్రతిష్టాత్మక డాక్టర్ దిండిగల్ వెంకట్రావు మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో పదో తరగతిలో చేర్పించారు.

ఒక జిల్లా మేజిస్ట్రేట్ స్థాయి అధికారి తన కుమా రుడిని తమ పాఠశాలలో చేర్పించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయు లు శ్రీధర్ మరియు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పాఠ శాలలో విద్యా ప్రమాణాలను మరింత మెరు గుపరిచి, బాధ్యతాయుతంగా పని చేస్తామని వారు గర్వంగా చెబుతున్నారు. అయితే ఈ పాఠశాలకు ఇలాంటి ఘనత దక్కడం ఇది మొద టిసారేమీ కాదు. గతంలో ఇక్కడ ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేసిన కూర్మనాథ్ సైతం తన కుమారుడిని ఇదే మున్సిపల్ పాఠశాలలో చదివించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తమకున్న మక్కువను చాటుకున్నారు. ఇప్పుడు జిల్లా కలెక్టర్ కూడా అదే బాటలో నడవడంతో స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి విశేష స్పందన లభిస్తోంది. మరి కలెక్టర్‌ని ఆదర్శంగా తీసుకొని జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికా రులు, ఉపాధ్యాయులు పిల్లలు కూడా సర్కార్ బడుల్లోనే చేర్పిస్తారా, లేదా కార్పొరేట్ పాఠ శాలల్లోనే కొనసాగిస్తారా అనేది వేయికళ్లతో వేచి చూడాలి మరి.

# ఆర్‌డిఎస్ఎస్ పనులు వేగవంతం: ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, జూన్ 18 ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నం ద్యాల, అనంతపురం శ్రీ సత్యసాయి జిల్లాల్లో పునర్వ్యవస్థీకరణ విద్యుత్ పంపిణీ పథకం (ఆర్ డి ఎస్ ఎస్) కింద జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివ శంకర్ లోతేటి ఆదేశించారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గురు వారం ఆర్‌డిఎస్ఎస్ పనులపై సంస్థ అధికారులు, కాంట్రాక్టర్లతో శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ సంస్థ పరి ధిలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు వీలుగా వివిధ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సంస్థ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనుల నిర్వహణలో కాంట్రాక్టర్లకు సమస్యలు ఎదురైన సంధర్భాల్లో వెంటనే సంస్థ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ పనులను సకాలంలో పూర్తిచేయని కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) జే.రమణాదేవి, జనరల్ మేనేజర్లు సుబ్బారావు, శ్రీనివా సులు,సూపరింటెండింగ్ ఇంజనీర్లు రాఘవేంద్రం, చంద్రశేఖర రావు, అమర్‌బాబు, ప్రదీప్‌కుమార్,సుధాకర్, శేషాద్రిశేఖర్, మోజెస్,పిఆర్ఓ తోటమధుసూదన, ఎగ్జిక్యూటివ్‌ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## 24న భోగశ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్ర కలశాభిషేకం



**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల ఆలయంలోని శ్రీవారి పంచ బేరాలలో ఒకటైన భోగ శ్రీనివాసమూర్తిని ప్రతిష్ఠించిన రోజును పురస్కరించుకుని ఆలయంలో 24వ తేది ప్రత్యేక సహస్ర కలశాభిషేకం నిర్వహించను న్నారు. తిరుమల ఆలయంలో పల్లవరాణి సామ వై కొన్ని వందల సంవత్సరాల కిందట ఈమూర్తిని కోలువుచేశారు. 24వతేదీ ఉదయం శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేతమలయప్పస్వామి , భోగ శ్రీనివాసమూర్తి, విష్వక్సేనులని వేంచేపు చేస్తారు. శ్రీవారి మూలమూర్తికి ముందు గరుడా ళ్వార్ సన్నిధిలో కౌతుకమూర్తి మనవాళ పెరు మాళ్(శ్రీభోగ శ్రీనివాసమూర్తి)ను, ఆయనకు అభి ముఖంగా విష్వక్సేనులవారిని ఆశీనులు చేస్తారు. తర్వాత శ్రీవారి మూలమూర్తిని భోగ శ్రీనివా సమూర్తికి కలుపుతూ దారం కట్టి అనుసంధానం చేస్తారు. అనంతరం వేద పండితులు వేద పారా యణం చేయగా, అర్చకస్వాములు ప్రత్యేక సహస్ర కలశాభిషేకాన్ని వైభవంగా నిర్వహిం చనున్నారు. శ్రీవారి ఆలయంలో 24వతేదీ ఆర్జిత సేవలన్నీ యథావిధిగా నిర్వహించనున్నారు.

## ఎస్వీ ఆపన్న హృదయట్రస్ట్‌కు రూ.కోటి విరాళం

**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు,ట్రస్ట్‌లకు దాతలు విరాళాలందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన అపర్ణ ఎంటర్ ప్రైజస్ లిమిటెడ్ సంస్థ గురువారం టిటిడి వేంకటేశ్వర ఆపన్న హృదయ పథకానికి రూ కోటి విరాళంగా అందించింది. ఆసంస్థ ప్రతినిధులు టిటిడి ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో అధికారులకు చెక్కును అందజేశారు.

## శ్రీవారి కృపతో 'మా ఇంటి బంగారం' విజయం సాధిస్తుంది: నటి సమంత



**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొం డల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మా ఇంటి బంగారం చిత్రం ఘన విజయం సాధిస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేసింది.మా ఇంటి బంగారం చిత్ర బృందం గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. నటి సమంతతోబాటు ప్రముఖ దర్శకుడు రాజ్ నిడ మోరు, మా ఇంటి బంగారం చిత్రబృందం ఉన్నారు. నేడు శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న తన సరికొత్త చిత్రం మా ఇంటి బంగారం విజయవంతం కావాలని కోరుకుంటూ స్వామివారికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకు న్నామన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సమంతకు వేద ఆశీర్వచనం అందించి, స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.



## నాణ్యమైన పప్పు దినుసులు సరఫరా చేయాలి పప్పు మిల్లర్లతో అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమ లలో అన్నప్రసాదాల తయారీలో నాణ్యమైన పప్పు దినుసులను వినియోగించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన పప్పుమిల్లర్లతో టిటిడి అదనపు ఇఒ చిరు మా మిళ్ళ వెంకయ్య చౌదరి సమావేశమయ్యారు. గత కొన్నేళ్లుగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ద్వారా నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్ పప్పు మిల్లర్ల నుంచి కూడా నాణ్యతతో పాటు అవసరమైన పరిమా ణంలో పప్పు దినుసులు సరఫరా చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఆంధ్రప్రదేశ్ పప్పు మిల్లర్ల ప్రతినిధులు, ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులకు మహా యజ్ఞంగా అన్నప్రసాదాలు అందిస్తున్న టిటిడి సేవలో భాగస్వాములై, నాణ్యమైన పప్పు దినుసులను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్న ట్లు తెలిపారు. అనంతరం పప్పు మిల్లర్ల నుంచి పప్పు దినుసుల కొను గోలుకు ఉన్న పారద ర్శకమైన విధానాలను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఆదే శించారు.గురువారం మధ్యాహ్నం తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో సుధర్మ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిటిడికి అవసరమైన పప్పు దినుసుల నాణ్యత, పరిమాణం, సరఫరా తదితర అంశాలపై విస్తృ తంగా చర్చించారు. రోజువారీ అన్నప్రసాదాల తయారీలో శనగలు, పొట్టు తీసిన మినుములు, పొట్టుతో కూడిన మిను ములు, కందిపప్పు, పెసరపప్పు, వేరుశెనగలు వంటి ఏడు రకాల పప్పు దినుసులను టిటిడి వినియోగిస్తోందని అదనపు ఇఒతెలిపారు. ఈ సమావేశంలో అన్న ప్రసాదం డిప్యూటీ ఇఒ రాజేంద్ర, వేర్ హౌసింగ్ డిప్యూటీ ఇఒ పద్మావతి, జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) ఉమాశంకర్, పోటు ఎఇఒ మునిరత్నం, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి కెఎల్ ఎన్ శాస్త్రి, పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు.

## భక్తులకు మెరుగైన సౌకర్యాలు

### కపిలతీర్థంలో టిటిడి జెఇఒ డాక్టర్ శరత్



**తిరుమల,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్నందున కపిలతీర్థం ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ ఆదేశించారు. కపిలేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు గురువారం సాయంత్రం ఆలయాన్ని సందర్శించి క్షేత్రస్థా యిలో పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లను మరింత పటి ష్టంగా తీర్చి దిద్దడం, డ్రైనేజీ వ్యవస్థ మర మ్మతులు చేపట్టడం, పరిశుభ్రతను మెరుగు పరచడం వంటి అంశాలపై సమగ్ర నివేదిక తయారు చేసి త్వరితగతిన చర్య లు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ బి. నాగరత్న, విఎస్ఒ గిరిధర్, డీఇలు రవిశంకర్ రెడ్డి, సరస్వతి, ఇఇలు మల్లికార్జున ప్రసాద్, సుమతి, అడిషనల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ ప్రసాద్, సూప రింటెండెంట్ కె.పి. చంద్రశేఖర్ తదితర అధి కారులు పాల్గొన్నారు.

VMRDA విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ
పత్రికా ప్రకటన
Rc.No.11021/83/2026 (e-3289096), 17-06-2026
ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయునదేమనగా డెవలప్మెంట్ అగ్రిమెంట్ కం జి.పి.ఎ. హోల్డర్ సతా సంవృద్ధి అసెట్స్ ప్రాతినిధ్యం వహించినది మేనేజింగ్ పార్టనర్ కనుమూరి ప్రసాద్ అ్యాండ్ ఓనర్స్ 1. కొమ్మారెడ్డి కృష్ణ తేజ మరియు 2. సతా సమృద్ధి అసెట్స్ ప్రాతినిధ్యం వహించినది మేనేజింగ్ పార్టనర్ నంద్యాల తేజేంద్ర వర్మ ప్రాతినిధ్యం వహించినది సతా సంవృద్ధి అసెట్స్ దబ్బంద గ్రామం, ఆనందపురం మండలం, విశాఖపట్నం జిల్లా నందలి సర్వే సంఖ్యలు 46-1-A, 58-1, 58-1-A, 58-3B, 58-3D1, 58-3D2, 58-5A, 58-5D1, 58-5D2, 58-5E, 58-5F, 59-1, 59-1-A, 60-1-B, 60-1-C, 60-1-D, 60-1-E, 60-1-F-2, 60-2 లలో ఎకరములు 6.8040 సెంట్లు గల లేఅవుట్ అనుమతి నిమిత్తం దరఖాస్తు చేసియున్నారు. సదరు దరఖాస్తు ఈ కార్యాలయం ఫైల్ ఆన్లైన్ నెం.1167/0032/LP/VMRDA/2026 నందు పరిశీలన నిమిత్తమైయున్నది.
కావున పైన తెలిపిన లేఅవుట్ అనుమతి నిమిత్తమై ఎవరికైనను అభ్యంతరములు / సలహాలు కలిగి యున్న యెడల ఈ ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 7 రోజులలోపు వి.యం.ఆర్.డి.ఎ. కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియచేయవలెను. లేని యెడల ఎట్టి అభ్యంతరములు / సలహాలు లేవని భావించి, సదరు దరఖాస్తుపై తదుపరి చర్య తీసుకొనబడునని తెలియచేయుటమైనది.
Sd/- Metropolitan Commissioner, VMRDA

19-6Pg6exHMNWJQE.qxd:19-6Pg6exHMNWJQE.qxd 1/1/02 6:15 AM Page 1





గురువారం గాదె సాయికృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అంబటి తదితరులు

## సాయికృష్ణ కేసును సిబిఐకి అప్పగించాలి

### జగన్ ఆదేశం మేరకు అతని కుటుంబానికి అండ: అంబటి రాంబాబు

**విజయవాడ క్రైం,జూన్ 18,ప్రభాతవార్త:** లాకప్ డెత్‌కు గురైన గాదె సాయికృష్ణ కేసును సిబిఐకి అప్పగించాలని మాజీ మంత్రి,వైసిపి నాయకులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. గురువారం ఆయనతో పాటు వైసిపి నాయకులు మల్లాది విష్ణు,వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్,వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు కృష్ణలంకలోని ఇంటి వద్ద తొలుత గాదె సాయికృష్ణ తల్లిని,కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయికృష్ణ కుటుంబాన్ని ఇలాంటి సమయంలో పరామర్శించడం చాలా భాధగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఘటనపై చర్చ జరుగుతోందన్నారు.సాయికృష్ణ కుటుంబ సభ్యులతో మాట్లాడితే గుండెలవిసిపోయే నిజాలు తెలిసాయన్నారు. సాయికృష్ణ తల్లి ఫోన్ లాక్కొని సిగ్నల్స్ ఆధారంగా సాయికృష్ణను తీసుకువచ్చారన్నారు. తల్లి ఎంత ప్రాథేయపడినా సిఐ నాగరాజు సాయికృష్ణని వదిలేయ లేదన్నారు. వ్యవస్థలు ఎంత దారుణంగా ఉన్నాయో సాయికృష్ణ లాకప్‌డెత్ ద్వారా తెలుస్తోందన్నారు. న్యాయవాద వృత్తిలో ఉన్న సాయికృష్ణ పిన్ని కనకదుర్గ డిజిపి ఒక ఫిర్యాదు ఇచ్చారని, అ ఫిర్యాదు సిపికి అక్కడి నుండి డిసిపి వద్దకు వచ్చి చెత్తబుట్టలో చేరిందని ఆయన విమర్శించారు. ఆ స్టేషన్‌లో ఉన్న వేరే నిందితులు చెప్పిన దాని ప్రకారం సాయికృష్ణను పోలీసులు చంపేశారని తెలిసిందన్నారు. హెబియస్ కార్పస్ పిటీషన్ వేయకుండా కూడా సాయికృష్ణ కుటుంబ సభ్యులకు అనేక ఆటంకాలు పోలీసులు సృష్టించారన్నారు.సాయికృష్ణ కుటుంబ సభ్యులు చెప్పిన దాని ప్రకారం వారికి అండగా నిలిచామన్నారు. సాయికృష్ణకు క్రిమినల్ సామ్రాజ్యం ఉందని ప్రచారం చేస్తున్నారని అదే నిజమైతే అతని తల్లి గుడిసెలో ఉండి రోజు అడుక్కోవాల్సిన అవసరం ఏముందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు మల్లాది విష్ణు,మాజీ కార్పొరేటర్ పుప్పాల కుమారి,ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి వివాదంలో మామను చంపిన అల్లుడు

**విజయవాడ,జూన్ 18ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగర శివారుల్లోని కంకిపాడు మండలంలో దారుణం చోటు చేసుకుంది. మండల పరిధిలోని గోశాల గ్రామంలో కేవలం ఒక స్థలం వివాదానికి సంబంధించి అల్లుడే మామపై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోశాల గ్రామానికి చెందిన ఉప్పల సాంబశివరావు (65) అనే వృద్ధుడికి, అతని అల్లుడికి మధ్య కొంతకాలంగా ఒక స్థలానికి సంబంధించిన వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే ఇరుపక్షాల మధ్య మరోసారి తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ గొడవ కాస్తా ముదరడంతో ఆగ్రహంతో ఊగిపోయిన అల్లుడు మామ అని కూడా చూడకుండా సాంబశివరావుపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. అల్లుడు బలంగా కొట్టడంతో ఘటనా స్థలంలోనే కుప్పకూలి కన్నుమూశారు.

సమాచారం అందుకున్న కంకిపాడు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

## జలధారతో జల విజయం

### రాష్ట్ర మంత్రులు మండిపల్లి, జనార్దన్‌రెడ్డి

**మదనపల్లె, జూన్ 18 ప్రభాతవార్త :** జలధారతో జిల్లాకు జల విజయం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర రోడ్లు, భవనాల, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర రవాణ, యువజన క్రీడల శాఖామంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిలు తెలిపారు. ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలన పూర్తి చేసుకొన్న సందర్భంగా గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో రెండేళ్ళ నమ్మకం-సుపరిపాలన-అభివృద్ధి సంక్షేమంపై జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అమలవుతున్న ఈ కార్యక్రమం నీటిసంరక్షణ, చెరువుల అనుసంధానం, భూగర్భజలాల పెంపు దిశగా విశేష ఫలితాలను అందించిందన్నారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో నీటి లభ్యత పెరగడంతో వ్యవసాయం, పశుసంవర్ధక రంగాలకు కొత్త ఊపు ఇచ్చిందన్నారు. జలధార కార్యక్రమం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాలకు నీటి భద్రతను కల్పించే దిశగా రూపొందించిన ప్రజా ఉద్యమంగా మారిందన్నారు. జిల్లా స్థాయిలోప్రారంభమైన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే స్థాయికి చేరుకోవడం జిల్లా యంత్రాంగం పనితీరుకు నిదర్శనం అన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ ఆయన దూరదృష్టి, కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ కార్యక్రమం విజయవంతం అయ్యిందన్నారు. ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, కిషోర్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ రెండేళ్ళ కూటమి పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈసందర్భంగా అభివృద్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రులు, జిల్లా కలెక్టర్లు పరిశీలించి అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముళ్లపొదల్లో శిశువు మృతదేహం

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త:**ఒంగోలు పట్టణంలోని గాంధీ రోడ్డులో ఓపీఎస్ స్కూల్ ఎదురుగా ఉన్న శివారు ప్రాంతంలోని ముళ్ల పొదల్లో సుమారు ఏడు రోజుల వయస్సు గల మగ శిశువు మృతదేహం గుర్తించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గురువారం ఉదయం ఆ ప్రాంతంలో సంచరిస్తున్న స్థానికులు ముళ్ల పొదల్లో శిశువు మృతదేహాన్ని గుర్తించి వెంటనే హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్‌కు సమాచారం అందించారు. అనంతరం ఆయన ఈ విషయాన్ని జిల్లా బాలల సంరక్షణ అధికారి పి. దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులు తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. జిల్లా మహిళా మరియు శిశుసంక్షేమశాఖ అధికారి పి. నాగమణి సూచనల మేరకు జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు,ఒంగోలు తాలూకా పోలీసులు, ఎమ్మెన్కె సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించగా, నివేదిక వచ్చిన తర్వాత మరణానికి గల కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. స్థానిక అంగన్వాడీ కార్యకర్త అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలూకా ఎస్సై పి.చౌడయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసులు సీసీటీవీ దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## జెఎసి పిలుపునకు సంపూర్ణ మద్దతు

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగస్తుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు, ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద భారీ ఎత్తున శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించామని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు, అధికార ప్రతినిధి, ఏ.జి.కె.చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# రెండేళ్ల పాలనకు ప్రజా మద్దతు..

## ఒంగోలులో అట్టహాసంగా కూటమి విజయోత్సవ సభ

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఒంగోలు నగరంలోని ఎస్‌జీవీఎస్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఘనంగా విజయోత్సవ సభ నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్,ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామ చర్ల జనార్దన్ రావు, ఉగ్రనరసింహారెడ్డి, విజయ్ కుమార్, కలెక్టర్ రాజాబాబు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత సభకు తరలివచ్చారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే ప్రత్యేక



స్టాళ్లను మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించారు. గత రెండేళ్లలో ప్రకాశం జిల్లాలో పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు రూ.7,163 కోట్ల సంక్షేమ పథకాల లబ్ధి అందించామని, రూ. 3,068 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామని వెల్లడించారు. మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ రాష్ట్రంపై ఉన్న భారీ అప్పులను ఒకవైపు చెల్లిస్తూనే మరోవైపు ప్రజలకు సంక్షేమం అందిస్తున్నామని తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు సరఫరా కాలువల కోసం రూ.500 కోట్లు కేటాయించడం రైతుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ఒంగోలు నగర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడం కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంత రైతుల దశను మార్చబోతుందని అన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రకాశం జిల్లాకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొస్తామని తెలిపారు.జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర వివరాలు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ లక్ష్యాలను ప్రజలకు వివరించిన ఈ సభ జిల్లాలో రాజకీయంగా, పరిపాలనా పరంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి..

## రూ.6.3కోట్లు రుణాల చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తిరూరల్,జూన్ 18 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా ఎదగాలని, స్వయంఉపాధి సాధించి కుటుంబాలను ఆర్థికంగా నిలదొక్కుకోవాలని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం శ్రీకాళహస్తి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మహిళలకు కూటమి ప్రభుత్వంలో ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.మహిళలను మహారాణులను చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం యోచించి 'పిఎం అజయ్ పథకాన్ని' రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ పాటు పరిపాలించిన వైకాపా నేతలు కేంద్రం నుంచి వచ్చిన నిధులను స్వాహా చేసారని పంచాయతీలకు మంజూరు చేసిన నిధులను కూడా కరెంటు చార్జిలకు జమ చేసి పంచాయతీలను నిర్వీర్యం చేసారన్నారు.

**ప్రధాని ఆశయాలకు అనుగుణంగా..** నేడు రాష్ట్రంలో భారత ప్రధాని నరేంద్రమోదీ ఆశయ సాధనకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మోదీజీ దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రాధన్యత ఇస్తున్నారని సుధీర్‌రెడ్డి వివరించారు.రానున్న పంచాయతీ ఎన్నికల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ అవకాశం కల్పించారన్నారు.నేడు తాను పిఎం అజయ్ పథకంలో రూ.6.3కోట్ల రుణాల చెక్కును అందించటం గర్వకారణంగా ఉందన్నారు. మహిళలందరూ ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ఉన్నత శిఖిరాలను అధిరోహించి ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి వెంకట సుబ్బారెడ్డి, శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, కామేష్‌యాదవ్, బొల్లినేని జగన్నాధం నాయుడు, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా ఫీడ్ ధర కెజి రూ.4 తగ్గింపు

## కంపెనీల అంగీకారం, ధరల స్థిరీకరణపై కమిటీ

### రైతులు, ఫీడ్ తయారీదారులతో సమావేశంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆక్వా ఫీడ్ ధరల పెంపుతో గత కొన్ని రోజులుగా తలెత్తిన సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిష్కారం చూపించారు. అటు ఆక్వా రైతులపై అధిక భారం పడకుండా, ఇటు ఫీడ్ తయారీదారులు నష్టపోకుండా ప్రస్తుత ధరపై రూ.4 తగ్గించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీనికి ఫీడ్ తయారీదారులు, ఆక్వా రైతులు అంగీకరించారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో ఫీడ్ ధర కేజీకి ఇప్పుడున్న ఎంఆర్‌పి రూ.112 నుంచి రూ.108కి తగ్గనుంది. దీనిపై చేపలు, రొయ్యల సాగు రైతులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సచివాలయంలో గురువారం ఉన్నతాధికారులు, ఆక్వారైతులు, ఫీడ్ తయారీదారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ధర తగ్గించడంతో పాటు ఆక్వా ఫీడ్ ధర స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులు, అధికారులతో ఒక కమిటీ వేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. 20 రోజుల్లోగా కమిటీ నివేదిక సమర్పించాలని, అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. ఫీడ్ ధరలతో పాటు, ప్రాసెసింగ్ విధానం, కాలుష్య నియంత్రణ పైనా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరుసార్లు పెంచారని, అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై ఎటువంటి చొరవ తీసుకోలేదని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆక్వా రైతులు ఈ సందర్భంగా తెలిపారు. 2019లో కేజీ ఫీడ్ ధర రూ.87.80 ఉంటే గత ప్రభుత్వం దిగిపోయేనాటికి ఆ ధర రూ.107.80కి చేరిందని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫీడ్ ధర రూ.5.80 తగ్గించిందన్నారు. తామెప్పుడూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించలేదని, ఇటీవల కొందరు ఆక్వా రైతుల ముసుగులో రాజకీయం చేశారని సిఎంతో అన్నారు. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇస్తున్నందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఒకప్పుడు గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వాసాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత సిఎం చంద్రబాబుదేనని రైతులు గుర్తు చేశారు.

**సమస్యలు విన్నవించిన రైతులు:** ప్రస్తుతం ఆక్వాసాగులో ఎదురవుతోన్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశంలో ఆక్వా రైతులు వెల్లడించారు. సాగుకు వినియోగించే అన్ని వస్తువుల ధరలు పెరిగాయని, కానీ ఆక్వా ఉత్పత్తుల ధరలు మాత్రం పెరగడం లేదన్నారు. ముడిసరుకు ధర పెరిగినప్పుడు ఫీడ్ ధర పెంచుతున్నారు కానీ, ముడిసరుకు ధర తగ్గినప్పుడు మాత్రం ఫీడ్ ధర తగ్గించడం లేదన్నారు. దీనికితోడు ప్రాసెసింగ్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. మత్స్యశాఖ నుంచి రైతులకు అందించే రాయితీలపైనా అందరికీ అవగాహన కల్పించాలని రైతులు కోరారు. అలాగే చేపలు, రొయ్యల చెరువులకు నీటి వనరులు అందించాలని రైతులు చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు.

**సోయా ధర పెరిగిందన్న ఫీడ్ కంపెనీల ప్రతినిధులు:** సోయా, ఫిష్ మీల్ వంటి ముడిసరుకు కొరత ఉందని, దేశీయంగా వీటి ధర కూడా అధికంగా ఉందని ఫీడ్ కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ధర తక్కువగా ఉన్న అమెరికా నుంచి సోయా దిగుమతులకు అనుమతి లేకపోవడంతో దేశీయ మార్కెట్లో రెట్టింపు ధరకు కొంటున్నామన్నారు. దీంతో ధరలు పెంచాల్సి వచ్చిందని వివరించారు. వాస్తవంగా రూ.20 ధర పెంచాల్సి ఉన్నప్పటికీ...రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ధర పెంపును రూ.12కి పరిమితం చేశామని చెప్పారు.

**ఆక్వా రైతులకు రూ.1,543 కోట్ల విద్యుత్ రాయితీ:** లక్షలాది మంది ఆధారపడిన ఆక్వారంగాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానికి ఉందని, ఈ రెండేళ్లలో రూ.1,543 కోట్ల మేర విద్యుత్ రాయితీ రూపంలో ఆక్వాసాగుకు ఇచ్చామని సిఎం చంద్రబాబు వివరించారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎపి ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పొగాకు రైతులను ఆదుకుంటాం

ఏదైనా కేజీ రూ.200 తగ్గకూడదు

నో బిడ్... లో బిడ్ ఉండకూడదు

మార్కెట్‌కు వచ్చిన పంట కొనాల్సిందే

అనధికార కొనుగోళ్లపై కఠిన చర్యలు

కేంద్ర ప్రభుత్వంతోనూ మాట్లాడతాం

ట్రేడర్లు, పొగాకు రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మార్కెట్‌లో పొగాకు రకం ఏదైనా కిలో రూ. 200 కంటే తగ్గడానికి వీల్లేదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

గురువారం రాష్ట్ర సచివా లయంలో పొగాకు రైతులు, ట్రేడర్లతో ముఖ్య మంత్రి సమావేశం నిర్వహించి పొగాకు ధరలపై సమీక్షించారు. ఇటు రైతులు, అటు ట్రేడర్ల సమ స్యలను తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పొగాకు రైతులను ఆదుకునేందుకు ట్రేడర్లు, కొనుగోళ్ల కంపెనీలు నూటికి నూరు శాతం మానవీయ కోణంలో రైతులకు సహకరించాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పొగాకు వేలం కేంద్రాల్లో నో బిడ్, లో బిడ్ అనే మాటలకు తావుండకూడదన్నారు.

రైతులు మార్కెట్టుకు తెచ్చిన పొగాకు బేళ్లను వెనక్కి పంపే పరిస్థితులు అస్సలు ఉండకూడదని చెప్పారు. మార్కెట్లోకి వచ్చిన పొగాకును కంపెనీలు కొనుగోలు చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. దీనికి అనుగుణంగా అన్ని పొగాకు వేలం ప్లాట్‌ఫారమ్‌లను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని చేయాలని ఆదేశించారు. అలాగే పొగాకు కంపెనీలన్నీ తప్పనిసరిగా కొనుగోళ్లు చేపట్టాలని, ఏ ఒక్క కంపెనీ కూడా వెనక్కు వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు. టొబాకో బోర్డ్ పరిధిలో కాకుండా అనధికారికంగా కొనుగోళ్లు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని,అవసరమైతే అరెస్టులు చేస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

**రైతుల ప్రయోజనాలే ముఖ్యం:** ఈ ఏడాది పొగాకు ట్రేడర్లు, కంపెనీలు ప్రభుత్వానికి, రైతులకు సహకరించాలని సిఎం చంద్రబాబు కోరారు. రాబోయే ఏడాది నుంచి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే పొగాకు మార్కెట్ స్థిరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తుందన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామని చెప్పారు.

రైతులు, టొబాకో బోర్డు ప్రతినిధులను వెంటపెట్టుకుని ఢిల్లీ వెళ్లి సంబంధిత మంత్రులు, అధికారులను కలవాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును సిఎం చంద్రబాబు ఆదేశించారు.

ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రాంనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డివిబి స్వామి, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, టొబాకో బోర్డ్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేడే టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితా విడుదలకు రంగం సిద్ధమైంది. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏపీ విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ ఫలితాలను విడుదల చేయనున్నారు. మే 25 నుంచి జూన్ 1 వరకుసప్లిమెంటరీ పరీక్షలు జరగ్గా మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేసిన అదికారులు ఫలితాలను విడుదలకు సిద్ధం చేశారు. ఫలితాలను ఎపి.జీవోవి.ఇన్/ వెబ్‌సైట్‌లో చూడొచ్చు. మన మిత్ర వాట్సప్ నెంబరు 9552300009 ద్వారానూ రిజల్ట్స్ తెలుసు కోవచ్చని పరీక్షల విభాగం డైరెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

### నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు

## ఉచిత బస్సు ప్రయాణం

**విజయవాడ, జూన్ 18 ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఈ నెల 21వ తేదీన జరుగనున్న వైద్య కళాశాలల ప్రవేశ పరీక్ష నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. విద్యార్థులు తమ నివాసం నుంచి పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు తమ హాల్ టికెట్‌ను చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉండే రూట్లను గుర్తించి అందుకు అనుగుణంగా నీట్ రీఎగ్జామినేషన్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనేందుకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ అదనంగా ప్రత్యేక బస్సులు నడపాలని ప్రభుత్వం ఆర్టీసి అధికారులను ఆదేశించింది. అందుకు అనుగుణంగా అవనిగడ్డ, మచిలీపట్నం, గుడివాడ, గన్నవరం, ఉయ్యూరు డిపోల నుంచి పరీక్షా కేంద్రాలకు నిత్యం నడిచే బస్సులకు అదనంగా రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసి కృష్ణాజిల్లా ప్రజా రవాణా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆసుపత్రుల పనితీరుపై మరింత నిఘా

### రెండేళ్ల ఫలితాలపై ముఖ్యమంత్రికి మంత్రి సత్యకుమార్ యాదవ్ సమగ్ర నివేదిక

**విజయవాడ,జూన్ 18, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ వైద్య సేవలను మెరుగు పరచడానికి వైద్యారోగ్య శాఖ చేసిన ప్రయత్నాలు, సాధించిన ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారంసమగ్రమైన నివేదికను అందజేశారు. నాలుగు పేజీల సమీక్షతో కూడిన లేఖతో పాటు విభాగాలవారీగా సాధించిన ఫలితాలపై 8 పేజీల నివేదికను మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రికి పంపారు.గత ప్రభుత్వం నుంచి ఆరోగ్య రంగంలో వారసత్వంగా సంక్రమించిన సమస్యల్ని పరిష్కరించి, ప్రజారోగ్య వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టడం ద్వారా మొదటి ఏడాది కంటే రెండో ఏడాదిలో మరింత సానుకూల ఫలితాలు లభించాయని మంత్రి తన లేఖలో ముఖ్యమంత్రికి వివరించారు. మొదటి ఏడాదిలో వైద్యులు, ఇతర సిబ్బంది హాజరు 7 శాతం పెరగ్గా రెండో ఏడాది పాలనలో హాజరు 28.13 శాతం పెరిగిందని, తదనుగుణంగా వైద్య సేవల్లో భారీ పురోగతిని సాధించామని మంత్రి తెలిపారు. విస్తృతమైన ప్రభుత్వ వైద్య సేవలకు సంబంధించి మొత్తమ్మీద సానుకూల ఫలితాలు లభించినా, ఆసుపత్రులవారీగా, ప్రాంతాలవారీగా పనితీరులో వ్యత్యాసాలు కనిపించాయని, వీటిని అధిగమించి వ్యవస్థ పూర్తి సామర్థ్యాన్ని ప్రజలకు అందజేసే దిశగా చర్యల్ని చేపట్టాల్సిన అవసరాన్ని గుర్తించామని మంత్రి వివరించారు.

## పిడుగుపాటుకు గేదె మృతి

**అనుమసముద్రంపేట (నెల్లూరు), జూన్ 18, ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలంలోని చిన్నబ్బీపురం గ్రామంలో గత రాత్రి కురిసిన అకాల వర్షం సమయంలో పిడుగుపాటుకు ఓ గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన మబ్బు మస్తానయ్యకు చెందిన సుమారు లక్షరూపాయలు విలువ చేసే నిండు సూడుతో ఉన్న గేదె పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న గ్రామ రెవెన్యూ అధికారులు, పశువైద్య శాఖ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. అనంతరం పశువైద్య సిబ్బంది గేదె మృతిపై పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందే నష్టపరిహారాన్ని బాధిత రైతుకు అందించేందుకు సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## ఆక్వా రైతు కృష్ణంరాజు హత్య

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్18 ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లా ఐ పోలవరం మండలం కొత్త మురమళ్ళలో రొయ్యల చెరువు వద్ద ఆక్వా రైతు దాట్ల కృష్ణంరాజు(64)ను గుర్తుతెలియని దుండగులు హత్య చేశారు. కొట్టి చంపి, రాళ్ల కట్టి రొయ్యల చెరువులో పడవేసినట్లు అనుమాని స్తున్నారు .కృష్ణంరాజు రాత్రయినా ఇంటికి రాకపోవడంతో గాలించి ఆచూకీ దొరకక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చిన కుటుంబ సభ్యులు,పోలీసులు గాలింపు చేపట్టగా చెరువులో రాళ్లతో కట్టిన కృష్ణంరాజు మృతదేహం గుర్తించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అమలాపురం డిఎస్పీ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.



### తెలంగాణ స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన

## ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాజ్యసభ ఎంపీ విజయ్

విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గౌరవనీయులు చింతకాయల అయ్యన్నపాత్రుడు మరియు రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిని ఈరోజు హైదరాబాదు లో మర్యాదపూర్వకంగా కలిశారు. చింతకాయల విజయ్ ఇటీవల నూతనంగా రాజ్యసభ ఎంపీగా ఎన్నికైన సందర్భంగా ఈ ఆత్మీయ కలయిక చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాజ్యసభ ఎంపీ విజయ్‌ని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు ప్రత్యేకంగా అభినందించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు




### విశాఖ రేంజ్‌లో

## డ్రగ్స్ మాఫియాకు గట్టి దెబ్బ

- 490 కేసుల గంజాయి, హషీష్ ఆయిల్ ధ్వంసం..
- 'జీరో కల్టివేషన్' లక్ష్య సాధనలో చారిత్రాత్మక విజయం



విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త: రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యాచరణలో భాగంగా విశాఖపట్నం రేంజ్ పోలీసులు మరో కీలక మైలురాయిని చేరుకున్నారు. గంజాయి సాగు, అక్రమ రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టే లక్ష్యంతో చేపట్టిన కఠిన చర్యల ఫలితంగా 'జీరో కల్టివేషన్' సాధన దిశగా విశాఖ రేంజ్ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ రాష్ట్రంలో మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గంజాయి రవాణాపై ఉక్కు పాదం మోపడంతో పాటు గిరిజన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తూ రైతులకు మెరుగైన జీవనోపాధి కల్పిస్తున్నామని తెలిపారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విశాఖపట్నం రేంజ్ ఐజీపీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ 2021-22లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 7,515 ఎకరాలకు పైగా ఉన్న గంజాయి సాగును జనవరి 2026 నాటికి పూర్తిగా నిర్మూలించి 'జీరో కల్టివేషన్' (తరువాయి 8వ పేజీలో)

# అభివృద్ధి గమ్యస్థానం భీమిలి

### రెండేళ్లలో రూ.2,600 కోట్ల పనులు : గంటా



సాగర్ నగర్, జూన్ 18: అభివృద్ధికి గమ్యస్థానమైన భీమిలి వైపు ప్రపంచమంతా చూస్తోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. రుషికొండ ఏ 1 కన్వెన్షన్ లో గురువారం జరిగిన "2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర యువత ఐటీ ఉద్యోగాల కోసం వేరే రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేస్తామన్నారు. విశాఖలో పని చేయడానికి కాగ్నిజెంట్ సంస్థ ఆసక్తి వ్యక్తీకరణ కోరగా హైదరాబాద్ శాఖలో 1,500 మంది దరఖాస్తు చేసుకుని స్వస్థలానికి వచ్చారని గుర్తు చేశారు. భవిష్యత్ లో ఇతర రాష్ట్రాల ఐటీ నిపుణులు ఉద్యోగాల కోసం విశాఖ వస్తారన్నారు. 2014-19లో 38 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించిన భీమిలిని రూ.4,700 కోట్లతో అభివృద్ధి చేశానని, 2024 లో 93 వేల ఓట్ల మెజారిటీ ఇచ్చినందుకు కృతజ్ఞతగా అంతకు మించిన అభివృద్ధి చేస్తానన్నారు. రెండేళ్లలో నియోజకవర్గంలో రూ. 2,600 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. విద్యా శాఖ మంత్రిగా గతంలో భీమిలికి ఐ.ఐ.ఎం. తెచ్చేలా సీఎం చంద్రబాబును ఒప్పించానని, ఈసారి ప్రపంచం మొత్తం చూసేలా గూగుల్ డేటా సెంటర్ ను ఆయన విశాఖకు తీసుకువచ్చారని తెలిపారు. ఇటీవల తాను యూరోప్ వెళ్లినప్పుడు విశాఖపట్నం పేరు చెబితే గూగుల్ డేటా సెంటర్ ప్రాంతమని అక్కడి వారు గుర్తించారన్నారు. ఇలాంటి పెట్టుబడులతో చరిత్రలో నిలిచిపోతా మని పేర్కొన్నారు. వచ్చే 2 ఏళ్లలో అభివృద్ధి ఫలాలను ప్రజలకు (తరువాయి 8వ పేజీలో)

## నిర్వహణ నైపుణ్యాల పెంపే సీఓఈఈటీ లక్ష్యం

### ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త : విద్యుత్ రంగంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఉద్యోగుల్లో నిర్వహణ, ఆర్థిక పరిపాలన, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడమే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (సీఓఈఈటీ) ప్రధాన లక్ష్యమని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. సీఓఈఈటీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న ఐదు రోజుల ఫైనాన్స్ అండ్ మేనేజీరియల్ అకౌంటింగ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన శిక్షణార్థులతో మమేకమయ్యారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) విశాఖపట్నం సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల అధికారులు, ఉద్యోగులు పాల్గొంటున్నారు. సీఎండీ మాట్లాడుతూ ఇంధన రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులు, ముఖ్యంగా ఎనర్జీ ట్రాన్సిషన్ నేపథ్యంలో ఉద్యోగులు నిరంతర అధ్యయనం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక నిర్వహణ, నాయకత్వ లక్షణాల అభివృద్ధి ద్వారా సంస్థల పనితీరు మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ రంగ భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులను తీర్చిదిద్దేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఎన్ఆర్ఈడీక్యాప్ సంస్థలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఐఐఎం విశాఖపట్నానికి చెందిన డా. వికాస్ సంగ్వాన్, డా. తమలి చక్రబర్తి ప్రోగ్రామ్ డైరెక్టర్లుగా వ్యవహరిస్తూ శిక్షణ అందిస్తున్నారు.

### నీట్ యూజీ అభ్యర్థులకు ఆర్టీసీ బస్సుల్లో

## ఉచిత ప్రయాణం

### విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి



విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త : నీట్ యూజీ-2026 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు జూన్ 21న ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు తమ ఒరిజినల్ హాల్ టికెట్‌ను చూపించి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు.

పాత హాల్ టికెట్లు, ఫోటోకాపీలు లేదా ఇతర పత్రాలను ఉచిత ప్రయాణానికి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ సౌకర్యం పరీక్ష నిర్వహించే రోజున మాత్రమే వర్తిస్తుందని వెల్లడించారు. పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా విద్యార్థులు ముందుగానే ప్రయాణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, తల్లిదండ్రులు కూడా సహకరించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. విద్యార్థులందరూ ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

### భీమిలి డివిజన్లో

## జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన

- క్షేత్రస్థాయి 'సర్' ప్రక్రియ పరిశీలన
- చంద్రంపాలెం పాఠశాల ల్యాబ్ సందర్శన,
- తాళ్లవలస సచివాలయం తనిఖీ
- తగరపువలస ఎరువుల దుకాణంలో ఆరా



విశాఖపట్టణం, జూన్ 18 (ప్రభాత వార్త): జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ గురువారం భీమిలి డివిజన్ పరిధిలో సుడిగాలి పర్యటన చేశారు. తగరపువలసలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి అక్కడ పరిస్థితులపై ఆరా తీశారు. తాళ్లవలస సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సేవలను పరిశీలించారు. చంద్రంపాలెం పాఠశాలను సందర్శించి అక్కడ దివిస్ సహకారంతో జరుగుతున్న మైదానం అభివృద్ధి పనులను చూశారు. అలాగే తగరపువలసలో జరుగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించి, ప్రజలతో, బీఎల్వోలతో మాట్లాడారు.

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా తగరపువలస వెళ్లిన ఆయన ముందుగా శ్రీమన్నారాయణ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఏపీఐఎంఎస్ యాప్ వినియోగం, ఓటీపీ ఆధారంగా యూరియా, డీఏపీ ఎరువుల సరఫరా తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఎరువుల సరఫరా ప్రక్రియ దుర్వినియోగం కాకుండా చూడాలని సంబంధిత అధికారులకు చెప్పారు. అనంతరం తగరపువలస గ్రామంలో జరుగుతున్న సర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పరిశీలించారు. ప్రజలు, బీఎల్వోలతో మాట్లాడి ప్రక్రియ కొనసాగుతున్న తీరుపై ఆరా తీశారు. పారదర్శకంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం తాళ్లవలస సచివాలయాన్ని తనిఖీ చేసి అక్కడ పరిస్థితులను గమనించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రగతి నివేదికలను, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే చంద్రంపాలెం పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడ జరిగిన అడ్మిషన్లు గురించి అడిగారు. తరగతులు (తరువాయి 8వ పేజీలో)

### యోగాతోనే

## దుఃఖానికి చెక్

### అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురుదేవ్ సందేశం

విశాఖపట్నం, జూన్ 21, ప్రభాతవార్త: "యోగం దుఃఖం రాకముందే దానిని నివారిస్తుంది" అని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు గురుదేవ్ రవి శంకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయన యోగం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ మానవ జీవితంలో దుఃఖానికి మూలకారణాలు ఏమిటి, వాటిని ఎలా అధిగమించవచ్చో వివరించారు. ప్రపంచంలో ప్రతి సుఖం వెనుక ఏదో ఒక రూపంలో దుఃఖం దాగి ఉంటుందని ఆయన అన్నారు. ఒక వస్తువును పొందాలనే కోరిక, దాన్ని కోల్పోతామనే భయం, అది దూరమైన తర్వాత కలిగే జ్ఞాపకాలు---ఇవన్నీ మనిషిని మానసికంగా ప్రభావితం చేస్తాయని చెప్పారు. అందుకే (తరువాయి 8వ పేజీలో)



### ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ

## పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్
- నిబంధనలు ఉల్లంఘించి, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త : ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో పాల్గొనే ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు సహా ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఉండాలని, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. సర్ ప్రక్రియ పురోగతి, తాజా పరిస్థితిపై సమీక్షిస్తూ ఆయన గురువారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి లోపాలు, అవకతవకలు చోటు చేసుకోకుండా చూడాలని, అన్ని రాజకీయ పార్టీలను సమానంగా పరిగణించి చట్టాలు, నిబంధనలకు లోబడి పనిచేయాలని స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమించి అక్రమాలకు పాల్పడినా, అనధికారికంగా ఒక్క ఓటును తొలగించినా కఠిన చర్యలు తప్పవన్నారు. తప్పు చేసినట్లు తేలితే ఉద్యోగం కోల్పోవడమే కాకుండా జైలుశిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తొలగించే ప్రతి ఓటుకు ప్రత్యేక ఫైల్ నిర్వహించి, సరైన కారణాలను నమోదు చేయాలని సూచించారు. ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పక్కాగా పూర్తి చేయాలని, క్షేత్రస్థాయిలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చూడాలన్నారు. గాజువాక నియోజకవర్గంలోని 181, 240 పోలింగ్ స్టేషన్లు, పెందుర్తి నియోజకవర్గంలోని 253 పోలింగ్ స్టేషన్ పరిధిలో ఇంకా ఎన్యూమరేషన్ ఫాంల పంపిణీ మొదలు కాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫాంలను తక్షణమే పంపిణీ చేయాలని ఆదేశించారు.

ఒక్కో బీఎల్‌వో సుమారు వెయ్యి ఎన్యూమరేషన్ ఫార్ములను పంపిణీ చేయాల్సి ఉంటుందని, ఫాంల పంపిణీ సమయంలోనే మ్యాపింగ్ ప్రక్రియను కూడా పూర్తి చేయాలని సూచించారు. మ్యాపింగ్ పూర్తయిందో లేదో యాప్ ద్వారా నిర్ధారించుకొని, ఫాంల పంపిణీ చేపట్టాలన్నారు. ఈ నెల రోజుల పాటు ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియకే ప్రాధాన్యత ఇవ్వాలని, బీఎల్‌వోలను పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమంలోనే నిమగ్నం చేయాలని ఆదేశించారు. వారిని ఇతర విధులకు వినియోగించరాదని స్పష్టం చేశారు. బీఎల్‌వోలకు ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోల నుంచి సంపూర్ణ సహకారం అందాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం కొనసాగిస్తూ, బీఎల్‌ఏల (తరువాయి 8వ పేజీలో)

## దక్షిణ రూపురేఖలు మార్చేస్తాం..!

### కూటమి విజయోత్సవ సభలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వెల్లడి



విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త : దక్షిణ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో "రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం" అనే అంశంపై గురువారం విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. జగదాంబ అంబికా బాగ్ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఈ విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని, ప్రజల విశ్వాసాన్ని ప్రభుత్వం నిలబెట్టుకుందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, సీఎం నారా చంద్రబాబు నాయుడు అనుభవం రాష్ట్ర అభివృద్ధికి బలంగా నిలుస్తున్నాయని అన్నారు. దక్షిణ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొంటూ, జాలారిపేట సముద్రతీరంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు. జాలారిపేట జంక్షన్‌ను ఆధునికంగా (తరువాయి 8వ పేజీలో)

## ఇంటింటికీ ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ

గాజువాక,జూన్ 18,ప్రభాతవార్త :



గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం కొత్తగాజువాక మండలం 67వ వార్డు శంకర్ నగర్‌లోని 190వ బూత్ పరిధిలో గురువారం ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) భాస్కరరావుతో కలిసి గాజువాక బీజేపీ కన్వీనర్ (బీఎల్‌ఏ-1) కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్), మండల అధ్యక్షుడు (బీఎల్ఏ-2) ఒమ్మి రంగనాయకులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఈ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ.. ఓటర్లు తమ వివరాలతో కూడిన ఎన్యూమరేషన్ ఫారాలను నింపి తిరిగి బీఎల్ఓకు అందజేయాలని సూచించారు. కొత్త ఓటు నమోదు కోసం ఫారం-6, చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు ఫారం-7, చిరునామా మార్పులు లేదా సవరణల కోసం ఫారం-8 నింపి బీఎల్ఓకు సమర్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అభివృద్ధి గమ్యస్థానం భీమిలి

(7వ పేజీ తరువాయి)

చేరువ చేస్తామని చెప్పారు. పనిచేసే ప్రభుత్వానికి రెండు, మూడు దఫాలు అవకాశమిస్తే ఆంధ్ర భవిష్యత్ అద్భుతంగా ఉంటుందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్ లో ఉన్న పద్మనాభం ఘాట్ రోడ్డు, పాండ్రంగి బ్రిడ్జి, చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు గడిచిన రెండేళ్లలో అమల్లోకి తీసుకురాగలిగామని తెలిపారు. పెన్షన్ పెంపు, అమ్మఒడి చెల్లింపులలో ప్రజలను వంచించిన జగన్మోహన్ రెడ్డి, సూపర్ సిక్స్ మోసమని తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె. సంగీత్ మాధుర్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల సందీప్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు చోడే పట్టాభిరామ్, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కురుమిన రామస్వామి నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, లొడగల కృష్ణ, చక్రవర్తి, శాఖారి శ్రీనివాస్, చెట్టుపల్లి సన్యాసిరావు, నాగరాజు, గాదు చిన్ని కుమారి లక్ష్మి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాక్సో కేసులో తీర్పు..

### నిందితునికి ఐదేళ్ల సాధారణ కారాగార శిక్షతో పాటు

### రూ.30 వేల జరిమానా

విశాఖపట్నం, జూన్ 18 ప్రభాతవార్త

పోక్సో కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడుకి ఐదేళ్ల సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధించింది. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో వేపగుంట రామాలయం వీధిలో 2022 జూలై 12న జరిగిన ఘటనలో 8 ఏళ్ల బాలిక తన ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా, అదే ప్రాంతానికి చెందిన గోర్లె నాగరాజు (54) ఆమెను తన ఇంటిలోని గదిలోకి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అలాగే తన ప్రైవేట్ భాగాలను బాలిక చేతులతో తాకించేలా బలవంతం చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ సమయంలో నిందితుడి భార్య అక్కడికి రావడంతో బాలికను విడిచిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. బాధిత బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 2022 జూలై 14న పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 415/2022గా కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ బి. గణేష్ ప్రాథమిక దర్యాప్తు చేపట్టగా, పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కేసును దిశా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అనంతరం మహిళా పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ కె. నీలిమ దర్యాప్తు పూర్తి చేసి 2022 నవంబర్ 16న చార్జ్‌షీట్ దాఖలు చేశారు.కేసును విచారించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి పి. మంగా కుమారి సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడిని దోషిగా తేల్చారు. ఐదేళ్ల సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధించారు. జరిమానాలో రూ.5 వేలు ప్రభుత్వానికి, రూ.25 వేలు బాధిత బాలికకు పరిహారంగా చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసులో సమర్థవంతమైన దర్యాప్తు నిర్వహించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులను, కోర్టులో వాదనలు వినిపించిన ప్రాసిక్యూషన్ బృందాన్ని ఉన్నతాధికారులను సీపీ శంఖబ్రతబాగ్చి అభినందించారు.

## యోగా తోనే దుఃఖానికి చెక్

(7వ పేజీ తరువాయి)

శాశ్వతమైన ఆనందం బాహ్య వస్తువుల్లో కాకుండా మన అంతరంగంలోనే ఉందని స్పష్టం చేశారు. యోగశాస్త్ర పితామహుడిగా గుర్తింపు పొందిన పతంజలి చెప్పిన "హేయం దుఃఖమనాగతమ్" సూత్రాన్ని ప్రస్తావిస్తూ, ఇంకా రాని దుఃఖాన్ని ముందుగానే నివారించవచ్చని వివరించారు. అజ్ఞానం, అహంకారం, అనుబంధం, ద్వేషం, భయం అనే ఐదు ప్రధాన కారణాల వల్లే మనిషి బాధలకు గురవుతున్నాడని పేర్కొన్నారు. యోగం కేవలం శారీరక వ్యాయామం కాదని, అది సంపూర్ణ జీవన విధానమని గురుదేవ్ తెలిపారు. యోగ సాధన ద్వారా మనస్సు ప్రశాంతంగా మారడంతో పాటు కోపం, అసూయ, ద్వేషం వంటి ప్రతికూల భావోద్వేగాలు క్రమంగా తగ్గిపోతాయని చెప్పారు. భావోద్వేగాలకు బానిసలుగా కాకుండా వాటిపై నియంత్రణ సాధించేందుకు యోగం సహాయపడుతుందని వివరించారు.

ప్రతి శిశువు సహజ యోగిగా జన్మిస్తాడని, పెరుగుతున్న కొద్దీ భయాలు, కోరికలు, ఒత్తిడులు మన జీవితంలో ప్రవేశిస్తాయని ఆయన పేర్కొన్నారు. యోగం మనల్ని తిరిగి సహజత్వం, సరళత, ఆనందం వైపు తీసుకువెళ్తుందని చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాన్ని ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని గురుదేవ్ పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన, ఆనందమయమైన సమాజ నిర్మాణానికి యోగం కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.

## పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి

(7వ పేజీ తరువాయి)

సహకారం కూడా తీసుకోవాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫాంల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియలు వేగవంతంగా, సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలన్నారు. నేటి నుంచి ప్రతిరోజూ ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తానని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రాంతంలో లాక్డ్ డోర్లు ఎక్కువగా ఉన్నాయని ఏఈఆర్వో వివరించగా, ప్రత్యేక నోడల్ అధికారి సహకారంతో సమస్యను అధిగమించి ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో దిలీప్ చక్రవర్తి, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శివఫైర్ వర్క్స్ యజమానిపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక

గాజువాక,జూన్ 18,ప్రభాతవార్త :



కణితి రోడ్డులోని 'శివ ఫైర్ వర్క్స్' బాణసంచా దుకాణంలో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. దుకాణంలో వెల్డింగ్ పనులు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా నిప్పురవ్వలు ఎగసిపడి ఈ ప్రమాదం జరిగినట్లు సౌత్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సదరు బాణసంచా దుకాణానికి పోలీసుల అనుమతి లేదని ఏసీపీ స్పష్టం చేశారు. జనావాసాల మధ్య పేలుడు పదార్థాల విక్రయాలు నిబంధనలకు విరుద్ధమని, నిబంధనలు ఉల్లంఘించిన యజమానిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు.

బాధితుల అనుమానాలు.. దర్యాప్తునకు డిమాండ్

ఈ అగ్నిప్రమాదంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఇదే దుకాణంలో ప్రమాదాలు జరగడం వెనుక భీమా (ఇన్సూరెన్స్) సొమ్ము క్లెయిమ్ చేసుకునే పన్నాంగం ఉందేమోనన్న ప్రచారం స్థానికంగా సాగుతోంది. భీమా సంస్థల ప్రతినిధులు, యజమాని కుమ్మక్కై ఇలా చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే షాపులో ప్రతి ఏటా ప్రమాదాలు జరుగుతుంటే ఫైర్ అండ్ సేఫ్టీ విభాగం అధికారులు ఏ ప్రాతిపదికన అనుమతులు ఇస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేక నిఘా విభాగంతో సమగ్ర దర్యాప్తు జరిపించి, అసలు నిజాలు బయటకు తీయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు

# డ్రగ్స్ మాఫియాకు గట్టి దెబ్బ

(7వ పేజీ తరువాయి)

లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. డ్రోన్ల నిఘా, నిరంతర తనిఖీలు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, గిరిజన యువతకు ఉపాధి కల్పన వంటి చర్యలతో ఈ విజయం సాధ్యమైంద న్నారు. జూలై 2024 నుంచి ఇప్పటివరకు రేంజ్ పరిధిలో 1,142 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 3,377 మంది నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. 65,560 కిలోల గంజాయి, 83.19 కిలోల హాషీష్ ఆయిల్ స్వాధీనం చేసుకోవడంతో పాటు 832 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. 19 కేసుల్లో రూ.11.02 కోట్ల విలువైన ఆస్తులను ఫ్రీజ్ చేసి డ్రగ్స్ మాఫియా ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టినట్లు పేర్కొన్నారు. పునరావృత నేరస్థులపై ప్రత్యేక దృష్టి సారించి 51 మందిని నిర్బంధించడంతో పాటు 1,942 హిస్టరీ షీట్లు తెరిచినట్లు చెప్పారు. ప్రత్యేక బృందాల ద్వారా పరారీలో ఉన్న 497 మంది నిందితులు, 419 మంది నాన్-బెయిలబుల్ వారెంట్ నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ జీవనోపాధికి ప్రాధాన్యం ఇస్తూ 29,840 ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించారని, 415 మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. మాదకద్రవ్యాలకు బానిసలైన 258 మందిని డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా, గురువారం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 490 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 20,876 కిలోల గంజాయి, 23.68 కిలోల హాషీష్ ఆయిల్‌ను చట్టప్రకారం బహిరంగంగా ధ్వంసం చేశారు. మాదకద్రవ్యాల రహిత సమాజ స్థాపన లక్ష్యంగా పోలీస్ శాఖ మరింత కట్టుదిట్టమైన చర్యలతో ముందుకు సాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు , అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ , అనకాపల్లి జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా , విజయనగరం జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ , పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి లతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణకు.. కమిషన్ కట్టుబడి ఉంది

విశాఖపట్నం, జూన్ 18 (ప్రభాత వార్త):



- విలేకరుల సమావేశంలో ఛైర్‌పర్సన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణరాజు
- ఆర్టీఈ చట్టం ప్రకారం పాఠశాలల్లో ఉచిత సీట్లు తప్పనిసరిగా ఇవ్వాలని నిర్దేశం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మార్చి 30, 2026న బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రాష్ట్రంలోని బాలల సంక్షేమం, భద్రత, విద్యా హక్కుల పరిరక్షణ కోసం విస్తృతంగా పనిచేస్తోందని కమిషన్ ఛైర్‌పర్సన్ వేటుకూరి ఏవీఎస్ సూర్య నారాయణరాజు పేర్కొన్నారు. కమిషన్ గత రెండు నుంచి మూడు నెలల కాలంలో రాష్ట్రంలోని 50 శాతానికి పైగా జిల్లాలను సందర్శించి, బాలల సమస్యల ను ప్రత్యక్షంగా పరిశీలించిందన్నారు. బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల విషయంలో కమిషన్ కఠినంగా వ్యవహరిస్తోందని, పోక్సో కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా పోలీసు శాఖతో సమన్వయం చేస్తూ నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. ఒక్కరోజు పర్యటనలో భాగంగా గురువారం కమిషన్ సభ్యుడు గంగా సూర్యనారాయణ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ హాలులో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పలు అంశాలపై వివరించారు.

జూన్ 12న అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, బాల కార్మిక నిర్మూలన కోసం ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 14 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు కేటాయించే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులు, హాస్టళ్లు, పాఠశాలల్లో పిల్లలకు అందుతున్న సదుపాయాలను పరిశీలించి, మౌలిక వసతుల మెరుగుదలకు సంబంధించిన నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తున్నామని చెప్పారు. భిక్షాటనలో నిమగ్నమైన పిల్లలను గుర్తించి విద్యా వ్యవస్థలోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియా ప్రభావం వల్ల పిల్లలపై ఏర్పడుతున్న ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక విధానాన్ని రూపొందించి త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని బాలబాలికలపై ఎటువంటి అఘాయిత్యాలు జరిగినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు లేదా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రతి చిన్నారికి భద్రత, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, సంక్షేమం అందేలా కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి, జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ సి.హెచ్. సంతోషి కుమారి, జిల్లా బాలల సంరక్షణ అధికారి కన్నూరు హరికృష్ణ, డీపీవో శ్రీధర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్. రాధ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# దక్షిణ రూపురేఖలు మార్చేస్తాం..!

(7వ పేజీ తరువాయి)

అభివృద్ధి చేయడంతో పాటు, ఆ ప్రాంతాన్ని ఆర్కే బీచ్ తరహాలో తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. స్థానిక మత్స్యకారుల కోసం సామాజిక భవనం నిర్మాణం, పురాతన లైట్ హౌస్ అభివృద్ధి, ఎస్.ఎల్. కెనాల్ పనుల పూర్తి ద్వారా కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. అలాగే టౌన్ హాల్, పాత పోస్ట్ ఆఫీస్ జంక్షన్ ప్రాంతాల అభివృద్ధితో పాటు ఎమ్మార్వో, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం చేపడతామని తెలిపారు. జనతా బజార్ పునర్నిర్మాణం, పూర్ణ మార్కెట్ ఆధునీకరణ, సీ హార్స్ జంక్షన్ వద్ద కూరగాయల మార్కెట్ ఏర్పాటు, నెహ్రూ బజార్‌లో నూతన భవనాల నిర్మాణం వంటి పలు ప్రాజెక్టులను ప్రకటించారు.

వీసీటీపీఎల్ ప్రాజెక్టు సందర్భంగా మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు 543 మందికి ఈ నెలాఖరులోగా రెండు సెట్ల భూములు అందజేస్తామని తెలిపారు. జగదాంబ జంక్షన్‌లో డచ్ స్మశానవాటికను పార్కుగా అభివృద్ధి చేసి ఆ ప్రాంత రూపురేఖలను మార్చనున్నట్లు చెప్పారు. రైల్వే స్టేషన్ అభివృద్ధిలో భాగంగా 14 ప్లాట్‌ఫారమ్‌ల నిర్మాణంతో పాటు సుమారు రూ.1000 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. వేలంపేట, లక్ష్మీనగర్, వార్డ్‌బాయ్ లైన్, ఏడుగుళ్ళ ప్రాంతాల్లో హౌసింగ్ ప్రాజెక్టులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి, గ్రామాలకు ఆర్చ్‌ల నిర్మాణం, సామాజిక భవనాల నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ ఒకే లక్ష్యంతో పనిచేస్తు న్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.ఏ. రెహమాన్, జనసేన పార్టీ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ పి. శివప్రసాద్ రెడ్డి, స్టేట్ డైరెక్టర్ విజయేంద్ర రెడ్డి, బీజేపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త బొత్స సురేష్ కుమార్, శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ కందుల నాగరాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అత్తిలి శంకరరావు, కే. రామ్ కుమార్, శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం, తెలుగుదేశం పార్టీ 29వ వార్డు అధ్యక్షుడు ఉరుకుటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలన అందించడమే ఎన్ డి ఏ ప్రభుత్వం లక్ష్యం



### 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం" ఎన్డీఏ కూటమి సభలో పాల్గొన్న విష్ణుకుమార్ రాజు

విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త:

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" పేరుతో నిర్వహించిన ఎన్డీఏ కూటమి సభలో విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ శ్రీ పి. విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ సంపూర్ణ సహకారం, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ కృషితో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. గత రెండేళ్లలో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల సృష్టి, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విశేష పురోగతి సాధించిందని తెలిపారు. ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి బలమని, అదే నమ్మకంతో మరింత అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అదేవిధంగా, రాష్ట్రం అభివృద్ధి పథంలో వెనుకబడటానికి గత ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. అమరావతిలో నిర్మించిన ప్రజావేదిక కూల్చివేత, అన్న క్యాంటీన్ల మూసివేత, ఇసుక విధానంలో అవ్యవస్థలు, మద్యం విధానంలో చోటుచేసుకున్న వివాదాలు రాష్ట్ర ప్రగతికి ప్రతికూల సంకేతాలను పంపాయని పేర్కొన్నారు. అలాగే విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీ ఎం. శ్రీభరత్ మెడికల్ వ్యాన్ ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ, అనేక వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఆయన చేస్తున్న సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని కొనియాడారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎన్డీఏ కూటమి సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేస్తోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం అనే ద్వంద్వ లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజల సహకారంతో మరిన్ని విజయాలు సాధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పట్టాభిరామ్ , మాజీ ఎమ్మెల్సీ రామారావు , టీడీపీ నాయకులు కిమిడి మల్లిక్ నాయుడు , సురేష్ బాబు కోయిలాడ వెంకటేష్ గారు, బీజేపీ యువ నాయకులు సునీల్ అగర్వాల్ శ్రీమతి సుహాసిని ఆనంద్ , శ్రీమతి సుజాత శ్రీధర్ , జె.పృథ్వీరాజ్ శివాజీ ,పైలా ముత్యాల నాయుడు , సత్యనారాయణ , శ్రీమతి మల్లా లక్ష్మి , మోహన్ తో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# హెల్మెట్ లేకుంటే కోర్టుకు!

- తొలిరోజు 48 ద్విచక్ర వాహనాల సీజ్
- ఇకపై వెనుక కూర్చునే వారికీ తప్పనిసరి
- గాజువాక ట్రాఫిక్ సీఐ షేక్ హుస్సేన్ హెచ్చరిక



గాజువాక, జూన్ 18,ప్రభాతవార్త :

విశాఖ నగరంలో జరుగుతున్న రహదారి ప్రమాదాల్లో ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులే ప్రాణాలు కోల్పోతున్నారని, అందులోనూ హెల్మెట్ ధరించని వారి మరణాలే అధికంగా ఉన్నాయని గాజువాక ట్రాఫిక్ సీఐ షేక్ హుస్సేన్ ఆందోళన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని పోలీసులు ఎన్నిసార్లు హెచ్చరిస్తున్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై గురువారం గట్టి నిఘా పెట్టారు. పాత గాజువాక, షీలానగర్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ ఎస్సైలు శాంతరావు, రాధాకృష్ణల ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న 48 ద్విచక్ర వాహనాలను పట్టుకుని సీజ్ చేశారు.

హెల్మెట్ ధరించని వాహనదారులపై మోటారు వాహనాల చట్టం ఉల్లంఘన కింద కేసులు నమోదు చేసి, కోర్టులో ఛార్జ్‌షీట్ ఫైల్ చేస్తామని సీఐ షేక్ హుస్సేన్ స్పష్టం చేశారు. ఇకపై విశాఖపట్నం సిటీ పరిధిలో ద్విచక్ర వాహనం నడిపే వారితో పాటు, వెనుక కూర్చునే (పిలియన్ రైడర్) వారు కూడా విధిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# శక్తి యాప్ తో మహిళకు రక్షణ కవచం...

### ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి

విశాఖపట్నం, జూన్ 18 ప్రభాతవార్త

మహిళల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన శక్తి యాప్ సమర్థవంతంగా పనిచేస్తోందని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపారు.సింగ్ హోటల్ జంక్షన్ సమీపంలోని నెహ్రూనగర్‌లో ఉన్న సెయింట్ జోసెఫ్ సన్ నర్సింగ్ కళాశాలలో మహిళలు, విద్యార్థినుల కోసం శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ లక్ష్మణ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని యాప్ విని యోగం, ప్రయోజనాలపై విద్యార్థుల తో ముఖాముఖి గా మాట్లాడి మహిళల భద్రత పై స్పష్టంగా తెలియజేసారు. ఆయన మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న కొన్ని సంఘటనల నేపథ్యంలో మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ రక్షణ అందించేందుకు శక్తి యాప్ కీలకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 164 ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని, అవి పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు భద్రతా అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు. శక్తి యాప్‌లో 16 రకాల అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయని, యాప్ ద్వారా లేదా 112 నంబర్‌కు సమాచారం అందిన వెంటనే సాధ్యమైనంత త్వరగా పోలీసులు స్పందించి బాధితులకు సహాయం అందిస్తారని పేర్కొన్నారు. మహిళలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే యాప్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేసే సౌకర్యం కల్పించబడిందన్నారు. ఇప్పటికే శక్తి యాప్ ద్వారా అందిన ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మహిళల భద్రత కోసం రూపొం దించిన ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియో గించుకోవడంతో పాటు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీలక్ష్మి, మన్మధరావు, ఈస్ట్ సబ్ డివిజన్ శక్తి బృందానికి చెందిన ఏఎస్ఐ కె. శ్రీనివాసరావు, కన్నారావు, శ్యాం, కృష్ణ, రూపదేవి, మహిళలు, విద్యార్థినులు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన



(7వ పేజీ తరువాయి)

ఏ విధంగా జరుగుతున్నాయి.. పాఠ్య పుస్తకాలు అందించారా లేదా అని ఆరా తీశారు. ఏఐ కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించి అక్కడి వారితో మాట్లాడారు. అలాగే దివిస్ సహకారంతో అభివృద్ధి చేస్తున్న మైదానాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసి పిల్లలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఆయన వెంట భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, వ్యవసాయ శాఖ జేడీ అప్పలస్వామి, ఏపీసీ చంద్రశేఖర్, భీమిలి తహశీల్దార్ రామారావు, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

## జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సులో అగ్నిప్రమాదం

### ప్రయాణికులంతా సురక్షితం



అనకాపల్లి, జూన్ 18, ప్రభాతవార్త :

అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం రేగుపాలెం జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తులసి ట్రావెల్స్‌కు చెందిన ఈ బస్సు భువనేశ్వర్ నుంచి చెన్నైకి వెళ్తుండగా ప్రమాదానికి గురైంది. ప్రయాణ మధ్యలో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపివేశారు. వెంటనే ప్రయాణికులను బస్సు నుంచి కిందకు దింపడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం సంభవించి ఉండొచ్చని ఫైర్ అధికారులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

## కనకమహాలక్ష్మి ఆలయంలో రాష్ట్రంలోనే తొలి ఏసీ అన్నదాన సత్రం

విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త :



బురుజుపేటలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో రాష్ట్రంలోనే తొలి ఏసీ అన్నదాన సత్రాన్ని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా ఈ సత్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవస్థానం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏసీ అన్నదాన సత్రం ఏర్పాటులో కృషి చేసిన దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు, ధర్మకర్తల మండలి సభ్యులను ఆయన అభినందించారు. భక్తుల కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చైర్మన్ కందుల నాగరాజు తెలిపారు.

## 66 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఆరిలోవ, జూన్ 18, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 10వ వార్డులో ఇందిరా నగర్ లో గురువారం జీవీఎంసీ నిధులతో సుమారు 66 లక్షల రూపాయలతో ఇందిరానగర్ ద్వారం దగ్గర నుంచి హైవే లో అనుకోని ఉన్నటువంటి డ్రైన్ నిర్మాణం కొరకు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, వార్డు మాజీ కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్ విచ్చేసి పూజా కార్యక్రమాలతో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి వేముల వెంకట్రావు, యువత అధ్యక్షులు కర్రి హరి ప్రకాష్ రావు, క్లస్టర్ ఇంచార్జి మద్దిల రాజేష్, యూనిట్ ఇంచార్జి లు, చనుమోలు శ్రీనివాసరావు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్షం లోనూ ఆగని "సర్" ప్రక్రియ



ఆరిలోవ, జూన్ 18, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డులో 21 బూత్ లలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా తెదేపా నాయకులు బిఎల్వోలతో వర్షంలో కూడా ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను అందించి ఓటర్ల నుండి సమగ్ర సమాచారం సేకరించారు. ప్రతి ఓటు కీలకమని బిఎల్ఏ లు అత్యంత కీలకంగా వ్యవహరించి 'సర్' ప్రక్రియలో పాల్గొని 2002 ఓటర్ లిస్టు ద్వారా మ్యాపింగ్ చేయాలని, ఆండ్రాయిడ్ మొబైల్ నందు ప్లే స్టోర్ లోకి వెళ్లి ఈసీఐ నెట్ యాప్ డౌన్లోడ్ చేసుకుని అందులో సర్ కి సంబంధించిన వివరాలన్నీ ఉంటాయని, ఈ ప్రక్రియ సులభతరం అవ్వాలంటే అందరూ కూడా ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, పార్టీ అధికార ప్రతినిధి, క్లస్టర్ 1 ఇంచార్జి పాత్రకండ ధర్మారావు, వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి,వార్డు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, మహిళా ఉపాధ్యక్షురాలు మచ్చ జ్యోతమ్మ, ఓశెట్టి గురుమూర్తి, కనకల శ్రీను, బోనెల కుమారి,గురజాపు వాసు తదితరులు పాల్గొన్నారు.

## చిల్డ్రన్ హోమ్ లో ప్రవేశానికి అవకాశం



ఆరిలోవ, జూన్ 18, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక పదో వార్డ్ పాత డైరీ ఫారం వద్ద ఇందిరా గాంధీ నగర్ లో ఉన్న ఆనంద మార్గ చిల్డ్రన్ హోమ్ లో 6 నుండి పదేళ్ల లోపు వస్తున్న బాలురకు ఉచితంగా విద్యా వసతి భోజన సౌకర్యం కల్పించడానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవలసిందిగా హోం ఇన్చార్జ్ ఆచార్య సౌమ్యానంద అవధూత ఒక ప్రకటనలో తెలిపారు. అనాధలు, పేదలు ఈ హోమ్ లో చేరడానికి అర్హులన్నారు. సుమారు 7వేల చదరపు గజాలు విస్తీర్ణం కలిగిన విశాలమైన ఆధునిక బహుళ అంతస్తు భవంతి లో బాలురకు వసతి కల్పిస్తామని తెలిపారు. విశాఖ జిల్లా కలెక్టర్ అనుమతితో నిర్వహిస్తున్న ఈ హోమ్‌లో వసతితోపాటు మంచి ఆహారాన్ని, విద్యను అందిస్తామని హోమ్ ఇన్చార్జ్ తెలిపారు. ఈ హోమ్‌లో చేర్చడానికి ఆసక్తి ఉన్నవారు 9030502164, 9550775518 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని లేదా నేరుగా పాత డైరీ ఫారం బిపిసిఎల్ పెట్రోల్ బంక్ వెనుకనున్న తమ హోమ్ ను సంప్రదించాలని కోరారు.

## ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్ లో జీబ్రా, నక్షత్ర తాబేలు దత్తత



ఆరిలోవ, జూన్ 18, ప్రభాతవార్త

ఇందిరా గాంధీ జూలాజికల్ పార్క్ లో జంతు దత్తత కార్యక్రమానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తోంది. జూలోని రాజా అనే జీబ్రాను ఒక సంవత్సరం కాలానికి దత్తత తీసుకునేందుకు మజ్జి సిరి సహస్ర (సిరియమ్మ) 60,000 విరాళంగా అందించారని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. అటవీ శాఖ సీనియర్ అసిస్టెంట్ బుక్కాపట్నం రామాదేవి ఒకనక్షత్ర తాబేలు ను ఏడాది పాటు దత్తత తీసుకుంటూ10,000 విరాళం అందజేశారు. దత్తతదారులకు జూ మేనేజ్‌మెంట్ తరపున క్యూరేటర్ కృతజ్ఞతలు తెలుపుతూ అడాప్షన్ సర్టిఫికెట్లు,సావనీర్ కిట్లను అందజేశారు.?ఈసందర్భంగా క్యూరేటర్ మాట్లాడుతూ.. వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలను భాగస్వాములను చేయడమే ఈకార్యక్రమ ముఖ్య ఉద్దేశమని,ఈ విరాళాలకు ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80జి(5) ప్రకారం పన్ను మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. జూ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఇ.ఉమాదేవి, అసిస్టెంట్ క్యూరేటర్లు బి.గోపి, పి.వి.చౌదరి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు భారతి, హరి తదితరులు పాల్గొన్నారు.

## పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు: చదరం తులసిరామ్



గాజువాక, జూన్ 18,ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తైన సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో గాజువాక నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపినట్లు ప్రముఖ యువ నేత చదరం తులసిరామ్ పేర్కొన్నారు. గాజువాక అభివృద్ధికి అవసరమైన జీవోలు తీసుకురావడం, సూపర్ సిక్స్ హామీల అమలుతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పల్లా శ్రీనివాసరావు కీలక పాత్ర పోషించారని అన్నారు. మీ సేవా వ్యవస్థను బలోపేతం చేయడం, అంగన్‌వాడీ సేవల అభివృద్ధి, మెగా డీఎస్సీ నిర్వహణ, విశాఖ ఉక్కు కర్మాగారానికి పూర్తి స్థాయిలో అండగా నిలవడం వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు నిర్వహిస్తూనే గాజువాక నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న పల్లా శ్రీనివాసరావు సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షిస్తూ తులసిరామ్ అభినందనలు తెలిపారు.

## బీచ్‌లో బార్ల జీవో ప్రతుల దగ్ధం



గాజువాక,జూన్ 18,ప్రభాతవార్త :

బీచ్‌లలో మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 362ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసనలు జరిగాయి. గొల్లలపాలెం, నెహ్రూనగర్, తిరునాథపురం, క్రాంతినగర్ పరిధిలో మహిళలు జీవో ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జోన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.మమత, ఆర్.విమల మాట్లాడుతూ.. పర్యాటకం నెపంతో బీచ్‌లలో బార్ల సంస్కృతిని తెచ్చి యువత భవిష్యత్తును నాశనం చేయవద్దన్నారు. అక్రమ మద్యం, బెల్టు షాపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఉన్నత పదవిలో ఉన్న విశాఖ ఎంపీ శ్రీభరత్ మహిళల పట్ల బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఐద్వా నేతలు నిర్మల, ఈశ్వరమ్మ, సింహాచలం, వై.కళ్యాణి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గాజువాకలో కూటమి విజయోత్సవం

గాజువాక,జూన్ 18,ప్రభాతవార్త :

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక గాజువాక క్లబ్‌లో విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హాజరయ్యారు. జనసేన గాజువాక ఇన్‌ఛార్జి, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావుతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

కార్యక్రమంలో భాగంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు,



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. బీజేపీ విశాఖ జిల్లా

### హాజరైన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కోన తాతారావు

ఉపాధ్యక్షుడు దేనంకొండ కృష్ణంరాజు, సీనియర్ నాయకుడు బాటా శ్రీనివాసరావు, పాత గాజువాక మండల అధ్యక్షురాలు దేనంకొండ పావని తదితరులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతి, నియోజకవర్గ అభివృద్ధిపై ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'డ్రింక్ ఫ్రం ట్యాప్' అమలుపై జీవీఎంసీలో రాష్ట్రస్థాయి శిక్షణ ప్రారంభం

విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త :

పట్టణ ప్రాంతాల్లో 24 గంటలపాటు నాణ్యమైన తాగునీటి సరఫరా లక్ష్యంగా అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన "డ్రింక్ ఫ్రం ట్యాప్" (డీఎఫ్‌టీ) ప్రాజెక్టు అమలుపై మూడు రోజుల రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం గురువారం జీవీఎంసీ పాత కౌన్సిల్ హాలులో ప్రారంభమైంది.

కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని సీపీహెచ్ఈఈఓ, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ), గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తరఫున అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ పట్టణ అవసరాలకు అనుగుణంగా ప్రతి ఇంటికి సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని 24 గంటలూ అందించేందుకు డీఎఫ్‌టీ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల



అధికారులు, ఇంజనీర్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిర్వహణ విధానాలపై అవగాహన పెంపొందించుకోవడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో సీపీహెచ్ఈఈఓ సంయుక్త సలహాదారు డా. వి.కె. చౌరాసియా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఎఫ్‌టీ లక్ష్యాలు, సేవా ప్రమాణాలు, స్థానిక సంస్థల బాధ్యతలను వివరించారు. ఒడిశా ప్రభుత్వ వాట్కో కన్సల్టెంట్ చిన్మయ్ త్రిపాఠి నిరంతర తాగునీటి సరఫరా వ్యవస్థల ప్రణాళిక, రూపకల్పన, అమలు అంశాలపై సాంకేతిక ప్రజెంటేషన్ ఇచ్చారు.

జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు నగరంలో అమలవుతున్న 24x7 నీటి సరఫరా వ్యవస్థ, నీటి శుద్ధి కేంద్రాలు, స్కాడా వ్యవస్థ నిర్వహణపై వివరించారు. సాంకేతిక సమావేశాల్లో నాన్-రెవెన్యూ వాటర్ తగ్గింపు, ప్రాజెక్టు వ్యయ నియంత్రణ, 24 గంటల నీటి సరఫరా నిర్వహణ, ఐగాట్, నేషనల్ అర్బన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా సామర్థ్యాభివృద్ధి వంటి అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు.

జూన్ 20 వరకు కొనసాగే ఈ శిక్షణలో భాగంగా మాధవధారలోని స్కాడా వ్యవస్థ, గాజువాక నీటి శుద్ధి కేంద్రాలకు క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించనున్నారు. అలాగే నగరాల కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనపై ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ పట్టణ స్థానిక సంస్థల అధికారులు, ఇంజనీర్లు, తాగునీటి రంగ నిపుణులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## గాజువాకలో అగ్నిప్రమాదం

- భయాందోళనలో స్థానికులు
- బాణసంచా దుకాణంలో చెలరేగిన మంటలు
- రంగంలోకి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది



గాజువాక,జూన్ 18,ప్రభాతవార్త :

గాజువాకలో గురువారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కణితి రోడ్డులోని 'శివ ఫైర్ వర్క్స్' బాణసంచా దుకాణం నుంచి ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగ చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే గాజువాక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుకాణంలో వెల్డింగ్ పనులు జరుగుతున్న సమయంలో నిప్పురవ్వలు పడి ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ బాణసంచా దుకాణానికి పోలీసుల అనుమతి లేదని, జనావాసాల మధ్య విక్రయాలు నిబంధనలకు విరుద్ధమని స్థానికులు ఆరోపిస్తున్నారు. యజమానిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## జూన్ 23న జీవీఎంసీ వెస్ట్ జోన్‌లో రెవెన్యూ (ట్యాక్స్) మేళా

విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త :



గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) వెస్ట్ జోన్ పరిధిలోని ప్రజల కోసం జూన్ 23న ప్రత్యేక రెవెన్యూ (ట్యాక్స్) మేళాను నిర్వహించనున్నట్లు వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ బి.హేమావతి తెలిపారు. మల్కాపురంలోని న్యూ మరిడిమాంబ కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి ఈ మేళా నిర్వహించబడుతుందని ఆమె పేర్కొన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. వెస్ట్ జోన్ పరిధిలోని 40, 58, 59, 60, 61, 62, 63 వార్డుల ప్రజలు ఈ మేళాలో పాల్గొని ఆస్తి పన్నులు, నీటి చార్జీలు, పేరుమార్పులు, పన్ను అంచనాలు తదితర రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు, గృహ యజమానులు తమ సమస్యలకు సంబంధించిన పత్రాలతో మేళాకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ హేమావతి విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ అధికారులు ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించేందుకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

# కూటమితోనే సుపరిపాలన

- సూపర్ సిక్స్ సూపర్ హిట్
- హామీలను నూటికి నూరు శాతం నెరవేర్చాం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



గాజువాక,జూన్ 18,ప్రభాతవార్త :

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గాజువాక క్లబ్‌లో విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నూటికి నూరు శాతం నెరవేర్చామని, 'సూపర్ సిక్స్' పథకాలు సూపర్ హిట్ అయ్యాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం గురించి మాట్లాడే హక్కు తమ కూటమికి మాత్రమే ఉందన్నారు. జగన్ హయాంలో స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసి, అమ్మేయాలని చూశారని ఆరోపించారు.

### డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి

బీజేపీ నాయకుడు కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రాల్లోని డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా సంక్షేమం, అభివృద్ధి వేగంగా సాగుతున్నాయన్నారు. రైల్వే జోన్, ఈఎస్ఐ ఆసుపత్రి, భోగాపురం విమానాశ్రయ పనులతో పాటు.. ఉక్కు కర్మాగారానికి రూ 11,440 కోట్ల ఉద్దీపన ప్యాకేజీని అందజేసినందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మరో నాయకుడు చదరం తులసిరామ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక జీవోలు తీసుకురావడంతో పాటు స్టీల్‌ప్లాంట్‌కు అండగా నిలిచిన ఎమ్మెల్యే పల్లాకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను కూటమి నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, మాజీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, బీజేపీ నేతలు దేనంకొండ కృష్ణంరాజు, బాటా శ్రీనివాసరావు, దేనంకొండ పావని తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో మహామన మాళవీయ మిషన్ నూతన శాఖ ప్రారంభం

విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త:

భారతరత్న పండిట్ మదన్ మోహన్ మాళవీయ ఆశయాలు, విలువలను సమాజంలో విస్తరింపజేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన "మహామన మాళవీయ మిషన్" విశాఖపట్నం నూతన శాఖ ప్రారంభోత్సవం ఈ నెల జూన్ 20న శనివారం ఉదయం 10 గంటలకు ద్వారకానగర్‌లోని విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ ఫంక్షన్ హాల్--1లో నిర్వహించనున్నట్లు విశాఖ శాఖ కార్యదర్శి కుర్రా అశోక్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా, మహామన మాళవీయ మిషన్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు హరిశంకర్ సింగ్ గౌరవ అతిథిగా



హాజరుకానున్నారు. శాఖ ప్రారంభోత్సవానికి ముందుగా కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశాఖ శాఖ అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ మాట్లాడుతూ, నూతన శాఖ ద్వారా రాష్ట్రంలో విద్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం, సామాజిక సేవ, మహిళా సాధికారత, ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, దేశ నిర్మాణ కార్యక్రమాలకు ప్రోత్సాహం కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు .మహామన మాళవీయ మిషన్ చేపట్టనున్న వివిధ సేవా కార్యక్రమాల్లో పౌరులు, విద్యావేత్తలు, విద్యార్థులు చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో కొసరాజు గోపాలకృష్ణ, కుర్రా అశోక్ కుమార్, కె. రాజు కుమార్,డా.కృష్ణ ,సాయి బాబు,మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో గోద్రెజ్ ఇంటీరియో




విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త:

గోద్రెజ్ ఎంటర్ప్రైజెస్ గ్రూప్ కు చెందిన ప్రముఖ ఫర్నిచర్ బ్రాండ్ 'గోద్రెజ్ "ఇంటీరియో' విశాఖపట్నంలో సరికొత్త కంపెనీ సొంత స్టోర్‌ను గురువారం ప్రారంభించింది. ద్వారకా నగర్ ఏరియాలో 8000 చదరపు అడుగుల భారీ వైశాల్యంలో ఏర్పాటైన ఈ స్టోర్ ఆంధ్రప్రదేశ్లోనే అత్యంత పెద్దది కావడం విశేషం అని గోద్రెజ్ ఇంటీరియో కన్స్యూమర్ బిజినెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మరియు హెడ్ డాక్టర్ దేవ్ నారాయణ చెప్పారు. అంతేకాకుండా తమిళనాడు మార్కెట్లో కూడా ఈ బ్రాండ్ తన రిటైల్ వ్యాపారాన్ని మరింత విస్తరించ డానికి ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు.

విశాఖపట్నం కొత్త స్టోర్ అనేది కస్టమర్ల ఆలోచనలకు తగ్గట్టుగా ఉండే మంచి డిజైన్లు, క్వాలిటీ ఫర్నిచర్ ను వారికి మరింత దగ్గర చేయాలనే మా నిరంతర ప్రయత్నానికి నిదర్శనం అన్నారు. ఈ షోరూమ్ కి వచ్చే కస్టమర్లు వివిధ రకాల స్టైల్స్, డిజైన్లు, ఫీచర్లను స్వయంగా చూసి ఒక మంచి షాపింగ్ అనుభవాన్ని పొందవచ్చు అని, వారికి సహాయం చేయడానికి మా సిబ్బంది కూడా ఉంటారన్నారు. కస్టమర్లకు నచ్చేలా, వారి ఇళ్లను ఎలా అలంకరించుకోవాలో ఐడియా వచ్చేలా ఒక మంచి వాతావరణాన్ని కల్పించడమే మా లక్ష్యం. దీనివల్ల వారు ఆలోచించి మంచి ఫర్నిచర్ను ఎంచుకోగలుగుతారు. ఈ స్టోర్ మంచి ప్రధాన ప్రాంతంలో ఉండటం మరియు మార్కెట్లో గోద్రెజ్ ఇంటీరియో బ్రాండ్ కి ఉన్న మంచి గుర్తింపు వల్ల.. 2027 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ ఒక్క స్టోర్ నుండే ఏడాదికి రూ. 10 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నాం అన్నారు. ఈ కొత్త స్టోర్ ప్రారంభంతో ఏపీలో గోద్రెజ్ ఇంటీరియో తన వ్యాపారాన్ని మరింత విస్తరించింది. ఈ ప్రాంతంలో మాకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో కస్టమర్లు ఉన్నారు. 2027 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రాష్ట్రంలో మరో 20 స్టోర్లను తెరవాలని ప్లాన్ చేస్తున్నాం అని, రాబోయే 3 సంవత్సరాలలో 25 శాతం వృద్ధిని సాధించడమే మా లక్ష్యం అని చెప్పారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం మీద 40 కోట్ల రూపాయల ఆదాయాన్ని, దక్షిణాది రాష్ట్రాల నుండి రూ. 300 కోట్ల ఆదాయాన్ని సాధిస్తామని భావిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

## 19 న గ్రామాలలో యు ఎస్ ఎఫ్ డేటా సామాజిక తనిఖీ గ్రామ సభలు




పద్మనాభం, జూన్ 18, ప్రభాతవార్త :

మండలంలో పలు గ్రామ పంచాయతీలలో ఈ నెల 19 న యు ఎస్ ఎఫ్ డేటా సామాజిక తనిఖీ,ధృవీకరణపై ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎండిఒ బండారు చిన్నారావు చెప్పారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో డేటా సామాజిక తనిఖీపై గ్రామ సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు పారదర్శకత కోసం ఈ ధృవీకరణ అత్యంత కీలకమైనదని ఆయన అన్నారు. పంచాయతీలలో గురువారం డేటా ప్రదర్శన జరిగిందని అన్నారు. కుటుంబ వివరాలను డేటాలో సరిచూసుకోవాలని ప్రజలకు సూచించారు. పేరులు,కులం తదితర వివరాలలో తప్పులుంటే ఈ నెల 24 వరకు ఫిర్యాదు చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ముప్పై లక్షలతో లింగన్నపేట, గెద్దపేట అనుసందాన రోడ్డు నిర్మాణం



పద్మనాభం, జూన్ 18, ప్రభాతవార్త :

మండలంలో లింగన్నపేట,గెద్దపేట గ్రామాల మద్య ఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధులు సుమారు ముప్పై లక్షలతో అనుసందాన రోడ్డు నిర్మాణం చెందుతుంది. ఈ రోడ్డు నిర్మాణం చిన్నాపురం, కొయ్యపేట, బుడ్డివలస,లింగన్నపేట గ్రామాల ప్రజలు విజయనగరం జాతీయ రహదారికి వెళ్లడానికి సులభతరంగా ఉంటుంది. గెద్దపేట మాజీ ఎంపిటీసీ గెద్ద ఎర్రినాయుడు చొరవతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నిధులను మంజూరు చేసారు. లింగన్నపేట ప్రాధమిక పాఠశాల నుండి గెద్దపేట పరిధిలో ఉన్న పడగలపేట వరకు గ్రావెల్ రోడ్డు నిర్మితమవుతుంది. ఈ రోడ్డు గ్రామాల మద్య ఉన్న కృష్ణంరాజు చెరువు వద్ద ఈ రోడ్డుకి సంబందించి కల్వర్టు నిర్మాణం పూర్తయింది. ఈ రోడ్డు నిర్మాణంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.త్వరితగతిన రోడ్డును పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## యాదవులపై దాడిని ఖండించిన వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం



విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త :

బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని ఈదుమూడి గ్రామంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన యువకులు, గొర్రెల కాపరులపై జరిగిన దాడులను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం ఆధ్వర్యంలో గురువారం గ్రీన్ పార్క్ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్ నేతృత్వంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులపై జరిగిన దాడి దారుణమని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీసీలపై జరుగుతున్న అన్యాయాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎదుర్కొంటామని తెలిపారు.

మహాత్మా పూలే ఆశయాల స్ఫూర్తితో సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం బీసీ సమాజం ఐక్యంగా పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమలో పార్టీ నాయుకులు పల్లా దుర్గ, మహంతి పట్నాయక్ , మువ్వల సురేష్ , రామన్న పాత్రుడు, బోండాడ వెంకట రావు ,మజ్జి జ్యోతి, బాపు ఆనంద్, గురజాపు రవి తదితరలు పాల్గొన్నారు..

## పద్మనాభం మండలంలో రెండు రోజుల పాటు జడివాన



పద్మనాభం, జూన్ 18, ప్రభాతవార్త:

మండలంలో రెండు రోజుల నుండి జడివాన కురవడంతో రోడ్లు, పంట పొలాలు జలమయ మయ్యాయి. బుధవారం సాయంత్రం, గురు వారం ఉదయం మెరుపులు,భూమి దద్దరిల్లినట్లు పడిన పిడుగులతో కురిసిన వర్షాలతో వాతా వరణం ఒక్కసారిగా చల్లబడిపోయింది. తీవ్ర మైన ఎండలతో వేడెక్కిన వాతావరణంతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. అలాగే ఎండలకు ఎండిన పలు రకాల పంటలకు కూడా ఊపిరిపోసాయి.

## 23న చలో కలెక్టరేట్ వద్ద ధర్నా - విజయవంతం చేయాలని విజ్ఞప్తి

### మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యల పరిష్కరించాలి - సిఐటియు



అరకులోయ, జూన్ 18, ప్రభాతవార్త

మధ్యాహ్నం భోజనం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న ఏపీ మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న కార్మికులతో కలిసి చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలతో వెట్టి చాకిరి చేస్తున్నారని తెలిపారు. తక్షణమే కనీస వేతనం చెల్లించాలని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించకపోవడం అన్యాయమని అన్నారు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని దీంతో నిర్వహణ భారంగా ఉందని అన్నారు. గ్యాస్ సౌకర్యం లేక కట్టెలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 23న జరిగే కలెక్టరేట్ ధర్నాను జిల్లా నలుమూలల నుండి హాజరయ్యి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీత తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక రహిత సమాజం దిశగా అల్లూరి జిల్లా అడుగులు

### రెండేళ్లలో రికార్డు స్థాయి ప్రగతి -జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ ) రూ. 12,869 కోట్ల నుండి రూ. 18,300 కోట్లకు పెంపు : జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,జూన్18,ప్రభాతవార్త



పేదరిక నిర్మూలన ధ్యేయంగా, జిల్లా అభివృద్ధే పరమావధిగా ప్రభుత్వం, అధికార యంత్రాంగం రెండేళ్ల కాలంలో సూపర్ పాలన అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పాడేరు స్థానిక వీఆర్ ఫంక్షన్ హాల్లో దేశంలో 12 సంవత్సరాల సుపరిపాలన విశ్వాస్, వికాస్, జనకళ్యాణ్, రాష్ట్రంలో ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం నినాదంతో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ టి.నిశాంతి మాట్లాడుతూ రూ. 2,57,411లకు జిల్లా ప్రజల సగటు తలసరి ఆదాయం పెరిగిందన్నారు. జిల్లా ప్రజలకు ఇది శుభసూచకమని, మంచి తరుణమన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల కాలంలో జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల క్రింద రూ.751.92 కోట్లు, అన్న దాత సుఖీభవ ద్వారా రూ.145.41 కోట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పిఎం జన్మన్ (పీఎమ్ -జన్మన్) పథకం కింద గిరిజన గృహ నిర్మాణాలకు రూ. 312 కోట్లు వ్యయం చేసామన్నారు. "పేదరిక రహిత సమాజం దిశగా గిరిజన అభివృద్ధి మరియు జీవనోపాధి" అనే ఉన్నత ఆశయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత రెండేళ్లుగా అమలు చేసిన వినూత్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయని,జిల్లా యంత్రాంగం, ప్రభుత్వ శాఖల సమన్వయంతో విద్యా, వైద్య, వ్యవసాయ, మౌలిక వసతుల రంగాల్లో జిల్లా గణనీయమైన వృద్ధిని సాధించిందన్నారు. జిల్లాలో సాధించిన కీలక విజయాలను ప్రస్తావించారు. ఆర్థిక వృద్ధి, స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 విజన్లో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ప్రణాళికల వల్ల జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ ) 2023-24లో ఉన్న రూ.12,869 కోట్ల నుండి 2025-26 నాటికి రూ.18,300 కోట్లకు పెరిగిందన్నారు.



2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 27.76% రికార్డు స్థాయి వార్షిక వృద్ధి నమోదైందని,జిల్లా ప్రజల సగటు తలసరి ఆదాయం రూ.2,30,412ల నుండి రూ.2,57,411లకు వృద్ధి చెందిందన్నారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047 లక్ష్యంగా ప్రవేశపెట్టిన పీ4 పథకం ద్వారా జిల్లాలో 1,00,310 బంగారు కుటుంబాలను గుర్తించగా, ఇప్పటికే 48,275 కుటుంబాలను 6,095 మంది మార్గదర్శకులు దత్తత తీసుకుని ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారన్నారు. సామాజిక భద్రత, నేరుగా నగదు బదిలీ క్రింద పేద గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాలు పెంచేందుకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి) ద్వారా కోట్లాది రూపాయల లబ్ధిని చేకూర్చడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు 74,062 మంది లబ్ధిదారులకు రూ. 751.92 కోట్లు పంపిణీ చేపట్టన్నారు. అన్నదాత సుఖీభవ క్రింద 1,03,864 మంది రైతులకు రూ.145.41 కోట్లు, తల్లికి వందనం పథకంలో 1,11,789 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 145.32 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు 2,78,332 మంది లబ్ధిదారులకు రూ. 20.38 కోట్ల ఉచిత సిలిండర్ల లబ్ధి చేకూర్చామన్నారు. గిరిజన గృహ నిర్మాణం అండ్ మౌలిక వసతులు క్రింద పీఎమ్- జన్మన్ పథకం కింద జిల్లాలోని గిరిజన (పివిటిజి ) ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇందులో భాగంగా 14,687 మంది అర్హులకు రూ.2.39 లక్షల యూనిట్ విలువతో పక్కా గృహాలు మంజూరయ్యాయని, గత రెండేళ్లలో వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లకు రూ. 312 కోట్లు ఖర్చు చేయగా, 4,243 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. రూ. 84.74 కోట్ల వ్యయంతో 28,489 ఇళ్లకు కొత్తగా విద్యుత్ కనెక్షన్లు కల్పించడం జరిగిందన్నారు. మహిళా సాధికారత ఉపాధి కల్పనలో భాగంగా స్త్రీ శక్తి పథకం క్రింద 18.53 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుని రూ. 7.94 కోట్ల లబ్ధి పొందారన్నారు.



మహిళా స్వయం సహాయక సంఘాలకు డిఆర్డిఏ ద్వారా 6,487 పొదుపు సంఘాలకు రూ. 314.05 కోట్ల బ్యాంక్ రుణాలు, స్త్రీనిధి కింద రూ. 44.97 కోట్లు అందించామని, ఉద్యోగ నియామకాలును డియస్సీ 2025 ద్వారా రికార్డు స్థాయిలో 703 మంది అర్హులైన అభ్యర్థులను ఉపాధ్యాయులుగా నియమించామన్నారు. 21 జాబ్ మేళాల ద్వారా మరో 622 మంది యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించామన్నారు. విద్య, వైద్య రంగాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద 66,462 మంది విద్యార్థులకు రూ. 22.69 కోట్లు వ్యయం చేశామనీ, సమగ్ర శిక్షా అభియాన్ కింద రూ.411.38 కోట్లతో 1,404 పాఠశాలల ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు.ఆరోగ్య రంగంలో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 30,947 మందికి రూ.13.37 కోట్లతో ఉచిత కార్పొరేట్ వైద్యం అందించబడిందన్నారు. వ్యవసాయం అండ్ వినూత్న పంటల ప్రోత్సాహం క్రింద సాంప్రదాయ పంటలతో పాటు జిల్లాలో వాణిజ్య విలువలు గల ఎగ్జోటిక్ క్రాప్స్ అయిన అవకాడో, డ్రాగన్ ఫ్రూట్, స్ట్రాబెర్రీ సాగును 161 హెక్టార్లలో విస్తరించామని, ఉత్పత్తుల నిల్వ కోసం 27 కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్లను నిర్మించామన్నారు.సిల్క్ సమగ్ర పథకం కింద పట్టు రైతులకు రూ. 1.20 కోట్ల సబ్సిడీ అందించబడిందని, క్రాప్ లోన్లు, అగ్రి టర్మ్ లోన్ల రూపంలో రైతులకు రూ. 400 కోట్లకు పైగా రుణ సహాయం లభించడం జరిగిందన్నారు. ఈ సంక్షేమ పథకాల విజయవంతమైన అమలుతో అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతాల ప్రగతికి సరికొత్త చిరునామాగా మారుతోందని, భవిష్యత్తులో ఈ వృద్ధిని మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, బస్సు ప్రయాణం, వైద్య సేవలు, గృహ నిర్మాణం తదితర పథకాలతో పేదలకు అన్నివిధాలా మేలు జరుగుతోందని, జీవనోపాదులు కలుగుతున్నాయని టిడిపి అరకు పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జ్ తేజోవతి తెలిపారు. సమతూకంగా అభివృద్ధి, సంక్షేమం ప్రజాస్వామ్యబద్ధ పాలన, హామీలన్నీ సమర్థంగా ప్రభుత్వం అమలు చేస్తుందని రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య పేర్కొన్నారు. పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడారు. స్త్రీ శక్తి, దివ్యాంగ శక్తి పథకం ద్వారా మహిళలకు, విభిన్న ప్రతిభావంతులకు ఉచిత బస్సు సౌకర్యం ప్రభుత్వం కల్పించిందని ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర తెలిపారు. పాడేరు మండలం లింగాపుట్టు గ్రామానికి చెందిన మహిళా స్వయం సహాయక సంఘ సభ్యురాలు కంబిడి నిర్మలాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన శ్రీనిధి రుణం ద్వారా కిరాణా షాప్ పెట్టుకొని జీవనోపాధి పొందుతున్నానని, మా సంఘ సభ్యులకు కూడా బ్యాంకు లింకేజీ రుణం ఇప్పించానని, సూపర్ సిక్స్ పథకాల ద్వారా మాకు లబ్ధి చేకూరుస్తున్న ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు డిఆర్డిఏ శాఖ ద్వారా బ్యాంక్ లింకేజీ రుణాలను 317 సంఘాలలో 3410 మంది సభ్యులకు రూ.26, 28,00,000లను, శ్రీనిధి పథకం కింద 210 సంఘాలలో 692 మంది సభ్యులకు రూ.6,20,00,000 లను చెక్ రూపంలో స్వయం సహాయక సంఘ సభ్యులకు జిల్లా కలెక్టర్ నిషాంతి. టి, ప్రజా ప్రతినిధులు అందజేశారు. జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, జిల్లా ఇంచార్జ్ రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, పాడేరు ఆర్డిఓ భుజంగరావు, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలకంఠ రావు, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు, ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు, టూరిజం డైరెక్టర్ కిల్లో రమేష్, రాష్ట్ర బిజెపి ఎస్టీ మోర్చా నాయకులు పాంగి రాజారావు, బిజెపి జిల్లా మహిళా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, అరకు నియోజవర్గం జనసేన అధ్యక్షులు చిరంజీవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్ళి సుబ్బారావు, సింహాచలం దేవస్థానం బోర్డు మెంబర్ జ్ఞానేశ్వరి, పాడేరు మాజీ ఎంపీపీ బొర్రా విజయ రాణి, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ మంగతల్లి, జిల్లా అధికారులు, వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## స్మశాన వాటికను ఆహ్లాదంగా మారుద్దాం

### చేతిబోరు నిర్మాణానికి భూమి పూజ చేసిన చైర్మన్ డా. సియ్యారి దొన్ను దొర

అరకు రూరల్, జూన్ 18, ప్రభాతవార్త



అరకులోయలో హైవే నిర్మాణం జరిగినప్పుడు అరకు లోయ టౌన్షిప్ పరిధిలో ఉన్న స్మశాన వాటిక పూర్తిగా లేకుండా పోతుందనే భయాందోళన అందరిలో ఏర్పడిందని దీనిని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేశారని ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి డా.సియ్యారి దొన్ను దొర అన్నారు. అరకులోయ టౌన్షిప్ స్మశాన వాటికలో చేతి పంపు నిర్మాణానికి గురువారం ఆయన కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దొన్ను దొర మాట్లాడుతూ స్మశాన వాటిక రక్షణ కోసం ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానని తన పరిధిలో నిధులు ఉంటే ఐదు లక్షల కేటాయిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. దీంతోపాటు దహన సంస్కారాలు అయిపోయిన తర్వాత పార్థివ దేహాన్ని తీసుకొచ్చిన వారంతా స్నానం చేయడానికి బోరు ఎంత అవసరమో ఇక్కడకు వచ్చిన వారు ఉండేందుకు షెడ్ కూడా అంతే అవసరమని చెప్పారు. షెడ్డు నిర్మాణానికి ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి విరాళాలు సేకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. దీంతోపాటు స్మశాన వాటికలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసేందుకు చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమానికి ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం మొక్కలు ఇస్తే నాటే ప్రక్రియకు స్వస్థ పలికి మనమే స్వయంగా మొక్కలు కొని ఇక్కడ నాటి పెంచాలని అప్పుడే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు సియ్యారి అజయ్ దొర, మాజీ సూపర్ ఎంపీటీసీ కిలో కుమార్, టిడిపి కార్యకర్తలు పాడి చందు, వెంకట్రావు, వర్తక సంఘం నాయకులు, వర్తక సంఘం పెద్దలు కాపుగంటి కృష్ణారావు, కళింగపట్నం రమణ, శ్రీనివాసరాజు, కలియా సాహు, వెంకటరావు, గుప్త, రంగా, శ్రీను, శేఖర్, సంతోష్, నర్సింగ్, సత్తిబాబు, సురేష్ పాల్గొన్నారు.

## ఘనంగా ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవాలు : పాడేరులో పలు శాఖల స్టాల్స్ ప్రదర్శన

పాడేరు,జూన్18, ప్రభాతవార్త



ప్రభుత్వం రెండేళ్ల సుపరిపాలనను విజయ వంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలంలోని వి.ఆర్.ఫంక్షన్ హాల్ వద్ద గురువారం ఘనంగా విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవిజయోత్సవాల్లో భాగంగా ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సేవలపై అవగాహన కల్పించేందుకు పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ, రవాణా శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ వన్ దన్ కేంద్రాలు, గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏ అండ్ ట్రై కార్ పాడేరు, రైతు సాధికార సంస్థ స్టాల్స్ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా జిల్లా కలెక్టర్ టి.నిశాంతి జాయింట్ కలెక్టర్ తిరుమని శ్రీపూజలతో కలిసి పలువురు ప్రముఖులు,ప్రజా ప్రతినిధులు స్టాల్స్ను ప్రారంభించి, సందర్శించారు. స్టాల్స్లో ప్రదర్శించిన వివిధ అంశాలను, సాధించిన ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ రెండేళ్ల ప్రగతిని ప్రతి ఒక్కరికీ వివరించేలా ఈ స్టాళ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజల్లో ప్రభుత్వ పథకాల పట్ల మరింత అవగాహన పెంచేందుకు, ఆయా శాఖలు అందిస్తున్న సేవలను నేరుగా వివరించేందుకు ఈ ప్రదర్శన ఎంతగానో దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు. వివిధ శాఖల సమన్వయంతో జిల్లాను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. స్టాల్స్ ఏర్పాటు చేసిన శాఖలను అభినందనలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజాప్రతినిధులతో కలిసి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ లబ్ధిదారులకు ట్రాక్టర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ గంగులయ్య, ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్ను దొర, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో కర్కసత్వం... సమాజంలో మానవత్వం

### సాయిబాబా ఆలయంలో భారీ అన్నసంతర్పణ నిర్వహించిన ఏపీ ఎస్పీ పోలీసులు

కొయ్యూరు, జూన్ 18 ప్రభాతవార్త



విధి నిర్వహణలో భాగంగా తప్పని పరిస్థితులలో కర్కసత్వం ప్రదర్శించే పోలీసులు, తమకూ మానవత్వం ఉందని, అంతేగాక దానికి తోడు ఆధ్యాత్మికత కూడా ఉందని కొయ్యూరు ఏపీ ఎస్పీ పోలీసులు నిరూపించారు. మండలంలోని చీడిపాలెం పంచాయతీ, సింధవరం శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం ఏపీ ఎస్పిఆర్ఐ జి.దామోదర్రావు, ఆర్ఎస్ఐ ఎల్.వెంకట్రావు, మేజర్ మురళీధర్ ఆధ్వర్యంలో ఏపీఎస్పీ సిబ్బంది భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ అన్న సంతర్పణ కూడా ఏదో మొక్కుబడిగా కాకుండా చక్కని రుచికరమైన అన్న ప్రసాదంతో నిర్వహించడమే కాకుండా, దారిన వెళ్లే బాటసారులను, వాహనదారులను సైతం ఆపి మరి అన్న ప్రసాదం స్వీకరించమని ఏపీఎస్పీ పోలీసులు కోరడం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఏపీఎస్పీ పోలీసుల ఆధ్యాత్మికత, మానవత్వం, సేవా భావం ఉన్నాయని చెప్పకనే చెప్పినట్టు అయిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ అన్న సంతర్పణ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## విద్యా సామాగ్రి కిట్ల పంపిణీ



డుంబ్రిగుడ, జూన్ 18 ప్రభాతవార్త

మండలంలోని చంపాపట్టి ప్రాథమిక పాఠశాల లోని చిన్నారులకు వే మేకర్స్ ఫౌండేషన్ ఎల్- సిటాడెల్ ఆర్గనైజేషన్(షీబావెస్లీ) హైదరాబాద్ బృందం ప్రతినిధులు విద్యా సామాగ్రి కిట్లను పంపిణీ చేశారు. 50మంది చిన్నారులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు, స్టేషనరీ కిట్లు, ప్లేట్లు అందజేశారు. ఆ బృందం ప్రతినిధులు జాన్ విలింగ్టన్, యేసుదాసు, క్రిమ్సన్, ఉదయ్ పాఠశాల భవన దుస్థితిని చూసి నూతన పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామినిచ్చారు. వారి ఉదారత భావంపై గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన

డుంబ్రిగుడ, జూన్ 18 ప్రభాతవార్త



సాగర పంచాయతీ కేంద్రం లోని రైతు సేవా కేంద్రంలో భేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వాసుదేవరావు ఆధ్వర్యాన జరిగిన అవగాహన కార్యక్రమంలో పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఉమామహేష్ పాల్గొని రైతులకు సమతుల్య ఎరువుల వినియోగంపై, జీవన ఎరువులు, జీవ సంబంధిత క్రిమి సంహారకలపైన అవగాహన కల్పించారు. జీవ సంబంధిత క్రిమి సంహారక ఉత్పత్తుల ప్రదర్శనతో గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సంస్థ సిబ్బందితోపాటు వ్యవసాయ శాఖ సిబ్బంది గిరి రైతులు పాల్గొన్నారు.




## పాడేరులో 21న అఖిల పక్ష సమావేశం

పాడేరు,జూన్18, ప్రభాతవార్త



ఈ నెల 21వ తేదీ (ఆదివారం) అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నామని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మసాడా ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖి శేషాద్రి పేర్కొన్నారు. పాడేరు గిరిజన ఉద్యోగుల సంఘ్ భవనంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం గురువారం సాయంత్రం జిల్లా స్థాయి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈశ్వరరావు,శేషాద్రి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల భూమి హక్కులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టాన్ని' రద్దు చేయాలని కొందరు గిరిజనేతరులు సుప్రీంకోర్టులో సుమారు 1700 పైచిలుకు కేసులు వేయడాన్ని యావత్ ఆదివాసీ సమాజం పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు ప్రకటించారు. గిరిజనుల మనుగడను దెబ్బతీసే ఇలాంటి కుట్రలను సమష్టిగా తిప్పికొడతామని హెచ్చరించారు. 1/70 చట్టం రక్షణ కోసం మరియు భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించడం కోసం ఆదివారం) ఉదయం 10:00 గంటలకు ఉద్యోగుల భవనం వద్ద భారీ 'అఖిలపక్ష సమావేశం' ఏర్పాటు చేసినట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఈ అత్యవసర సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, నిరుద్యోగ సంఘాల నాయకులు, అలాగే ఆదివాసీ మేధావులు అందరూ బాధ్యతగా విచ్చేసి విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మినుముల ప్రసాదరావు, జేఏసీ కన్వీనర్ రామారావు దొర, సెక్రెటరీ సిహెచ్. యువరాజు, కోశాధికారి వి.కొండలరావు, జాయింట్ సెక్రెటరీ కూడా ఈశ్వరరావు, సిపిఎస్, జిల్లా అధ్యక్షులు మోరీ మోహన్రావు, సలహాదారులు మర్రి చిన్నయ్య, సెక్రెటరీ వి.సన్యాసిరావు, ఉపాధ్యక్షులు మసాడ శ్రీను, మహేష్ పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్ జోలికి పోవద్దు.. భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

### చౌడుపల్లి గ్రామంలో గిరిజనులకు మంప ఎస్సై ఎస్. శ్రీనివాస్ అవగాహన

కొయ్యూరు జూన్ 18 ప్రభాతవార్త



గిరిజన యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాటక ద్రవ్యాలకు దూరంగా ఉండి భవిష్యత్తును బంగారు బాటలో నడిపించుకోవాలని మంప ఎస్సై ఎస్.శ్రీనివాస్ కోరారు. గురువారం కొయ్యూరు మండలంలోని చౌడుపల్లి గ్రామంలో మంప ఎస్సై ఎస్.శ్రీనివాస్ పర్యటించారు. "నషా ముక్త్ భారత్" కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి సాగు, రవాణా తదితర అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. సులభంగా డబ్బు వస్తుందనే ఆశతో గంజాయి రవాణాలో పాల్గొని జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి, డ్రగ్స్ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కుటుంబాలు నాశనం అవుతాయన్నారు.పలువురు గిరిజనులు గిరిజన యువత పాల్గొన్నారు.

## వారపు సంతలో సైబర్ నేరాలు, గంజాయి దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు



గూడెం కొత్త వీధి జూన్ 18 (ప్రభాతవార్త

జీకే వీధి సంతలో ప్రజలకు వివిధ సామాజిక అంశాలు, నేరాలపై అవగాహన కల్పించేందుకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబర్ సెల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సులో ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రజలను చైతన్య పరిచారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వీటికి సంబంధించి నాలుగు కేసులు కూడా నమోదయ్యాయని తెలిపారు. ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ సందర్భంగా వివరించారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటిపిలను పంచుకోవద్దని సూచించారు. ముఖ్యంగా గంజాయి వాడకం వల్ల యువత జీవితాలు ఎలా నాశనమవుతున్నాయో వివరించారు. గంజాయి మహమ్మారి నిర్మూలనలో ప్రజల పాత్ర కీలకమని, సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. అలాగే మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, వేధింపులను అరికట్టడంపై ప్రత్యేకంగా దృష్టి సారించమని, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలు, రక్షణ యాప్ల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను, ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, హెల్మెట్ ధరించడం ప్రాణ రక్షణకు అవసరమని స్పష్టం చేశారు.

## సుండ్రుపుట్టు సచివాలయ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సార్) ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,జూన్18, ప్రభాతవార్త

పాడేరు మండలం సుండ్రు పుట్టు సచివాలయ పరిధిలో ఓటర్ల సవరణ జాబితా డోర్ టు డోర్ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ టి.నిశాంతి రాష్ట్రంలో ఓటర్ల జాబితా పారదర్శకత, ఖచ్చితత్వాన్ని పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన "ప్రత్యేక ముమ్మర సవరణ" (సార్) కార్యక్రమం చురుగ్గా సాగుతోందని, సుండ్రు పుట్టు సచివాల పరిధిలో ఆకస్మిక తనిఖీలు కలెక్టర్ నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం జిల్లా కలెక్టర్, మండల తహసిల్దార్, ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను స్వయంగా పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల తనిఖీ, క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా అధికారులు "ఎన్యూమరేషన్ ఫారాలను" వాటిలోని ఓటర్ల వివరాలను, అనుసంధానించిన ఛాయా చిత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.లక్ష్యాల సమీక్ష పై సవరణ ప్రక్రియ పురోగతిని తెలుసుకునేందుకు, ఒక ప్రాంతానికి కేటాయించిన మొత్తం 872 ఓటర్ల నమోదు ప్రక్రియపై మరియు రోజువారీగా జరుగుతున్న పని పురోగతిపై క్షేత్రస్థాయి సిబ్బందిని,అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఓటర్ల నమోదును పారదర్శకతకు ప్రాధాన్యత బట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాకుండా, జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉండేందుకు ఈ ముమ్మర తనిఖీలు దోహదపడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో డిపిఓ కెపి చంద్ర శేఖరరావు, పాడేరు మండల్ తాసిల్దార్ శ్రీనివాసరావు, బిఎల్ఓస్, సచివాల సిబ్బంది ఎన్నికల విభాగపు ఉన్నతాధికారులు, స్థానిక రెవిన్యూ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



## నేడు మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌చే శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు

ఎలమంచిలి, జూన్ 18, ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులోని రామారావుపాలెం ఎడ్ల గెడ్డ వద్ద సుమారు 40 లక్షలు వివిఎంఆర్డిఏ నిధులతో నిర్మించిన వంతెనకు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌చే ప్రారంభోత్సవం చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, వివిఎంఆర్‌డిఏ చైర్మన్ మానం వెంకట ప్రణవ్ గోపాల్, తేజ్ భరత్ పాల్గొంటున్నారని తెలిపారు. ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ సమీపంలో సుమారు 7.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే సుందర్ విజయకుమార్ చే నిర్వహించబడునని అధికారులు తెలిపారు.

## నేడు పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

కసింకోట, జూన్ న్ 18, ప్రభాతవార్త

మండలంలోని నేడు పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ పి మురళీకృష్ణ తెలిపారు. 33/11 కె.వి నరసింగబిలి సబ్స్టేషన్‌లో 11 కె.వి నర్సింగబిల్లి ఫీడర్ మరియు 11 కె.వి తాళ్లపాలెం ఈజీఎల్ ఫీడర్ పరిదిలో చెట్టుకొమ్మలు తొలగించుట, మెయింటెనెన్స్ పనులు కారణంగా నరసింగబెల్లి, గొబ్బూరు, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. 19న ఉదయం 9 గంటల మధ్యాహ్నం 2 గంటల వరకు 24 గంటలు వ్యవసాయ విద్యుత్ సరాఫరా నిలిపివేయడం జరుగుతుందనీ తెలిపారు. కావున వినియోగదారులు అందరూ సహరించాలని మురళి కృష్ణ విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం



కసింకోట, జూన్ 18, ప్రభాతవార్త

మండలంలోని బ్రాహ్మణపాలెం ఎంపీపీ పాఠశాలలో గురువారం అక్షరభ్యాసం జరిపారు. అలాగే పాఠశాలలో విద్యార్థులం దరికీ నోట్ బుక్స్, పలకలు, పెన్నులు ఎం.కొండల రావు ఉచితంగా 5000 ఖర్చుచేసి విద్యార్థులకు అందజేసారు. తల్లిదండ్రులందరు ధన్యవాదాలు తెలిపారు.

## ఇంటర్మీడియట్ సప్లమెంటరీ ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

నక్కపల్లి, ప్రభాతవార్త



ఇంటర్మీడియట్ సప్లమెంటరీ ఫలితాల్లో ప్రభుత్వం జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 162 మంది హాజరు కాగా 157 మంది ఉత్తీర్ణత సాధించారని, మొదటి సంవత్సరం 153 మందికి పరీక్షలు రాయిగా 148 ఉత్తీర్ణత సాధించారు. 97% మొదటి ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో సాధించడం జరిగిందని ప్రిన్సిపాల్ కే. శ్రీదేవి తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరం ఫలితాలను జ్యోతి ప్రకాష్ 462 /470 మార్కులు సాధించగా తేజస్విని బైపీసీలో 445, కే.మహాలక్ష్మి 484/500( హెచ్ఈసి) అత్యధిక మార్కులు సాధించాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి వారిని అభినందించారు.

## 'సర్'పై మూర్తి యాదవ్ ఆరోపణలు అబద్ధం

### విశాఖ తూర్పు 22వ వార్డు ఓట్ల తొలగింపుపై అసత్య ఆరోపణలు - టీడీపీ పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ బొట్టా వెంకట రమణ ఖండన

విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త



విశాఖ తూర్పు నియోజక వర్గం 22వ వార్డు కూటమి నాయకులు పితల మూర్తి యాదవ్ సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ )పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరం అని టీడీపీ పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ బొట్టా వెంకట రమణ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో కలిసి ఉంటూ విశాఖ తూర్పు నియోజ కవర్గంలో ఓట్ల చోరీ జరుగుతోందని, "మా యొక్క ఇంట్లో అనగా రక్త సంబంధీకులు ఓట్లు తొలగించారని" మంగళవారం జిల్లా కలెక్టర్‌కి పితల మూర్తి యాదవ్ ఫిర్యాదు చేయడం విచారకరమన్నారు. బూత్ నెంబర్ 225, సీరియల్ నెంబర్ 90 నుండి 97 వరకు వారి కుటుంబ సభ్యుల ఓట్లు యథావిధిగా ఉన్నాయని తెలియజేస్తున్నాము. ప్రస్తుతం ఓట్ల తొలగింపు కార్యక్రమం జరగడం లేదని,ఓట్ల మ్యాపింగ్ మాత్రమే అధికారులు పరిశీలిస్తున్నారన్నారు. "ఇలాంటి ఆరోపణలు చేయడం తగదు. ప్రజలను పక్కదారి పట్టించడం భావ్యమా? విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం తెలుగుదేశం పెద్దలు ఓట్లు తొలగింపు చేశారన్న ఆరోపణలు పూర్తిగా అసత్య ప్రచారం. చిటికి మటికి అసత్య ప్రచారాలకు మూర్తి. యాదవ్ స్పష్టి పలకాలని వెంకట రమణ కోరారు. మీ ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది. వైసీపీ వాళ్లకు ఇన్‌డైరెక్ట్‌గా పత్తాసు పలికే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు .ఇప్పటికైనా సర్ పై అవగాహన. పెంచుకుని మాట్లాడాలని కోరారు.

## విశాఖలో సీ క్యాడెట్ కార్ప్స్-2026 ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త :

భారత ప్రభుత్వ రక్షణ విభాగం ఆధ్వర్యంలోని సీ క్యాడెట్ కార్ప్స్ (ఎస్‌సీసీ), విశాఖపట్నం యూనిట్‌లో 2026 బ్యాచ్ ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. 10 నుంచి 12 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన బాలురు, బాలికలు ఈ ప్రవేశాలకు అర్హులు. 2014 ఆగస్టు 1 నుంచి 2016 జూలై 31 మధ్య జన్మించి, ప్రస్తుతం 5వ, 6వ లేదా 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫారాలు జూన్ 20, 2026న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఐఎన్ఎస్ సర్కార్స్ కమాండ్ స్విమ్మింగ్ పూల్‌లో అందుబాటులో ఉంటాయి. ఫారాలు తీసుకునే సమయంలో స్టడీ సర్టిఫికేట్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ధృవీకరించిన ప్రతులను సమర్పించాల్సి ఉంటుంది. పూర్తిగా నింపిన దరఖాస్తులను జూన్ 28న అదే ప్రదేశంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమర్పించాలి. అభ్యర్థుల ఎంపిక కోసం జూలై 5, 2026న లిఖిత పరీక్ష, శారీరక పరీక్ష, మౌఖిక పరీక్ష నిర్వహించనున్నారు. ఎంపిక ప్రక్రియకు హాజరయ్యే విద్యార్థులు పాఠశాల యూనిఫామ్‌లో తల్లిదండ్రుల్లో ఒకరితో కలిసి రావాల్సి ఉంటుంది. ఎంపికైన వారికి ఆగస్టు 1లోపు కాల్ లెటర్లు పంపించనుండగా, శిక్షణ ఆగస్టు 2 నుంచి ప్రారంభమవుతుంది. సీ క్యాడెట్ కార్ప్స్‌లో స్క్వాడ్ డ్రిల్, రైఫిల్ డ్రిల్, షూటింగ్, స్విమ్మింగ్, బోట్ పుల్లింగ్, బ్యాండ్ డ్రిల్, సెమాఫోర్, రిగ్గింగ్ తదితర అంశాల్లో శిక్షణ అందిస్తారు. ప్రతి ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందడంతో పాటు సాయుధ దళాలపై అవగాహన కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## కేంద్ర కారాగారంలో పశువుల బహిరంగ వేలం

ఆరిలోవ, జూన్ 18, ప్రభాతవార్త

విశాఖ కేంద్ర కారాగార డైరీ యూనిట్‌లోని 22 పశువులకు ఈ నెల 24న (బుధవారం) సాయంత్రం 4 గంటలకు జైలు పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నారు. కారాగార పర్యవేక్షణాధికారి ఎమ్. మహేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. వేలంలో పాల్గొనేవారు రూ. 2,500 డిపాజిట్ చేయాలని, వేలం దక్కించుకున్న వారు పూర్తి సొమ్మును ఒకేసారి చెల్లించాలని, లేనిచో వేలం రద్దయి, డిపాజిట్ సొమ్ము ప్రభుత్వ ఖజానాకు చేరుతుందని, కోస్తా ఆంధ్ర ప్రాంత జైళ్ల ఉప శాఖాధికారి రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఈ వేలం జరుగుతుందన్నారు. వేలాన్ని ఆమోదించే లేదా నిరాకరించే పూర్తి అధికారం ఆయనకే ఉంటుందని పేర్కొన్నారు.



## మహిళ అదృశ్యం

ఆరిలోవ, జూన్18, ప్రభాతవార్త

గాజువాక ఉడా కాలనీకి చెందిన చప్పరాల ఉషారాణి(56) మానసిక ఇబ్బందులు కారణంగా అనారోగ్యంతో ఉండడంతో కొంతకాలం క్రితం మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతుంది. అనంతరం ఆమె ఆరోగ్యం కొంచెం కుదుటపడటంతో ఆరిలోవ ఓల్డ్ డైరీఫామ్ లో గల మన కుటుంబం ఓల్డ్ ఏజ్ హోమ్ లో జాయిన్ అయినట్లు ఆరిలోవ పోలీసులు తెలిపారు. కొన్ని రోజుల క్రితం వినాయకుడి ఊరేగింపు జరుగుతుండగా ఊరేగింపులో కలిసిపోయి వెళ్ళిపోయినట్లు అప్పటినుండి ఆమె ఆచూకీ తెలియలేదు అన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిసినట్లయితే ఆరిలోవ పోలీస్ స్టేషన్కు ఫోన్ నెంబర్లు 9490617918, 8328555549 లకు సంప్రదించాలని సీఐ ఉమామహేశ్వరరావు కోరారు. ఆరిలోవ సీఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీటీసీ కొంచెం మధు అన్నారు. మండలంలోని వేంపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు వరలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏడిద నూకరత్నం, చైర్మన్ బాబురావు, టిడిపి నాయకులు కల్లేపల్లి వెంకటపతి రాజు, పల్లా రాంబాబు, కల్లూరు ఉపాధ్యాయులు ఉన్నారు.

## అల్లూరి జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)గా వై.శృతి నియామకం

పాడేరు,జూన్18, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లో అదనపు ఎస్పీల బదిలీలు నిర్వహిస్తూ.. కొత్త పోస్టింగ్ లను గురువారం ప్రకటించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు ఎస్పీగా బదిలీపై వెళ్లిన ధీరజ్ స్థానంలో కొత్తగా అల్లూరి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా వై.శృతి 8ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అల్లూరి జిల్లా అదనపు ఎస్పీతో పాటు మరో 15 మందిని రాష్ట్ర వ్యాప్తంగా కొత్త వారికి పోస్టింగులు ఇచ్చింది. అల్లూరి జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)గా వై.శృతి త్వరలో బాధ్యతలు చేపట్ట నున్నారు.

## 90 శాతం రాయితీపై వరి విత్తనాల పంపిణీ

గూడెం కొత్త వీధి, జూన్ 18, ప్రభాతవార్త



దారకొండ మరియు దుప్పులవాడ పంచాయ తీలలో రైతులకు 90 శాతం రాయితీపై వరి విత్తనాల పంపిణీ కార్యక్ర మం ఘనంగా జరిగింది. దార కొండలో జరిగిన ఈ కార్యక్ర మంలో ఎంపీటీసీ రమణ, మాజీ సర్పంచ్ నడిగొట్ల రాజు, కూటమి నాయకులు పోతురాజు, కృష్ణ, శోభ, జగన్, గ్రామ వ్యవసాయ సహాయకుడు పవన్, స్థానిక రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా దుప్పులవాడ పంచాయతీలో జరిగిన విత్తన పంపిణీ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమారి, కూటమి నాయకులు మన్మధరావు, రాము, సుందర్ రావు, టోక్కు బాబు, పీసా కమిటీ నాయకులు సుమన్, భానుచందర్, వ్యవసాయ శాఖ సిబ్బంది శేఖర్, గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు మాట్లాడుతూ రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలు అందిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రకాలైన ఎంటియు-10548, ఎన్ఎల్ఆర్-3449, ఎంటియు-1121, ఎంటియు-1224, బిపిటి-5204 వంటి అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన వరి విత్తనాలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన

నక్కపల్లి రూరల్ /అడ్డు రోడ్డు



మండలంలోని దేవవరం జడ్పీ హైస్కూల్లో యోగాంధ్ర కార్యక్ర మంలో భాగంగా ఉత్సాహం బాల, బాలికలకు యోగ విద్యలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్ఎం వేమగిరి నూకరాజు, పీఈటీ దుంగా నాగరాజు ఆధ్వర్యంలో పిల్లలకు యోగాసనాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారు. గురువారం ప్రత్యేక శిక్షణ పొందిన బాల, బాలికలు చేసిన యోగాసన విన్యాసాలు విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా హెచ్ఎం వేమగిరి నూకరాజు మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు, జ్ఞా పకశక్తి పెరుగుతుందని, రోగాలు సోకకుండా జాగ్రత్తపడవచ్చునని చెప్పారు.

## అమర్నాథ్‌పై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

నక్కపల్లి, జూన్ 18, ప్రభాతవార్త



రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని పాయ కరావుపేట నియోజకవర్గ టిడిపి మహిళలు నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సంద ర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ, హోం మంత్రిపై గుడివాడ అమర్నాథ్ వ్యక్తిగత విమర్శలు చేయడంతో పాటు అసభ్యకరమైన పదజాలంతో వ్యాఖ్యానించారని మండిపడ్డారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న మహిళా ప్రజాప్రతినిధిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడిన గుడివాడ అమర్నాథ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు తమ ఫిర్యాదులో కోరారు. కార్యక్రమంలో మల్లపురెడ్డి రమా కుమారి, ఎస్.రాయవరం ఎంపీపీ వెంకటలక్ష్మి, మున్నిషాబేగం, కొమ్మిరెడ్డి నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, గుడబంటి శాంతమ్మ, దుబాసి జ్యోతి. జనసేన నాయకులు పద్మ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాపై డ్వాక్రా మహిళలకు అవగాహన

నక్కపల్లి రూరల్ /అడ్డు రోడ్డు, ప్రభాతవార్త

మండలంలోని వెలుగు కార్యాలయం నందు "మానవ అక్రమ రవాణా",కి సంబంధిం చి ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం సీనియర్ కో-ఆర్డినేటర్ శ్రావ్య శృతి వెలుగు వివోఏలకు అవ గాహన కార్యక్రమం ఏపీఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సమాజంలో చాలా మంది చిన్న పిల్లలను అపహరించి బిక్షాటన కొరకు ఉపయోగించి సంపాదన కొరకు వినియోగించడం జరుగుతుందని, పేద కుటుంబాలకు చెందిన ఆడ పిల్లలకు సినిమాలలో అవకాశాలు, లేక ఉద్యోగం కల్పిస్తానని వెట్టి చాకిరి చేయిస్తున్నారు అలాంటి వారిని గుర్తించి మా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థకు సమాచారం అందజేస్తే పోలీస్ వారి సహకారంతో వారిని మా స్వచ్ఛంద సంస్థ ద్వారా వసతి కల్పించి, వారికి కౌన్సిలింగ్ చేసి తల్లి తండ్రులకు అప్పచెప్పడం జరుగుతుందని చెప్పారు. ఇదే కాకుండా మానవ అక్రమ రవాణా అడ్డుకట్టు వేయాల్సిన అవసరం ఉందని, ఆడపిల్లల కి మత్తు ఇంజక్షన్లులు ఇచ్చి బ్రోతల వారికి అమ్మి వ్యభిచారం లో దింపే ముఠాలు కూడా ఉన్నాయి వాటిపై దృష్టి పెట్టాలని దానికి సంబంధించిన మెలకువలను తెలియజేశారు. ఈ అంశాలు పైన డ్వాక్రా మహిళలు అందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ లావణ్య, మండల సమాఖ్య అధ్యక్షులు అనంత లక్ష్మి , కార్యదర్శి తేజా తదితరులు ఉన్నారు.




## రెండేళ్ల పాలనపై భీమిలిలో టిడిపి నిర్వహించిన ప్రజా నమ్మకం సభ



విశాఖపట్నం, జూన్ 18, ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన" పేరుతో నిర్వహించిన ప్రజా నమ్మకం సభ భీమిలి నియోజకవర్గంలో ఘనంగా జరిగింది. భీమిలి నియోజకవర్గ మాజీ మంత్రి, శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 8వ వార్డు ఋషికొండ బీచ్ రోడ్డులోని ఏ-1 గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ సభకు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గరే గురునాథ్, రాష్ట్ర కార్యదర్శి, 6వ వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి మన్యెల సోంబాబు, యూనిట్ బూత్ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు కుప్పాక రామకృష్ణ, పోతిన నాయుడు, పెంటకోట బబ్బెలు, కొరగంజి సూరిబాబు, మామిడి రమణ, పోలిశెట్టి నాగేశ్వరరావు, వరుపుల రమేష్, పోతిన రమణ, గురువుల నారాయణరావు, రియాజ్, గొర్రెల రామకృష్ణ, మేకల కృష్ణ, కొల్లి బాబ్జి, షేక్ సుభానీ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాయని నాయకులు పేర్కొన్నారు. సభలో పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు విస్తృతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పూలగవానిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాఖపట్నం, జూన్ 18,ప్రభాతవార్త

పూలగవానిపాలెం సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ ప్రశాంతినగర్ ఫీడర్‌పై మరమ్మత్తు పనులు చేపట్టనున్న నేపథ్యంలో జూన్ 19 (శుక్రవారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచే ప్రాంతాలు: ప్రశాంతినగర్, బాలాజీ నగర్, శ్రీప్రకాశ్ స్కూల్ ఏరియా, గ్రీన్ గార్డెన్, సూర్యనగర్, పాలిటెక్నిక్ కాలేజ్ పరిసరాలు, మహాలక్ష్మీ నగర్, బీసీ కాలనీ, వీరభద్ర నగర్, సాయి దివ్య లేఅవుట్, ఎంఎస్ రామయ్య బ్లాక్స్ తదితర ప్రాంతాలు. విద్యుత్ అంతరాయాన్ని ప్రజలు గమనించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ వివరాలను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్), జోన్-3, విశాఖపట్నం బి. సింహాచలం నాయుడు వెల్లడించారు.

## పేటలో అనధికార మద్యం బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు

### గోపాలపట్నానికి చెందిన వ్యక్తి అరెస్ట్ -10 అక్రమ మద్యం సీసాలు స్వాధీనం

పాయకరావుపేట, జూన్ 18, ప్రభాతవార్త

మండలంలో అనధికార మద్యం బెల్ట్ షాపులపై స్థానిక ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారులు ఆకస్మికంగా బెల్ట్ తీశారు. మండలంలోని కొన్ని గ్రామాలలో అనధికార వైన్ బెల్ట్ షాపులు నడుస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్ తమ సిబ్బందితో కలిసి గురువారం అనధికార బెల్ట్ షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులలో మండలంలోని గోపాలపట్నానికి చెందిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఆ సమయానికి అతని వద్ద ఉన్న 10 అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసు తెలిపారు. ఈ దాడులలో తనతో పాటు స్థానిక ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ బి.రమణ, కానిస్టేబుల్‌లు డి.నాగశంకర్రావు, ఆర్.జగన్నాథ్, ఎన్.దుర్గాప్రసాద్ సహా సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

### అక్రమ నాటు సారా కేసులో మరో ముగ్గురు పాత నేరస్తులు రిమాండ్‌కు తరలింపు..

2022, 2023 సంవత్సరంలో మండలంలో అక్రమ నాటు సారా కేసులతో సంబంధం ఉన్న మరో ముగ్గురి నిందితులను ఈరోజు అదుపులోకి తీసుకుని అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్ కోర్ట్ (ఏజేఎఫ్ సీఎం)లో హాజరు పరిచినట్లు స్థానిక ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు.

వార్త VAARTHA CLASSIFIEDS

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, SANJEEV ABHISHEK S/o OM PRAKASH DAS, R/o 63-3-45/18, Flat No. 403, A S TOWERS, Jawahar Nagar, A V K School, Sriharipuram, Visakhapatnam (Urban), PO:Malkapuram, DIST: Visakhapatnam, Andhra Pradesh - 530011, have changed my name and shall hereafter be known as S ABHISHEK. (Ro.No. 10953)

★ I, BOYA VENKATESULU S/o BOYA KRISTAPPA, R/o 2/797, Maruthi Nagar, Somandepalle, Anantapur, Andhra Pradesh - 515122, have changed the name of my minor son B.RAM CHARAN, aged 16 years and he shall hereafter be known as BOYA RAM CHARAN. (Ro.No. 10952)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591), విశాఖపట్నం
మెలొడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాభాగ్, విశాఖపట్నం-530020.
ఫోన్: 8332956773, 7095199455. ఇ-మెయిల్: cb13591@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.
కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నం వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది.09.07.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం: 09.07.2026, మ॥ 01.00 గం.ల నుండి మ॥ 02.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 08.07.2026, సాయంత్రం 6.00 గం.ల లోపు

| క్ర. నెం. | ఋణగ్రహీత / హామీదారులు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నంకు బదిలీ చేయడమైనది) | తనఖాలో ఉన్న ఆస్తి వివరములు | రిజర్వు ధర (రూ.) | ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%) |
|---|---|---|---|---|
| 1 | ఋణగ్రహీత: శ్రీ ప్రసన్న సాయి రఘు వీర్ కందుల, తండ్రి: కందుల గోపాల కృష్ణ. తేది.31.05.2026 నాటికి బకాయి మొత్తం: రూ.33.71 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | విశాఖపట్నం, జీవియంసి పరిధి మరియు మధురవాడ యస్ఆర్ఓ, బక్కన్నపాలెం గ్రామం, సర్వేనెం. 77/3, 4, 5, 78/3A, 3B, 3C, 4, 5, 6, 7A, 9, 12, 80/1A, 1B, 2A, 2B, 3B, 5A, 5B, 81/6, 8, 9, 10, 11, 12, 13, ఉడా ఆమోదించిన యల్.పి.నెం. 23/91 ద్వారా ప్లాట్ నెం. 179 లో మొత్తం 400 చ॥గ॥ లేదా 334.45 చ॥మీ॥ల నందు అవిభాజ్యపు మరియు అనిర్దేశపు వాటా 46 చ॥గ॥ లేదా 38.456 చ॥మీ॥ విస్తీర్ణంతో "శ్రీ సంపత్ వినాయక డిలైట్" గ్రౌండ్ ఫ్లోర్‌లో 1380 చ॥అ॥ల (ఉమ్మడి ఏరియా మరియు బాల్కనీలు కలుపుకొని) విస్తీర్ణంలోని ఫ్లాట్ నెం.1 మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లో 80 చ॥అ॥ల ఒక కారు పార్కింగ్‌తో కలదు. (హెచ్‌పిసియల్ లేఅవుట్, డోర్ నెం. 8-3 దగ్గర). హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 42.95 లక్షలు | రూ. 4.30 లక్షలు |

ఆస్తి తనిఖీ తేది & సమయం : 02.07.2026, ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 83329 56773, 70951 99455

రిజర్వు ధరలో 10% సొమ్మును ధరావత్తుగా ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా https://baanknet.com లోని E-వాలెట్‌కు బిడ్డర్ లాగిన్ అయి తేది.08.07.2026, సా॥ 6:00 గం.ల లోపుగా చెల్లించవలెను. * బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది.
బిడ్డర్లు తమ ఆఫర్‌లను రిజర్వు ధర 25 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet). వెబ్‌పోర్టల్ https://baanknet.com, హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది.16.06.2026, ప్రదేశం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

## సుందరరావు కుటుంబానికి అండగా లైన్స్ గ్రూప్



కవిటి, జూన్ 18 ప్రభాతవార్త : ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన సుందర్రావు కుటుంబానికి అండగా నిలిచింది లైన్స్ గ్రూప్. మండలం బి.గొనపుట్టుగా గ్రామానికి చెందిన సుందర్రావు గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. కుటుంబాన్ని పోషిస్తున్న సుందర్రావు మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. సుందరరావుకు భార్య ఇద్దరు పిల్లలతో పాటు వృద్ధులైన తల్లిదండ్రులు మరియు భర్త కోల్పోయిన అక్క చెల్లెలు కుమారులతోపాటు ఆ ఇంటిలోనే నివాసముంటుంది. పరిస్థితి తెలుసుకున్న సాలినపుట్టుగ గ్రామానికి చెందిన లైన్స్ గ్రూప్ 7,500 ఆర్థిక సహకారం అందించి తమ ఉదారతను చాటింది.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు చేపట్టాలి

ఆమదాలవలస, జూన్ 18 (ప్రభాతవార్త)



ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. గురువారం అమరావతిలో వెలగపూడిలో అసెంబ్లీ కమిటీ హాల్‌లో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు, ఆర్థిక వ్యవహారాలపై కమిటీ సమీక్ష నిర్వహించింది. ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధి, పారదర్శకతకు సంబంధించిన అంశాలపై క్షుణ్ణంగా చర్చలు జరిపారు. ఏపీ స్టేట్ సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ కార్యకలాపాలను అధికారులు పియుసి కమిటీకి వివరించారు. సెరికల్చరిస్ట్స్ అండ్ సిల్క్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ పనితీరును చైర్మన్ రవికుమార్ సమీక్షించారు. ఏపీ స్టేట్ కోఆపరేటివ్ జాయింట్ ఫార్మింగ్ అండ్ లేబర్ కాంట్రాక్ట్ సొసైటీస్ ఫెడరేషన్ అంశాలను, లావాదేవీలను పియుసి కమిటీ పరిశీలించారు. రైతు సాధికార సంస్థ, చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులకు అడిగి చైర్మన్ రవికుమార్ తెలుసుకున్నారు. ఈ కమిటీ సమావేశంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన, ఎమ్మెల్సీ భూమి రామ్ గోపాల్ రెడ్డి, వివిధ సంస్థల అధికారులు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణ



ఇచ్ఛాపురం, జూన్ 18 ప్రభాతవార్త: ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా బి.కృష్ణ పదవీ భాధ్యతలను స్వీకరించారు. మర్రిపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ లెక్చరర్‌గా పని చేసారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై వచ్చారు. కళాశాల సర్వతోముఖాభివృద్ధికి నూతన అడ్మిషన్లు పెంచేందుకు, విదార్థుల భవిష్యత్తును బంగారుమయం చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కళాశాల సిబ్బంది అధ్యాపకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మలేరియా వ్యాధులు నివారణపై అవగాహన



సీతంపేట, జూన్ 18 ప్రభాతవార్త మలేరియా డెంగ్యూ వ్యాధులు నివారణపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన రావు తెలిపారు. గురువారం సీతంపేట గ్రామం లో మా ఊరికి మలేరియా వచ్చింది కార్యక్ర మం నిర్వహించారు. శానిటేషన్, క్లోరినేషన్, పూడిక తీత, క్లీనింగ్ వంటి పారిశుధ్య కార్యక్ర మాలు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. సీజనల్‌గా వచ్చే మలేరియా డెంగీ గురించి అవగాహన ర్యాలీ గ్రామంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఐఇసి అందజేసి కీటకాలు కుట్టకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. గేడ్డలో లార్వ వేటాడి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల



ఇచ్ఛాపురం, జూన్ 18 ప్రభాతవార్త: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలలో స్వర్ణ భారతి జూనియర్ కళాశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో పోతల మోక్ష 467, వలపల దీపిక 462, బైపిసి విభాగంలో అల్లాడ గాయత్రి 449 మార్కులు సాధించారు. 40 మందికి పైగా 400 మార్కులు పైబడి సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఇసురు గీత 990, దుర్గాసి దీపిక 985, ధూపాన దేవి 982 మార్కులు సాధించారు. 900 మార్కులు పైబడి 30 మంది విద్యార్థులు సాధించారు. విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని కలలు సాకారం చేసుకోవాలని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మరియు అధ్యాపక సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ చాట్ల రాము, కళాశాల ప్రిన్సిపాల్స్ జల్లు జయప్రకాష్, కె.సందీప్, కె.వి శ్రీనివాస్ మరియు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## కర్తలి గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమం



కంచిలి, జూన్ 18 ప్రభాతవార్త కంచిలి మండలం కొల్లూరు పంచాయతీలో కర్తలి గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమం 4వ రోజు మ్యాపింగ్ చేపట్టి ఓటర్ వెరిఫికేషన్ జరిగింది. ఎసఐఆర్ కార్యక్రమం ఎంత విలువ అయినదో అందరికి వివరిస్తూ ఓటు పోకుండా చూసేలా రమేష్ రెడ్డి సలహాలు, సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపి కంచిలి మండలం అధ్యక్షులు వాసాల రమేష్ రెడ్డి, బిఎలఓ వెంకట్రావు, బిఎలఏలు పాల్గొన్నారు.

## ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణకు జిల్లా వీఆర్వో సంఘం పూర్తి మద్దతు



శ్రీకాకుళం, జూన్ 18 ప్రభాతవార్త ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు మరియు ఉద్యమ కార్యాచరణ కమిటీ ఆదేశాల మేరకు, శ్రీకాకుళం జిల్లా వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి శ్రీకాకుళం జిల్లా శాఖ చైర్మన్ బి.వి.వి.యెన్. రాజుని, ముఖ్య అతిథిగా ఆహ్వానించి, సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షులు డి.రాజేష్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం, ఏపీ జేఏసీ అమరావతి చేపట్టనున్న ఉద్యమ కార్యక్రమాలకు, శ్రీకాకుళం జిల్లా వీఆర్వో సంఘం, పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తుందని ప్రకటించారు. జిల్లాలోని వీఆర్వోలు అందరూ, ఏపీ జేఏసీ అమరావతి పిలుపునకు స్పందించి, ఉద్యమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి, శ్రీకాకుళం జిల్లా శాఖ చైర్మన్ బి.వి.వి.యెన్. రాజు, వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షులు డి.రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు

కవిటి, జూన్ 18 ప్రభాతవార్త



పంచాయతీ అభివృద్ధికి పక్కాగా ప్రణాళికలు వేసి అభివృద్ధికి పంచాయతీ అభివృద్ధి అధికారులు సహకరించాలంటూ ఎంపీడీవో ఎల్ త్రినాథ్ పిలుపు నిచ్చారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ప్రత్యేక సమావేశం నిర్వహించి పంచాయతీ అభివృద్ధి అధికారులకు సూచనలు సలహాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వై.వరప్రసాద్ ఏవో శ్రీనివాస్ రెడ్డి, ఎన్జీవో వై.వి.సుబ్బారెడ్డి, అసిస్టెంట్ శ్రీధర్‌లతోపాటు మనోజ్, జీవన్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ తమ ఓటును కాపాడుకోవాలి

కోటబొమ్మాళి, జూన్ 18 ప్రభాతవార్త:



ప్రతి ఒక్కరూ వారి ఓట్లను కాపాడుకోవాల్సిన అవసరం అందని జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. ఆయన బుధవారం రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు మండల టిడిపి అధ్యక్షుడు బోయిన సత్యశ్రీనివాస్‌తో కలిసి కోటబొమ్మాళి మేజరు పంచాయతీలో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ వెరిఫికేషన్ ఫారాలు తీసుకొని వాటిపై పాస్‌పోర్టు సైజు ఫోటోలు అతికించి ఫారాలు పూర్తిచేసి బీఎల్వోలకు బీఎల్ఎల సహకారంతో ఇవ్వాలన్నారు. ఇంటింటికి వెళ్ళి వెరిఫికేషన్ ఫారాలను అందజేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటును సక్రమంగా ఓటర్ లిస్ట్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తమ్మతల్లి పాలక మండలి చైర్మన్ కోరాడ గోవింద్, మాజీ సర్పంచ్ కాళ్ళ సంజీవరావు, బూత్ ఇన్‌చార్జ్ సకలభక్తుల అనంద్, టిడిపి పట్టణ అధ్యక్షుడు కోరాడ గోవింద్, పలువురు టిడిపి నాయకులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## మహిళలను కించపరచడం హేయమైన చర్య

### టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత

ఆమదాలవలస, జూన్ 18 ప్రభాతవార్త



మహిళలను కించపరచడం హేయమైన చర్య అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత అన్నారు. టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మహిళలను కించపరిచే విధంగా మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర హోం మంత్రి అనితపై వ్యాఖ్యలు చేయడం తగదని, వైకాపా నాయకులకు మహిళల పట్ల ఉన్న నీచమైన భావం బయటపడిందన్నారు. వస్త్రధారణపై మాట్లాడిన మంత్రి ఆయన ఇంట్లో మహిళలు ఉన్నారని సంగతి గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. వైకాపా నాయకులు సోషల్ మీడియాలో మహిళలు పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. మాజీ మంత్రి అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, మహిళలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. పిఎసిఎస్ అధ్యక్షులు సిమ్మ మాధవి మాట్లాడుతూ హోంమంత్రి దళిత మహిళ అయిన అనితను ఉద్దేశించి ముఖానికి కిలో మేకప్ వేసుకుంటుందని అమర్నాథ్ వ్యాఖ్యానించడం మహిళలపై అతనికి ఉన్న చిత్తశుద్ధికి ఈ వ్యాఖ్యలకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.వి రాజ్యలక్ష్మి, మాజీ కౌన్సిలర్ సిహెచ్ భారతి, పాల్గొన్నారు.

## నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలిగా కొప్పర సుభాషిణి



వీరఘట్టం జూన్ 18 ప్రభాతవార్త తెలుగుదేశం పార్టీ పాలకొండ నియోజక వర్గం తెలుగు మహిళ అధ్యక్షురాలుగా వీరఘట్టం మండలంలోని తూడి గ్రామానికి చెందిన కొప్పర సుభాషిణిని నియమిస్తూ పాలకొండ నియోజకవర్గ ఇంచార్జ్ పడాల భూదేవి ప్రకటించారు. ఈమె కుటుంబానికి తెలుగుదేశం పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉంది. ఈమె మామ కొప్పర సంగమేశు ఎంపీటీసీగా, సర్పంచ్‌గా కూడా ప్రజలకు సేవలు అందించారు. ఈమె గతంలో కూడా ఎంపీటీసీగా పోటీ చేసేశారు. ప్రస్తుతం ఈమె పాలకొండ ఏఎంసీ డైరెక్టర్ గా కూడా కొనసాగుతున్నారు. రాజకీయ నేపథ్యం నుండి వచ్చిన సుభాషిని తెలుగుదేశం పార్టీలో తనదైన శైలిలో చురుకైన పాత్రను పోషిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటూ, కార్యకర్తలను ఉత్తేజపరుస్తూ టిడిపి పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. దీన్ని అధిష్టానం గుర్తెరిగి ఈమెకు ఈ పదవిని కట్టబెట్టింది. సుభాషిని ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జి భూదేవికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి దక్కేందుకు తనకు సహకరించిన తూడి గ్రామానికి చెందిన మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి ఖండాపు వెంకటరమణ ఆశీస్సులు, మార్గదర్శకత్వం తో ముందుకు కొనసాగుతానని అన్నారు. ఈమెకు పదవి రావడం పట్ల నాలుగు మండలాల పార్టీ క్యాడర్ తో పాటు వీరఘట్టం మండల టిడిపి పార్టీ అధ్యక్షులు సాసు బిల్లి వెంకటరమణ (బుజ్జి) వీరఘట్టం పట్టణ శాఖ అధ్యక్షులు పప్పల మహేష్, మండల తెలుగు యువత అధ్యక్షులు తమరాపు అప్పలనాయుడు, గేదెల గజేంద్ర నాయుడు ,మండల ఉపాధ్యక్షులు గుడివాడ మహేష్, సాధు నారాయణరావు గర్భాన శ్రీనివాసరావు, ముఖలింగం తదితరులు అభినందనలు తెలిపారు.

## మొక్కలు నాటుదాం... పర్యావరణాన్ని కాపాడుదాం



వంగర, జూన్ 18 ప్రభాతవార్త పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అరసాడ వైద్యాధికారులు డాక్టర్ కలమటి ఈశ్వరరావు, డాక్టర్ బి.సౌమ్య అన్నారు. ప్రభావతి జాగ్రుతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు రోటేరియన్ ఎస్.వసంతరావు సౌజన్యంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అరసాడ ఆవరణలో వైద్యాధికారుల చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆప్తాల్మిక్ ఆఫీసర్, సామాజిక కార్యకర్త రోటేరియన్ వసంతరావు మాట్లాడుతూ భవిష్యత్తు తరాల మనుగడ కొరకు ప్రతి ఒక్కరు తరచుగా మొక్కలు నాటాలని అన్నారు. దీనివలన భూతాపం తగ్గడమే కాక సకాలంలో వర్షాలు కురవడం ద్వారా నీటి స్థాయిలు పెంపొందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నారాయణరావు, క్షేత్ర పర్యవేక్షులు నారాయణమూర్తి, స్టాఫ్ నర్స్ ఎస్.ధనలక్ష్మి, బి.దేవకీ, జె.ఆదర్శలక్ష్మి, బి.భవాని తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు పంపిణీ

పాతపట్నం, జూన్ 18 ప్రభాతవార్త:



గిరిజన రైతులకు వ్యవసాయ పరికరాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పంపిణీ చేశారు. గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ ఉత్పాదకత పెంపుదలే లక్ష్యంగా నియోజకవర్గంలోని గిరిజన రైతుల సంక్షేమం మరియు వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఎమ్మెల్యే గోవిందరావు సహకారంతో సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై ఈ ఆధునిక వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయిల్ ఇంజన్లు, పవర్ టిల్లర్లు, పవర్ వీడర్లు, మినీ ట్రాక్టర్లు, మల్టీ క్రాప్ థ్రెషర్లు వంటి ఆధునిక వ్యవసాయ యంత్రాలను అర్హులైన గిరిజన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పరికరాలను అందించడంలో ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు, సీతంపేట ఐటీడీఏ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

## పార్టీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమావేశం

పాతపట్నం, జూన్ 18 ప్రభాతవార్త

వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో స్థానిక వైకాపా క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గానికి సంబంధించిన బిఎలఏల నిర్వహణ, బూత్ స్థాయి కమిటీల బలోపేతంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి, రాబోయే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు గాను నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలకు నూతన ఇంచార్జ్‌లను రెడ్డి శాంతి నియమించారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో బిఎల్ఏలు చురుగ్గా పని చేస్తూ, ఓటర్ల జాబితా సవరణలు మరియు పార్టీ శ్రేణులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆమె దిశా నిర్దేశం చేశారు. నాయకులు, కార్యకర్తలు అందరూ సమిష్టిగా పని చేసి, నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ విజయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు.



# శ్రీకాకుళం వార్త



## ఐటీడీఏ చైర్మన్‌గా శ్రీకాకుళం కలెక్టర్‌ను నియమించాలి

కొత్తూరు, జూన్ 18 (ప్రభాతవార్త) :



పాతపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ సీతం పేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాల యాన్ని శ్రీకాకుళం జిల్లా పరిధిలోకి తరలించి, ఐటీడీఏ చైర్మన్‌గా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌ను నియమించాలని గురువారం కొత్తూరు మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా విభజన అనంతరం గిరిజన ప్రాంతాలపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో మొత్తం 20 టీఎస్‌పీ మండలాలు ఉన్నాయని, వాటిలో 16 మండలాలు శ్రీకాకుళం జిల్లాలోనే ఉన్నాయని ఆయన వివరించారు. ఈ మండలాల్లో సుమారు 8.64 లక్షల జనాభా నివసిస్తుండగా, వారిలో 91 వేల మందికి పైగా గిరిజనులు ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం ఐటీడీఏ పీఓ శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ నియంత్రణలో లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలకు సకాలంలో అందడం లేదని ఆయన ఆరోపించారు. దీనివల్ల విద్య, ఆరోగ్యం, తాగునీరు వంటి కీలక రంగాల్లో సమస్యలు మరింత తీవ్రంగా మారాయని పేర్కొన్నారు. అందువల్ల సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 20 మండలాలపై సమగ్ర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, వెంటనే శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌ను ఐటీడీఏ చైర్మన్‌గా నియమించి గిరిజనులకు పరిపాలనా న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ మీడియా సమావేశంలో ఆయనతో పాటు తెదేపా నేతలు లోతుగడ్డ భగవాన్ నాయుడు,పెద్దన అమర్నాథ్, రాజారావు తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కోటబొమ్మాళి, జూన్ 18 ప్రభాతవార్త:



గ్రామాల్లో వివిధ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ తర్ర రామక్రిష్ణ అన్నారు. మండలం తిలారు గ్రామంలో తర్ర సిమ్మినాయుడు 30వ వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం శంకర్ పౌండేషన్ వారి సౌజన్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు 100 రోగులకు కంటికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అందులో 18 మందికి కంటి ఆపరేషన్ అవసరమని వైద్యులు తెలిపారు. వారికి శంకర్ పౌండేషన్ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేయటం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిలారు పీహెచ్సీ వైద్యులు డాక్టర్ అమృత, తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియా వ్యాధిగ్రస్తుడికి శ్యాంప్రసాద్ చేయూత



కవిటి, జూన్ 18 ప్రభాతవార్త తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి వైసీపీ సమన్వయకర్త శ్యాం ప్రసాద్ రెడ్డి చేయూత నందిస్తున్నారు. వరక గ్రామానికి చెందిన చిన్నారి ప్రవీణ్ ప్రియా తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. చిన్నారికి ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం అందడం లేదు. సమస్యను తెలుసుకున్న శ్యాంప్రసాద్ రెడ్డి గత ఐదు నెలల కాలంగా తన వంతుగా నెలకు 2500 రూపాయలు చొప్పున సహకారం అందిస్తున్నారు. అందులో భాగంగా గురువారం స్థానిక మాజీ సర్పంచ్ ప్రతినిధి శ్రీకాంత్ ప్రియా చేతుల మీదగా 2500 రూపాయలను అందించి ఆదుకున్నారు.

## రాజాం చీపురుపల్లి వెళ్లే మార్గం గుంతల మయం

### చోద్యం చూస్తున్న ఆర్ అండ్ బి అధికారులు



రాజాం, జూన్ 18 ప్రభాతవార్త రాజాం నుంచి చీపురుపల్లి మార్గం గుంతల మయంగా మారిందంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాయత్రి కాలనీ నుంచి బొద్దం వెళ్లే మార్గం గుంతలు ఏర్పడి ఉండడంతో అటుగా వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురి కాక తప్పడం లేదంటూ చెబుతున్నారు. కొత్త రోడ్డు వేయకపోయినా పర్వాలేదు కానీ మార్గమధ్యలో ఏర్పడిన గుంతలను మాత్రం పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

## నేత్ర శిబిరాలు వెలుగు ప్రధాతలు

వంగర, జూన్ 18 ప్రభాతవార్త



గ్రామీణ ప్రాంత ప్రజలకు నేత్ర శిబిరాలు వెలుగు ప్రధాతలని, నేత్ర శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అరసాడ వైద్యాధికారి డాక్టర్ కలమట ఈశ్వరరావు అన్నారు. జిల్లా అందత్వ నివారణ సంస్థ, విజయనగరం సౌజన్యంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరం సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర శిబిరంలో ఆయన మాట్లాడుతూ, మంచి పోషకారం తీసుకోవడం, క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేసుకోవడం ద్వారా శాశ్వత అందత్వ బారిన పడకుండా దృష్టిని కాపాడుకోవచ్చని అన్నారు. ఆనంతరం ఆప్తాల్మిక్ ఆఫీసర్, ఎస్.వసంతరావు 51 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 మందికి కంటి శస్త్ర చికిత్సలు కొరకు సిఫార్సు చేశారని డాక్టర్ ఈశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సౌమ్య, పర్యవేక్షణ అధికారులు జి.వి. ఎన్.ఎన్.ఎస్ మూర్తి, ఏం.వి.లక్ష్మి, ఎన్.పార్వతి, స్టాఫ్ నర్సెస్, మిడిల్వెల్ హెల్త్ పర్సన్స్, ఫార్మసిస్ట్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక నిర్మాణానికి రూ.25 లక్షలు వితరణ



కోటబొమ్మాళి, జూన్ 18 ప్రభాతవార్త: కోటబొమ్మాళి మేజరు పంచాయతీ రెడ్డికవీధికు సంబందించిన స్మశాన వాటికి నిర్మాణానికి అదే వీధికి చెందిన దివంగత కమ్మకట్టు పార్వతీశం కుటుంబసభ్యులు రూ.25 లక్షలు వితరణగా అందజేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర కళింగకోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు స్మశాన వాటిక నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బోయిన రమేష్, మండల పార్టీ అద్యక్షుడు బోయిన సత్యశ్రీనివాస్, దేశం నేతలు కోరాడ గోవింద్, కమ్మకట్టు శ్రీనువాసరెడ్డి, కల్లి శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

19 -6 Pg9th cheli.qxd OK:19 -6 Pg9th cheli.qxd 1/1/02 6:47 AM Page 1



# జుట్టుకి ముల్తానీ మాస్క్!

తక్కువ ఖర్చుతో తొందరగా తాజా మెరుపుని పొందాలంటే మనందరి మొదటి ఎంపిక ముల్తానీ మట్టే. దీన్ని ఎక్కువగా ముఖానికి మాస్క వేసుకునేందుకు వాడతారనే తెలుసు. కానీ ఇది జుట్టుకీ బోలెడన్ని ప్రయోజనాలు ఇస్తుందట.



❖. ముల్తానీ మట్టి జుట్టకి ఉన్న మురికినీ, చుండ్రునీ వదలిస్తుంది. మాడుపై అదనంగా విడుదలయ్యే నూనెల్ని నియంత్రిస్తుంది. కండిషనర్‌గా పనిచేసి కురులను మృదువుగా, మెరిసేలా చేస్తుంది. ఇందుకు ముల్తానీ మట్టి, బియ్యప్పిండి సమాన భాగాలుగా తీసుకుని కప్పు పెరుగు, ఓ గుడ్డులోని తెల్లసొన కలిపి మెత్తని పేస్టులా చేయాలి. దీన్ని మాడు నుంచి చివర్లకు పట్టించాలి. అరగంటాగి గాఢత లేని షాంపూతో తలస్నానం చేస్తే సరి.

❖ నాలుగుచెంచాల మల్తానీ మట్టికి రెండుచెంచాల నిమ్మరసం, చెంచా పెరుగు చేర్చి పేస్ట్‌లా చేయాలి. దీనినన కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. అరగంటాగి రసాయనాలు లేని షాంపూతో తలస్నానం చేస్తే సరి. కురులు నిగనిగలాడతాయి. ఇందులోని యాంటీబ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబయాల్ లక్షణాలు చుండ్రుని తగ్గిస్తాయి. ★

# ఒత్తిడి ఎక్కువ అయిందా ?

బరువు పెరిగితే ఎక్కువ తినేస్తున్నామేమో అన్న కంగారు. నిద్ర పట్టక పోతుంటే ముందే మెనోపాజ్ వస్తోందేమో అన్న భయం, గాయాలు మానకపోతే మధు మేహమేమో ఇలా అనుమానించుకుంటూ పోతుంటాం. అయితే ఒత్తిడి కలిగించే హార్మోను పెరిగిందేమో గమనించుకోవాలి.

మెటబాలవజం సరిగా ఉండాలన్నా.. రక్తంలో చక్కెరలు, హార్మోన్ల స్థాయుల్లో సమన్వయం జరగాలన్నా కాస్త ఒత్తిడి మంచిదే. అంటే దానికి కారణమయ్యే కార్టిసాల్ కొద్దిస్థాయుల్లో విడుదలైతే ఆరోగ్యమే. అది హద్దు దాటితేనే అనారోగ్యం పొట్ట పెరిగిపోతోంది. దుస్తుల్లోంచి కనిపిస్తోందంటూ తెగ ఇబ్బంది పడిపోతాం కదా! అది పెరుగుతూ వస్తోన్నా అనుమానించాల్సిందే. ఒత్తిడితో తెలియకుండానే స్వీట్లు, చిరుతిళ్లవైపు ఆకర్షితులం అవుతాం. అదేమో బరువు పెరగడానికి కారణమవుతుంది. ఒత్తిడి పెరిగేకొద్దీ శరీరంలో నిల్వ ఉండే గ్లూకోజు ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. అదీ పొట్ట దగ్గర కొవ్వుగా చేరుతుందట. రాత్రుళ్లు నిద్ర పట్టకపోవడం పట్టినా పదే పదే మెలకువ రావడమూ కార్టిసాల్ పెరగడానికి సూచనలే. పదే పదే ముఖం వాయడం, నీరు చేరినట్లుగా అనిపించినా తేలిగ్గా తీసుకోవద్దు.



అంతెందుకు శరీరంపై ఏవైనా గాయాలైతే కొన్ని రోజుల్లో మానడం మామూలే. గాయం తీవ్రతను బట్టి నయమయ్యే సమయంలో మార్పు ఉంటుంది. చిన్నచిన్నవీ తగ్గడం లేదంటే దానికి కారణమయ్యే సైటోకైన్స్ సరిగా పనిచేయడం లేదని అర్థం పెరిగిన ఒత్తిడి హార్మోన్ ఉత్పత్తి సైటోకైన్స్ పనితీరుకు అడ్డుపడి, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌కి కారణమవు తాయి. తిండి పడలేదు, జీర్ణవ్యవస్థలో ఏదో ఇబ్బంది.. గ్యాస్ పదే పదే పలకరిస్తోంటే మనం చెప్పుకొనే కారణాలే ఇవి. కొన్నిసార్లు నెలసరి రాబోతోందని సర్దిపుచ్చుకుంటాం కూడా. కానీ అతి ఒత్తిడి కూడా జీర్ణప్రక్రియపై ప్రభావం చూపుతుంది.

# లాలి పాటలే బుజ్జాయికి తొలి పాఠం



బిడ్డ పుట్టగానే బాధ్యత తీసుకుంటుంది అమ్మ. ఆ బుజ్జాయిని గొప్ప మనిషిగా తీర్చిదిద్ది, ఈ లోకానికి అందించే వరకూ ఆమె విశ్రమించదు. ఆ ప్రయాణం లో ప్రతి అడుగూ ఓ అద్భుతమే! అందుకే తల్లీబిడ్డల మధ్య బంధం పరిశోధకులకి ఓ హాట్ టాపిక్! అలా ఈమధ్య జరిగిన ఓ పరిశోధనలో, తల్లి లాలిపాట కూడా చిన్నారి ఎదుగుదల మీద గొప్ప ప్రభావం చూపుతుందని తేలింది. ప్రాంతానికీ, భాషకీ అతీతంగా ప్రపంచంలోని ప్రతి తల్లీ తన బిడ్డని పాటతో లాలిస్తుంది. అసలు సంగీతం లాలిపాటతోనే మొదలైందని అంటారు. ప్రపంచంలో బెస్ట్‌సింగర్ తల్లే అని ఒప్పుకొంటారు. అందుకే మియామీ యూనివర్సిటీ పరిశోధకులు చిన్నారుల మీద తల్లి లాలిపాట ప్రభావం గురించి పరిశోధించే ప్రయత్నం చేశారు. ఇందుకోసం వారు 70 మంది పసిపిల్లలని గమనించారు. తల్లి లాలిపాట పాడుతున్నప్పుడు వారి మానసిక స్థితినీ, వేరే సంగీతం వింటున్నప్పుడు వారి ఉద్వేగాలనీ పరిశీలించారు. లయబద్ధంగా, ప్రేమగా సాగే లాలిపాటని వినగానే పిల్లల్లో అలజడి సద్దు మణిగి పోతున్నట్లు తేలింది. లాలిపాట పాడుతున్నప్పుడు బుజ్జాయి తల్లి వంకే చూస్తుంటుంది. ఆ చిన్నారి స్పందనలకు అనుగుణంగా తల్లి కూడా, పాటలోని లయని మారుస్తూ ఉంటుంది. దీంతో ఇద్దరి మధ్యా గొప్ప అనుబంధం ఏర్పడు తున్నట్లు గమనించారు. లాలిపాటతో పిల్లలు శబ్దాలను కూడా సులువుగా గ్రహించగలుగుతున్నారట. అలా లాలిపాట పిల్లవాడికి భాషని కూడా పరిచయం చేస్తున్నదన్న మాట. లాలిపాట పాడుతూ చిన్నారితో గడపడం వల్ల తల్లి మనసు కూడా ప్రశాంతత పొందు తున్నట్లు తేలింది. చాలామంది తల్లులు డెలివరీ తర్వాత, శరీరంలోని హార్మోన్ల మార్పులతో డిప్రెషన్‌కు లోనవుతారు. దీన్నే అంటారు తల్లిలో ఏర్పడే ఈ నిరాశ నుంచి దృష్టి మళ్లించేందుకు లాలిపాట మందులా పనిచేస్తుందట. అంటే అమ్మ తనని తాను సంబాళించుకుంటూ, బుజ్జాయికి ప్రపంచాన్ని పరిచయం చేస్తుందన్నమాట.

# భావోద్వేగాలను పరిశుద్ధ పరచుకున్నవాడే..

మనిషి సకల కార్యకలాపాలూ ఒక్క మనస్సు నుండే జరుగుతాయి. అదొక్కటీ పరిశుద్ధమైతే సకల కర్మలూ 'సత్కర్మల్లు' అవుతాయి, లేకపోతే 'దుష్కర్మలు' అవు తాయి. అందుకే యావత్ ధర్మశాస్త్రాలు మనో పరి శుద్ధతకే పెద్దపీట వేస్తున్నాయి. ఆత్మశుద్ధే ధర్మాల అంతిమ లక్ష్యం. మనస్సును జయించినవాడికి అది మిత్రుడు, లేనిచో శత్రువు అని భగవద్గీత (6:6); హృదయశుద్ధి గలవారు దేవుని చూచెదరని పరిశుద్ధ బైబిలు (మత్తయి 5:8); మనస్సును పరిశుద్ధం చేసు కున్న వ్యక్తి నిస్సందేహంగా సాఫల్యం పొందుతాడని ఖురాను (87:14) ప్రకటిస్తున్నాయి. దీనిని బట్టి మనో పరిశుద్ధతకి ధర్మ గ్రంథాల్లో ఎంతటి ప్రాధా న్యత ఉందో అర్థం చేసు కోవచ్చు. మనిషిలో శారీరక దారుఢ్యం, మేధాసంపత్తి, లలితకళలు, విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం వంటి ఎన్నో విశేషాలు, శక్తిసామర్థ్యాలు ఉండవచ్చు. కానీ ప్రజల్లో 'హృదయపూర్వకమైన గౌరవ స్థానం' ఏర్పడేది మాత్రం అతడు కలిగి ఉండే 'సౌశీల్యత' అనే నైతిక, మానవీయ 'కౌసల్యము'ను బట్టే. ఈ సౌశీల్యతకు కేంద్ర స్థానం మనసే. భౌతిక వ్యవసాయం - నైతిక వ్యవసాయం! భౌతిక మనుగడకు వ్యవసాయ క్షేత్రంలో మేలు చేసే పంట మొక్కలను పోషిస్తూ, కీడు చేసే 'కలుపు మొక్కలను' ఎప్పటికప్పుడు తుంచి వేయడం ఎంత ప్రకృతి సహజమో, నైతిక మనుగడకు 'మనో క్షేత్రం'లో నైతిక వ్యవసాయం చేయడం అంత తప్పనిసరి. దీనినే సెక్యులర్ పరిభాషలో 'నైతిక మార్గం' అని, ఆధ్యాత్మిక పరి భాషలో 'భక్తి మార్గం' అని అంటారు. ఈ పనులలో ఏ ఒక్కటి విడనాడినా మనిషి నైతిక మనుగడ నాశనం కాక తప్పదు. మన మనో క్షేత్రంలో వినయం, నమ్రత, శాంతి, మైత్రి, క్షమాశీలత వంటి అనుకూల భావోద్వే గాల సాగు చేస్తున్నప్పుడు...అహంకారం, గర్వం, ఈర్ష్యా సూయలు, కోపం, పగ, ప్రతీకారం వంటి ప్రతికూల భావోద్వేగాల కలుపు మొక్కలు ఏపుగా పెరిగి పోతుంటాయి. అది ప్రకృతి సిద్ధం, దానిని అసలే మొలవకుండా నివారించడం అసాధ్యం. కాబట్టి, ఆ కలుపు మొక్కలు బలపడ 'కుండా మొగ్గలోనే తుంచి పారేస్తూ, మనో క్షేత్రాన్ని ఎప్పటికప్పుడు 'పరిశుద్ధం' చేస్తూ సాగడమే మనిషి సాఫల్యానికి ఏకైక మార్గం.

ముహమ్మద్ ముషఫ్ఫ్ అహ్మద్ అభిలాష్

# వాడిన పూలతో..



దేవుడికో, జడలోనో అలంకరించేస్తాం. తర్వాత వాటిని వ్యర్థంగా భావించి తీసి బయట పారేస్తాం. కానీ, వీటితో బోలెడు ప్రయోనాలున్నాయి. పండగల్లో అలంకరణలోనూ ఎక్కువగానే వాడతాం. అవి కాస్తా ఎండి పోయాక తీసి పారేయకండి. వీటితో ఇంట్లోకి దోమలు, కీటకాలు రాకుండా చేయొచ్చు. ఇందుకోసం మిక్సీ జార్‌లోకి గుప్పెడు బంతి పూల రేకల్ని తీసుకుని, అందులో కాస్త బేకింగ్ సోడా, మూడు వెల్లుల్లి రెబ్బలు, కొన్ని నీళ్ల కూడా చేర్చి మెత్తగా రుబ్బుకోవాలి. దీన్ని వడకట్టి ఓ స్ప్రే సీసాలోకి నింపి ఉదయం, సాయంత్రం కిటికీలూ, మూలల్లో చల్లితే సరి. లోపలకేవీ రావు. అందమైన గులాబీలు వాడి పోయాక పరేయొద్దు. వీటిని రేకలుగా విడదీసి,కాస్త మైనం కలిపి మిక్సీలో వేసి మెత్తగా చేయండి. దీనికి రెండు చుక్కల రోజ్ ఆయిల్‌ని చల్లి ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో పోసి మధ్యలో దారం ఉంచాలి. ఆపై దాన్ని రోజంతా ఫ్రిజ్‌లో ఉంచితే సరి. దీన్ని వెలిగిస్తే ఇల్లంతా వెలుగులు నిండడమే కాదు. సువాసనా వెదజ ల్లుతుంది. అలానే మల్లె, సంపంగి వంటి సువాసన ఇచ్చే పూలలో కొద్దిగా రోజ్ వాటర్ కలిపి పేస్టలా చేసుకోవాలి. ఆ మిశ్రమాన్ని వడకట్టి అందులో కొన్ని చుక్కల లావెండర్ ఆయిల్ వేసి గదిలో స్ప్రే చేసుకుంటే తాజా అనుభూతి కలుగుతుంది.

# పోషకాల అవిసెలు..



**చాక్లెట్లు నుంచి ఓట్‌మీల్ వరకు అన్ని రకాల ఆహారపదార్థాల్లో అవిసెలు కనిపిస్తున్నాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లూ, లిగ్నన్లు, పీచు పదార్థాలు పుష్కలంగా ఉండే వీటిని, మహిళలు రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల, హృదయ సంబంధిత, రుతుక్రమ, క్యాన్సర్‌లకు సంబంధించిన వ్యాధులన ఎతగ్గిస్తాయని టొరంటో విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనాల్లో వెల్లడైంది.**

అవిసెలు మహిళల్లో వచ్చే రొమ్ముక్యాన్సర్, పెద్దపేగు క్యాన్సర్లు రాకుండా నివారిస్తాయని కెనడా న్యూట్రిషన్ కౌన్సిల్ పేర్కొంది. వీటిల్లో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు క్యాన్సర్ కణతుల్ని పెరగకుండా నియంత్రి స్తాయి. యుక్తవయసు వారిలో క్యాన్సర్ వచ్చిన వారుంటే రోజూ ఆహారంలో అవిసెలను తీసు కోవడంవల్ల వీటిలో ఉండే లిగ్నన్లు క్యాన్సర్ కణాలతో పోరాడి, వృద్ధి చెందకుండా కాపాడతాయి. రుతు క్రమం ఆగిన మహిళలల్లోనే హృద్రోగాలు వచ్చే అవకాశాలు ఎక్కువున్నాయని తెలిసింది. ఇందుకోసం కొంతమంది మహిళలకు సంవత్సర కాలంపాటు రోజూ నాలుగు చెంచాల అవిసెగింజలు ఇచ్చారు. వీటిలో ఉండే లిగ్నన్లు రక్తంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గించడమే కాకుండి, రక్తనాళాల్లో కొవ్వు పేరుకోకుండా కాపాడాయి. అంతేకాదు రక్తపోటును నియంత్రణలో ఉంచుతాయని తేలింది. టైప్-2 డయాబెటిస్ మెరుగుపడింది. ప్రసవానంతరం లేదా నెలసరి ఆగిన మహిళల్లో అరికాళ్లూ, చేతులూ మంట పెడు తుంటాయి. పరిశోధనలో భాగంగా కొంతమంది మహిళలకు రోజూ రెండు చెంచాల అవిసెలు, తృణధాన్యాలను పెరుగు, సలాడ్లు, జ్యూస్‌ల్లో కలిపి ఇచ్చారట. వారం రోజుల్లోనే 57 శాతానికి అరికాళ్ల మంటలు తగ్గినట్లు వారు గమనించారు.

తెర

# 'వెంకట్రామయ్య గారి తాలూకా' జులై లో విడుదల



దినేష్ కుమార్ హీరోగా, దివిజ ప్రభాకర్ (ప్రభాకర్ కుమార్తె) హీరోయిన్‌గా మురళీధర్ గౌడ్, సుధ టైటిల్ పాత్రలలో సతీష్ ఆవాల దర్శకత్వం లో కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి నిర్మించిన చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా' ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూలైలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్ర నిర్మాత కోమలి మాట్లాడుతూ... నేను కోమలి ఫోక్ సింగర్‌గా నా కంటూ ఒక గుర్తింపు తెచ్చుకుని సినిమా రంగం మీద నాకున్న ఇష్టంతో నేను సినిమా తీయాలి అని ఒక ధ్యేయంతో చాలా ఒడుదుడుకులని ఎదుర్కొని 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్రాన్ని పూర్తి చేసాము. దర్శకుడు సతీష్ అవాల మాట్లాడుతూ..మా 'వెంకట్రామయ్య గారి తాలూకా'చిత్రన్ని జులై లో విడుదల కానుండి త్వరలోనే డేట్ ఫైనల్ చేసి ఆపిషియల్ ప్రెస్ మీట్ పెట్టి అనౌన్స్ చేస్తాము. మా కథ విషయానికోస్తే అందమైన ఒక పల్లెటూరులో వెంకట్రమయ్య అనే పరువుగల కుటుంబం లోజరిగే ప్రస్తుతం మనుషుల మధ్య ఉన్న బంధాలు డబ్బుతో ముడిపడ్డాయి. మానవీయ సంబంధాలు అన్ని ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయి. తల్లి తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను కడుపు కట్టుకుని ఎన్నో కష్టాలను భరిస్తూ పిల్లలను ఎంతో అల్లారు ముద్దగా నలుగురు పిల్లలను పెంచి పెద్ద చేస్తున్నారు. కానీ తల్లి తల్లిదండ్రుల చివరి దశలో నలుగురు పిల్లలు కలిసి వాళ్ళని పెంచలేకపోతున్నారు. తల్లి తల్లిదండ్రుల గొప్పతనం తెలియచేసే సినిమా. 'వెంకట్రామయ్య గారి తాలూకా' మంచి ఫ్యామిలీ డ్రామాని కుటుంబం తో కలిసి థియేటర్ కి వెళ్లి హాయిగా ఎంజాయ్ చేసేలా చిత్రాన్ని తెరకేకించాం అని దర్శకుడు సతీష్ ఆవాల తెలిపారు.

# 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' క్లైమాక్స్ అద్భుతం: రాశీ సింగ్



వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా చేసిన చిత్రం 'ట్రాన్స్ ఫర్ త్రిమూర్తుల్ల. ఈ మూవీతో కమల్ తేజ నార్ల దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్‌కి జోడిగా రాశీ సింగ్ నటించారు. చిత్రం జూన్ 19న రిలీజ్ కాబోతోంది.

**'ట్రాన్స్ ఫర్ త్రిమూర్తులు' చిత్రంలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?..**

పక్కింటి అమ్మాయిలా నా పాత్ర ఉంటుంది. ఎంతో సహజంగా అనిపిస్తుంది. విత్ అవుట్ మేకప్ నటించాను.

**వడ్డే నవీన్ నుంచి ఏమైనా తెలుసుకున్నారా?..**

వడ్డే నవీన్ గారితో సినిమా అని తెలిశాక చాలా వరకు ఆయన గురించి రీసెర్చ్ చేశాను. ఆయన నటించిన ఎన్నో చిత్రాల గురించి తెలుసుకున్నాను.

**'ట్రాన్స్ ఫర్ త్రిమూర్తులు'చిత్రంలో మీ పాత్ర ఎలాంటి టర్నింగ్ పాయింట్‌లా ఉంటుంది?..**

భర్తకు ప్రతీ విషయంలో సపోర్ట్‌గా ఉండే ఓ చక్కటి గృహిణిగా లక్ష్మీ పాత్ర ఉంటుంది. నేను రియల్ లైఫ్‌లో కంప్లీట్ డిఫరెంట్‌గా ఉంటాను. లక్ష్మీ పాత్రను పోషించడం ఆనందంగా ఉంది.

**దర్శకుడితో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ చెప్పండి?..**

కమల్ గారికి ఫుల్ క్లారిటీ ఉంటుంది. ఆయనకు ఏం కావాలో అది వచ్చే వరకు ప్రయత్నిస్తూనే ఉంటారు. లక్ష్మీ ఎలా ఉండాలో.. అలానే ఉండాలని ఆయన చెబుతుంటారు. కొంచెం అటూ ఇటూ కూడా కావొద్దు అని ఆయన అంటుంటారు.

**రెస్టారెంట్ బిజినెస్ ఎలా నడుస్తోంది?..**

రెస్టారెంట్ బిజినెస్ అద్భుతంగా నడుస్తోంది. వడ్డే నవీన్ గారు కూడా నా వ్యాపకాల గురించి అడిగేవారు. నాకున్న రెస్టారెంట్, కెఫె వ్యాపారాల గురించి చెప్తే ఆశ్చర్యపోయారు.

**మీకు ఏ రంగంలో కంఫర్ట్‌గా అనిపిస్తుంది?..**

నాకు సినిమాలు, వ్యాపారాలు రెండూ ఇష్టం. నేను ఇంకా ఇంకా చాలా చేయాల్సి ఉంది. ఇదంతా కూడా నథింగ్. 14 ఏళ్లకే మోడలింగ్ స్టార్ట్ చేశా. ఛత్తీస్ ఘడ్‌లోని భిలాయ్ నుంచి వచ్చాను. మిస్ చత్తీస్ ఘడ్ పోటీలో రెండో స్థానంలో వచ్చాను.

# #VenkyAnil5 & # NkrAR2 ఘనంగా ప్రారంభం



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, 'హిట్ మెషీన్' అనిల్ రావిపూడి కలిసి ఒక పూర్తి స్థాయి పండుగ వినోదాత్మక చిత్రం (#VenkyAnil5 & # NkrAR2) అందించడానికి సిద్ధమవుతు న్నారు. ఈ క్రేజీ కాంబినేషన్ చిత్రం 2027 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. కీర్తి సురేష్, కృతి శెట్టి ఇందులో కథానాయికలుగా నటిస్తున్నారు. చిత్ర బృందం, పలువురు ప్రముఖ అతిథుల సమక్షంలో ఘనంగా జరిగిన ముహూర్తం, పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. దిల్ రాజు, శిరీష్ స్క్రిప్ట్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటికి అధికారికంగా అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ముహూర్తం సందర్భంగా, విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టిలపై చిత్రీకరించిన మొదటి షాట్‌కు అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, సురేష్ బాబు కెమెరాను స్విచ్ ఆన్ చేశారు. దిగ్గజ దర్శకుడు కె. రాఘవేంద్ర రావు ఓపెనింగ్ షాట్‌కు దర్శకత్వం వహించారు. #VenkyAnil5 & # NkrAR2 చిత్రం అనిల్ రావిపూడి స్టయిల్ లో సాగే వినోదం, నవ్వులతో కూడిన సంక్రాంతి చిత్రంగా ఉండబోతోంది. వెంకటేష్, కళ్యాణ్ రామ్ కాంబో ఈ ప్రాజెక్ట్‌కు మరింత ఎట్రాక్షన్ జోడించడంతో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న పండుగ చిత్రాలలో ఒకటిగా ఇది నిలుస్తోంది. అనిల్ రావిపూడికి ఉన్న అద్భుతమైన బ్లాక్‌బస్టర్ ట్రాక్ రికార్డ్, స్టార్స్ కలయిక, పరిశ్రమలోని ప్రముఖ నిర్మాణ సంస్థల మద్దతు కారణంగా ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి అత్యుత్తమ సాంకేతిక బృందం పనిచేస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎస్. ప్రకాష్ ఆర్ట్ డైరెక్షన్ నిర్వహిస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

# 27న 'కన్నప్ప' రీ రిలీజ్



డైనమిక్ హీరో విష్ణు మంచు గత ఏడాది 'కన్నప్ప' అంటూ ఆడియెన్స్‌ను ఎంతగానో ఆకట్టుకున్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద 'కన్నప్ప' మూవీని డా. ఎం. మోహన్ బాబు నిర్మించిన సంగతి తెలిసిందే. ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇక ఈ ప్రాజెక్ట్‌లో అక్షయ్ కుమార్, మోహన్ లాల్, ప్రభాస్, కాజల్, బ్రహ్మానందం ఇలా ఎంతో మంది గొప్ప నటీనటులు కీలక పాత్రలను పోషించడంతో ప్యాన్ ఇండియా వైడ్‌గా క్రేజ్‌ను దక్కించుకుంది. 'కన్నప్ప' సినిమాకి తెలుగులో వచ్చిన ఆదరణ, క్లైమాక్స్‌లో విష్ణు నటనకు వచ్చిన ప్రశంసల గురించి అందరికీ తెలిసిందే. మరోసారి ఈ విజువల్ వండర్‌ను ఆడియెన్స్‌కి అందించేందుకు విష్ణు మంచు రెడీ అయ్యారు. సినిమా రిలీజ్ అయి ఏడాది అవుతున్న సందర్భంగా మళ్లీ జూన్ 27న 'కన్నప్ప'ని లిమిటెడ్ స్క్రీన్‌లలో రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మేరకు విడుదల చేసిన రీ రిలీజ్ డేట్ పోస్టర్ వైరల్ అవుతోంది.

# 'కళాంకి భైరవుడు' టీజర్ లాంచ్



కళాంకి భైరవుడు ఓ విభిన్నమైన గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన మిస్టికల్ థ్రిల్లర్. చేత బడులు, క్షుద్ర పూజలు, నిజ జీవితంలో జరిగిన కొన్ని ఆశ్చర్యకర సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది. దర్శకుడు హరి హారన్.వి తన ప్రత్యేక కథన శైలితో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. గాయత్రీ ప్రొడక్షన్స్, రచ్చుమల్ల బ్రదర్స్ బ్యానర్లపై కె.ఎన్. రావు, డా. రచ్చుమల్ల శ్రీనివాస రావు నిర్మించిన ఈ చిత్రానికి పి.ఆర్. సంగీతం అందించారు. ఈ చిత్రంలో రాజశేఖర్ వర్మ ప్రధాన పాత్రలో నటించగా, రితిక, పూజ కిరణ్, భవ్యశ్రీ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. టీజర్ లాంచ్‌కు ముఖ్య అతిథిగా దర్శకుడు సాయి రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ..సాయి రాజేష్ మాట్లాడుతూ,..ప్రతి శుక్రవారం బాక్సాఫీస్ వద్ద పోటీ, సవాళ్లు ఉంటాయి. నా తొలి చిత్రం హృదయ కాలేయం రోజులలో గెస్ట్ కోసం వెతికిన సందర్భాలు గుర్తొస్తున్నాయి. ఇదే వేదికపై బేబీ టీజర్, చెన్నై లవ్ స్టోరీ టీజర్‌లను కూడా విడుదల చేశాం. ..హీరోయిన్ రితిక మాట్లాడుతూ,.. ముందుగా మా టీజర్ లాంచ్ కార్యక్రమానికి విచ్చేసి మాకు అండగా నిలిచిన సాయి రాజేష్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

హీరో రాజశేఖర్ వర్మ మాట్లాడుతూ,.. మా చిన్న సినిమాకు మద్దతుగా ఇక్కడికి విచ్చేసిన దర్శకుడు సాయిరాజేష్‌కి, అలాగే మీడియా మిత్రులందరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు. హీరోయిన్ భవ్యశ్రీ మాట్లాడుతూ,.. ముందుగా మీడియా మిత్రులకు, ప్రేక్షకులకు, అలాగే మా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాయి రాజేష్‌కి నా హృదయపూర్వక ధన్యవాదాలు. మా టీజర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. ..నిర్మాత రీ.వి రావు మాట్లాడుతూ,.. మా చిత్రానికి మద్దతుగా ఇక్కడికి విచ్చేసిన ముఖ్య అతిథులకు, మీడియా మిత్రులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. దర్శకుడు హరిహారన్ లేకపోతే ఈ సినిమా రూపుదిద్దుకునేది కాదు. ఆయన విజన్, కృషి వల్లే ఈ ప్రాజెక్ట్ సాధ్యమైంది. కళాంకి భైరవుడు చిత్రం చేతబడులు, క్షుద్ర పూజల నేపథ్యంతో రూపొందింది.

# 'కామ్రేడ్ కళ్యాణ్' ఫస్ట్ సింగిల్ 20న రిలీజ్



కింగ్ ఆఫ్ ఎంటర్టైన్‌మెంట్ శ్రీ విష్ణు తన వెర్సటైల్ పెర్ఫార్మెన్స్, యూనిక్ కథలతో అలరిస్తున్నారు. ప్రతి సినిమాలోనూ హ్యూమర్ వుండేలా చూసుకునే శ్రీవిష్ణు తన లేటెస్ట్ ఫన్‌ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'కామ్రేడ్ కల్యాణ్'తో వస్తున్నారు. ఈ చిత్రాన్ని వెంకట్ ప్రెజెంట్ చేస్తుండగా, జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం హిస్తున్నారు. వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ సింగిల్ ఒరియా పిల్లా జూన్ 20న రిలీజ్ చేయనున్నారు. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో శ్రీవిష్ణు, మహిమా మధ్య కనిపించిన అందమైన కెమిస్ట్రీ, లవ్ వైబ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమయే కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ డీవోపీ, విజయ్ బుల్గానిన్ మ్యూజిక్, చోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

## నేడు కేసుల్లో పట్టుబడిన వాహనాలు వేలం : ఎక్సైజ్ శాఖ సీఐ



సాలూరు జూన్18 ప్రభాతవార్త :

సాలూరు పట్టణ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇదివరకు నమోదు చేసిన సారా కేసులలో ఉన్న వాహనాలను వేలం నిర్వహిస్తున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ దాస్ గురువారం తెలిపారు.అందులో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి స్టేషన్ ఆవరణలో వాహనాలు వేలం జరుగుతుందని స్పష్టం చేసారు.అలాగే వాహనాలు వేలంలో పాల్గొన్నవారు ఆధార్ కార్డు తీసుకురావాలని అన్నారు. ఈ అవకాశం వినియోగించు కోవాలని కోరారు.ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎస్.రవి ప్రసాద్,సిబ్బంది పాల్గొన్నారు.

## ఊరిక్కడ - నీరక్కడా - బిందె నీళ్లు కోసం కిలోమీటర్ల నడక

### డెన్సురాయిలో 2 నెలలుగా గిరిజనుల నీటి కష్టాలు

సాలూరు జూన్18 ప్రభాతవార్త



సాలూరు మండలం డెన్సురాయి గ్రామంలో గత రెండు నెలలుగా తాగునీటి కోసం అక్కడ గిరిజనులు అల్లాడి పోతున్నారు. బిందెనీళ్ల కోసం కిలోమీటర్లు నడుచుకొని పక్క గ్రామానికి వెళ్లె దుస్థితి నెల్కొంది. బుధవారం ఈ విషయం తెలుసు కున్న గిరిజన సంఘ నాయకులు అక్కడికి వెళ్లి వారి నీటికష్టాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతు గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని వారు రెండు నెలలుగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.వేసవిలో జిల్లా అధికారులు ముందుగా ప్రకటనలు చేసిన అవన్నీ నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని విమర్శించారు. అందువలన గిరిజన మహిళలు పక్క గ్రామమైన రేవడవలస వెళ్లి తాగునీరు తెచ్చుకొని అవసరాలు తీర్చుకోవడం దారుణమన్నారు.అంతేకాకండా తక్షణమే కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని మండల అధికారులు తీసుకువెళ్లి ఈ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.గిరిజన సంఘ నాయకులు మ్రి.శ్రీనివాసరావు, సీదరపు.అప్పారావు పాల్గొన్నారు.

## వైవిధ్యీకరణపై రైతులకు శిక్షనా కార్యక్రమం

మక్కువ జూన్ 18 ప్రభాతవార్త



మండలంలో డి సిర్లం రైతు సేవా కేంద్రం పరిధిలో లోవర కండి గ్రామంలో వ్యవసాయ శాఖ- ఆత్మ సౌజన్యంతో పంటల వైవిధ్యీకరణ పై రైతులందరికీ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి చింతల భారతి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో పంటలపై ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు తెలియజేయడమైనది. అలాగే ఈ సీజన్ కి సంబంధించి ఎరువులను ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా మాత్రమే సరఫరా చేయబడుతుందని వివరించారు. గ్రామంలో పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు ఈ క్రాప్ యాప్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులు ఎవరైనా ఉంటే సమీప రైతు సేవ కేంద్రంలో కౌలు కార్డులు చేయించుకోవాలని తెలియజేశారు. కౌలు కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. అంతేకాకుండా అధిక రాబడిని ఇచ్చే ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలని రైతుల్ని కోరారు. దీనితో పాటుగా వ్యవసాయ యాంత్రీకరణ గురించి రైతులకు తెలియజేశారు. వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా వ్యవసాయ శాఖ తరపున డ్రోన్లు మరియు కంబైన్ హార్వెస్టర్లు మరియు ఇతర వ్యవసాయ పనిముట్లు లభిస్తాయని తెలియజేశారు. ముఖ్యంగా రైతులందరూ సహజ పద్ధతుల్లో ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని సూచించారు వరి విత్తనాలు వేసుకోకముందే ప్రతి ఒక్కరు తమ పొలాల్లో నవధాన్యాలు, పచ్చి రొట్టె ఎరువులు వేయాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం పవన్ పాల్గొన్నారు.

## సురక్ష భీమా యోజన చెక్కు అందజేత

నెల్లిమర్ల, జూన్ 18, ప్రభాతవార్త



మండలంలోని కొండ గుంపాం గ్రామానికి చెందిన శనపతి రమణమ్మ ఇటీవల మృతి చెందిన దృష్ట్యా ఆమెకు ప్రధాన మంత్రి భీమా సురక్ష యోజన కింద మంజూరు అయిన 2 లక్షల రూపాయిల చెక్కును నామినీ అయిన ఆమె కుమారుడు శనపతి శ్రీను కు నెల్లిమర్ల స్టేట్ బ్యాంకు మేనేజర్ సి. హెచ్. ప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమం లో సర్వీస్ మేనేజర్ వై రమేష్, ఫీల్డ్ ఆఫీసర్ సురేష్, ఎస్.ఎస్.టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు శ్రీకాంత్ , సంధ్య , నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. సురక్ష భీమా యోజన పథకం ప్రీమియం చెల్లించిన ఆమె ఇటీవల మరణించింది. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆర్థిక అక్షరాస్యత కేంద్రశీ నెల్లిమర్ల కౌన్సిలర్స్ శ్రీకాంత్, సంధ్య, నాగేంద్రబాబు ఆయన పెట్టుకున్న నామినీ ఆయనటువంటి సేనాపతి శ్రీను కలిసి భీమా పొందడానికి తగిన పత్రాలన్నీ సమకూర్చి భీమా త్వరగా రావడంలో సహాయం చేశారు. దింతో శనపతి శ్రీనుకి బ్యాంకు మేనేజర్ ప్రసాద్ చేతుల మీదుగా రెండు లక్షల భీమా చెక్కును అందజేశారు. తనకి ఈ భీమా అందించిన బ్యాంకు సిబ్బందికి, త్వరగా వచ్చేలా సహాయపడిన సంస్థ కౌన్సిలర్స్ కి, కౌన్సిలర్స్ ని ప్రోత్సహించిన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులుకు, ప్రాజెక్ట్ మేనేజర్ అశోక్ కు శ్రీనివాసరావు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## నీట్, ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించే ఆర్యవైశ్య విద్యార్థులకు స్వర్ణ పతకాలతో సత్కారం

గరివిడి, జూన్ 18,ప్రభాత వార్త

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో గల ప్రతిభా వంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు హైదరాబాద్ కి చెందిన అవోపా బ్యాంకు మెన్ చాప్టర్ అనే సంస్థ స్వర్ణ పతకాలు తో సత్కరించనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటన లో వెల్లడించారు. ఏపీ, టీజీ రాష్ట్రాలకు చెందిన ఆర్య వైశ్య విద్యార్థులు ఎంసెట్,నీట్ తదితర పరీక్షల్లో మొదటి1500 ర్యాంకులు సాదించిన వారిలో వంద మంది ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ పురస్కారంకి అర్హులుగా పేర్కొన్నారు. జులై,5 వతేదీ లోపు అర్హులైన ఆర్య వైశ్య విద్యార్థులు దరఖాస్తులు సమర్పించాలని వారు తమ ప్రకటన లో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు9290529133, 9849750506 నెంబర్లు కి సంప్రదించాలని కోరారు.

## వేచలపు వాని పాలెంలో ప్రకృతి వ్యవసాయం వనరుల కేంద్రంను ప్రారంభించిన డిపిఎం

### ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ విజయ్ కుమార్

లక్కవరపుకోట జూన్ 18 ప్రభాతవార్త

మండలంలోని గేదెల వాని పాలెం గ్రామపంచాయతీ కి చెందిన గ్రామమైన వేచలవానిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం వనరుల కేంద్రంను గడీపీఎం విజయ్ కుమార్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం బోనాల కేంద్రం ద్వారా చుట్టుపక్కల గ్రామాలకు రైతులకు ప్రకృతి వ్యవసాయం చేయడానికి అవసరమైన ఇన్పుట్స్, కషాయాలు, ద్రావణాలు దేశీయ వరి విత్తనాలను మరియు జీవామృతాలు రైతులకు అమ్మడం జరుగుతుంది అని అదేవిధంగా రైతుల పండించిన పంటలను ఉత్పత్తులను కొనుగోలు చేసి మార్కెటింగ్ కూడా చేయడం జరుగుతుందని తెలిపారు .ఈ సమావేశంలో పాల్గొన్నఏ డి పి ఎం స్వామి నాయుడు గ్రామంలో మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు ప్రకృతి వ్యవసాయం పైన అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా విత్తనాలను విత్తనగులుకుల చేసి వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేయడం జరిగింది.అనంతరం ప్రకృతి వ్యవసాయం పైన గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ప్రకృతి వ్యవసాయం వలన రైతులకు కలిగే ఉపయోగాలను తెలియజేయడం జరిగింది. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత లక్ష్యాలను రైతులకు తెలియజేసి ప్రకృతి వ్యవసాయం వైపు మారమని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వై పి దివ్య , ఎన్ ఎఫ్ ఏ వర ప్రసాద్ , గ్రామ రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.



## అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలి : ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట,జూన్18,ప్రభాతవార్త



ఎస్.కోటలోని శివరామ రాజుపేట రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీముత్యాలమ్మ అమ్మ వారి ఆలయ ప్రారంభోత్సవ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధల తో ఘనంగా నిర్వహించారు. ఎస్.కోటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త,ఎస్ఆర్కే ట్రాన్స్‌పోర్ట్ అధినేత శ్రీనాధు వెంకన్నబాబు, రత్నావతి దంపతుల సహకారంతో ఆలయాన్ని నిర్మించారు. ఈఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈసందర్భంగా ఆమె అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, ప్రతి ఒక్కరి ఇంటా సుఖసంతోషాలు నిండాలని ఎమ్మెల్యే కోళ్ల ముత్యాలమ్మ తల్లిని వేడుకున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏఐతో కూలింగ్ క్యాప్ రూపొందించిన కేజీబీవి విద్యార్థులు

### బెంగుళూరు లో ప్రదర్శనకు ప్రోజెక్టు ఎంపిక



గరివిడి, జూన్ 18,ప్రభాత వార్త

గరివిడి కస్తూరి బాయి గాంధీ బాలికల విద్యార్థులు ఏ ఐ సాయం తో రూపొందించిన కూలింగ్ క్యాప్ ప్రోజెక్టు కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. త్వరలో బెంగుళూరులో నిర్వహించే సదస్సు కి విద్యార్థుల ప్రోజెక్టు ఎంపికైంది. రైతులు, కార్మికులు,ఇతర ఎండలో పనిచేసే శ్రమ జీవులకు ఈ క్యాప్ ఉపయుక్తంగా నిలుస్తుంది. గరివిడిపాఠశాల విద్యార్థులు 2024 నుండి ఏఐలో శిక్షణ పొంది ఈ విధమైన క్యాప్ ని రూపొందించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల కేజీబీవి ఇంచార్జి ఈ. ధన లక్ష్మి విద్యార్థుల ను అభినందించారు.కాగా విద్యార్థినుల ప్రతిభకు విద్యాశాఖాధికారులు ప్రశంసలు అందించారు.

## పంచాయతీ కార్యదర్శులకు డిజిటల్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ

పాచిపెంట జూన్ 18 ప్రభాతవార్త



మండలంలో గల సచివాలయం కార్యదర్శి మరియు డిజిటల్ అసిస్టెంట్లకు ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ కింద శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో బీవిజే పాత్రో ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమకాలిన అంశాలపై సూచనలు చెయ్యడం జరిగింది. (ఎస్‌బిఎం )స్వచ్ఛ భారత్ మిషన్) నూతన విధానాలు గురించి మరియు యోగాంధ్ర కార్యక్రమం గురించి, జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసిన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్కి గురై వ్యక్తి మృతి : ఎఎస్ఐ

రామభద్రపురం, జూన్ 18, ప్రభాతవార్త



ఈరోజు అనగా (18/06/2026) వంగ పండు వలస గ్రామంలో పాశల సత్యనారాయణ లేట్ పోలీస్ 42, ఎలక్ట్రికల్ ఎలక్ట్రికల్ షాక్ తగిలి ఉదయం 10:30 గంటల సమయంలో ఈరోజు చనిపోయినాడు అతనికి ఇద్దరు భార్యలు పద్మావతి, విజయలక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ పిల్లడు కల రూ దీనిపై తన మొదటి భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు రామభద్రపురం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఆర్ అప్పారావు కేసునమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నాము అన్నారు.

## ఎంపీడీవోగా సూర్యనారాయణ నియామకం

గరుగుబిల్లి, జూన్ 18, ప్రభాత వార్త



మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా ఎన్ సూర్యనారాయణను నియమిస్తూ జిల్లా పరిషత్తు కార్యాలయం అధికా రులు ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల వరకు మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా పనిచేసిన జి.పైడితల్లి పదవీ విరమణ చేయడంతో కురుపాం మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న గొర్జి రమేష్ బాబును ఇంచార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఉమ్మడి విజయనగరం పార్వతీ పురం మన్యం జిల్లాల జిల్లా పరిషత్తు సిఈఓ నియమించారు. మక్కువ మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఎన్ సూర్యనారాయణకు మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా పదోన్నతి లభించడంతో గరుగుబిల్లి మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా నియమిస్తూ ఉమ్మడి విజయనగరం పార్వతీపురం మన్యం జిల్లాల జిల్లా పరిషత్తు ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. కావున మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నడిమింటి సూర్యనారాయణ జాయిన్ అయితిరి.

## రైతుకు అందుబాటులో విత్తనాలు : పిఎసిఎస్ చైర్మన్ కిషోర్



కురుపాం జూన్ 18ప్రభాతవార్త.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు ఉన్నాయని పిఎసిఎస్ చైర్మన్ కిషోర్ అన్నారు. గురువారం మండలంలో కిచ్చాడ రైతు సేవా కేంద్రంలో రైతులకు విత్తనాల పంపిణీ చేశారు. రైతులు అవసరానికి అనుగుణంగా ప్రతి ఒక్క రైతుకు వరి విత్తనాలు అందజేయడం జరిగిందిన్నారు. రైతులు ఎవరికీ కూడా నష్టపోకుండా వ్యవసాయం మంచి దిగుబడి వస్తే వాటికి తగ్గట్టుగా గిట్టుబాటు ధర వచ్చేలా కృషి చేస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, రైతులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## నగర పంచాయతీ విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల, జూన్18(ప్రభాతవార్త ):



నెల్లిమర్ల నగర పంచాయతీలోని నెల్లిమర్ల జరదాపు పేట గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఆయాల ఆయా గ్రామాల పెద్దలు సముద్రపు రామారావు, లెంక అప్పలనాయుడు, అవనాపు సత్యనారాయణ, నల్లి బంగారు చంద్రశేఖర్ తదితరులు విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ సత్యనారాయణ కు వినతి పత్రాలు అందజేశారు. విజయనగరం టౌన్ డివిజన్, నెల్లిమర్ల సబ్ డివిజన్ పరిధిలోని సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సి జి ఆర్ ఫ్ చైర్ పర్సన్ డాక్టర్ బి. సత్యనారాయణ, ఆర్థిక సభ్యులు ఎస్. సుబ్బారావు, స్వతంత్ర సభ్యులు ఎన్. మురళి కృష్ణ హాజరయ్యారు. టౌన్ డివిజన్ పరిధిలో ఉన్న వినియోగదారుల నుంచి 17 వినతి పత్రాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రం నెల్లిమర్లలో ట్రాన్స్ఫార్మర్లకు వైరింగ్ చేయించాలని, ఏ బి స్విచ్లు ఏర్పాటు చేయాలని, లూజ్ స్పాన్ సరిచేయాలని లంక అప్పలనాయుడు వినతి పత్రాలు అందజేశారు. అలాగే జరజాపు పేట గ్రామంలో కొత్తగా ఫీడర్ ఏర్పాటు చేయాలని పాత రకం ట్రాన్స్ఫార్మర్లను మార్పు చేసి ప్రింట్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని, కేబుల్లకు బదులుగా కండక్టర్లను వినియోగించాలని, లైన్మెన్ పోస్టుల సంఖ్య పెంచాలని, లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని గ్రామ పెద్దలు సముద్రపు రామారావు, అవనాపు సత్యనారాయణ, నల్లి బంగారు చంద్రశేఖర్, పోలుబోతు నారాయణమూర్తి, నల్లి శ్రీను దుమ్ము నారాయణమూర్తి వినతి పత్రం అందజేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు విద్యుత్ వినియోగం, పొదుపుపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ నెల్లిమర్ల ఏ ఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం
వార్త 25

## బాక్సింగ్ లో బంగారు పతకం... అభినందించిన మాజీ ఎంపీ ...

చీపురుపల్లి జూన్ 18 ప్రభాతవార్త



అండర్-14 బాక్సింగ్‌లో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న డి.పవన్‌ను గురువారం నాడు మాజీ ఎంపీ, రాష్ట్ర వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పి ఏ సి కమిటీ సభ్యులు, అభినందించారు. చీపురుపల్లి లో ఇటీవలే జరిగిన అండర్-14 బాక్సింగ్ పోటీలలో చీపురుపల్లి పట్టణానికి చెందిన దన్నాన పవన్ చత్తా చాటాడు.అండర్-14 లో 58 నుండి 61కేజీల బరువు (వెయిట్ లిఫ్ట్)లో ప్రతిభ కనబరిచి బంగారు పతాకాన్ని కైవసం చేసుకున్న పవన్ ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి మాజీ సర్పంచ్ బెల్లాన శ్రీదేవి, వైసీపీ యువజన విభాగం నాయకుడు బెల్లాన వంశీ, పథకాన్ని సాధించిన విద్యార్థి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు సిసిఆర్‌సి కార్డు తప్పనిసరిగా పొందాలి..

### వ్యవసాయ శాఖ అధికారి సూర్య కుమారి..

చీపురుపల్లి జూన్ 18 ప్రభాతవార్త




చిగురుపల్లి మండలంలో భూమి కలిగిన ప్రతి రైతు సి సి ఆర్ సి కార్డును తప్పనిసరిగా పొందాలని చీపురుపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారిని సూర్యకుమారి రైతులకు సూచించారు.. గురువారం నాడు చీపురుపల్లి మండలం రావివలస గ్రామంలో రైతులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూములను సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా సిసిఆర్సి కార్డులను పొందాలని సమీప వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. దీనికై కౌలు రైతు కూడా తప్పనిసరిగా గ్రామ రెవెన్యూ అధికారి వారిని సంప్రదించి సీసీఆర్సీ కార్డు పొందాలి అన్నారు. అదేవిధంగా గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా కౌలు చేస్తున్న విస్తీర్ణం కు యూరియా కార్డు పొందాలి అన్నారు. యూరియా కార్డు ద్వారా మాత్రమే ఎరువులు యూరియా మరియు డిఏపీ పంపిణీ జరుగుతుంది కావున కౌలుకు సాగు చేస్తున్న ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా సిసిఆర్సి కార్డు తీసుకోవాల్సిందిగా ఆమె సూచించారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



వేపాడ, జూన్ 18, ప్రభాతవార్త

రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. వేపాడ మండలం బల్లంకి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాయితీ వరి విత్తనాలను గురువారం రైతులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను రైతు సోదరులందరూ సద్వినియోగం చేసుకొని, మంచి దిగుబడులు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. మన నియోజకవర్గం కి 8008 క్వింటాలు వరి విత్తనాలు ప్రభుత్వం సబ్సిడీ మీద కేటాయించడం జరిగిందని, ఈ విత్తనాలు కేజీ కి 10 రూపాయలు చొప్పున బస్తా కి 300 రూపాయలు వరకు సబ్సిడీ తో అందిస్తున్నందున రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు రైతులు ఖాతాలో వేయడశీ ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయటానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వేపాడ మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకట్రావు, ఎంపీటీసీ గొంప తులసి, ఏ డి ఏ బి భానులత, ఏవో ఎం స్వాతి, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ప్రభుత్వం రైతులకు విత్తనాలు ఇస్తూ ఆదుకుంటుంది - చింతల రామకృష్ణ

రామభద్రపురం.. జూన్ 18..ప్రభాత వార్త



రామభద్రపురం మండలం రైతు సేవ కేంద్రంలో ఖరీఫ్ 2026-27 విత్తనాలు పంపిణీ టిడిపి మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ ఉప సర్పంచ్ చింతల రామకృష్ణ మరియు ఎంపీటీసీ వసంతుల తిరుపతి పంపిణీ చేసారు. రసాయనిక ఎరువులు తగ్గించి ప్రకృతి వ్యవసాయం పై రైతులు అవగాహన పెంచుకోవాలి అని తెలిపారు. ఖరీఫ్ 2026-27 ఎంటియు 1121-810 క్వింటలు ఎంటియు 3291-20.4 సాశీబమాసూరి- 7.2 క్వింటల్ ఎంటియు-23.4 క్వింటాల్ వరి విత్తణాలు రైతు సేవా కేంద్రాలు ద్వారా సరఫరాకు సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయ అధికారి అమరా శివ తెలిపారు. రైతులు తమ ఆధార్, 1బి మరియు ఫోన్ ద్వారా విత్తనాలు కొరకు నమోదు కావాలి అని తెలిపారు.క్వింటల్ వరి విత్తనాలు రూ.1000-00 సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందిస్తుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి. వెంకటరమణ,రైతు సేవా కేంద్ర సిబ్బంది జి వరలక్ష్మి,రైతులు పాల్గొన్నారు

## గుర్తింపు కార్డుతో ప్రభుత్వ స్కీములు వర్తిస్తాయి

దత్తిరాజేరు జూన్ 18 ప్రభాతవార్త

కౌలు రైతులకు గుర్తింపు కార్డుతోనే ప్రభుత్వ స్కీములు లభిస్తాయని వ్యవసాయ సహాయక సంచాలకులు శ్రీనివాస్ తెలిపారు మండలంలోని దత్తిరాజేరు పెదకాద రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అధికారి గోవిందమ్మ సమక్షంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పొందడం వల్ల రైతులకు పొందే ప్రయోజనాల కోసం తెలియజేశారు ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఏడిఏ మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు కార్డు పొందడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు వల్ల పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం ద్వారా సహాయం లభిస్తుందన్నారు పంటల భీమా పంట రుణాలు ఇతర వ్యవసాయ సంబంధిత పథకాలు ప్రయోజనాలతో పాటు ఎరువులు విత్తనాలు పురుగుమందులు పంటల వ్యవసాయ ఇన్పుట్ పై ప్రభుత్వం ప్రకటించే సబ్సిడీ కీ అర్హత లభిస్తుంది అన్నారు అనంతరం రైతులకు యూరియా కారులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బండి కృష్ణ శేఖర్ వి ఏ ఏ పవన్ రైతులు పాల్గొన్నారు



19-06pg10exHMNWJQE.qxd:19-06pg10exHMNWJQE.qxd 1/1/02 6:12 AM Page 1






## హ్యాట్రిక్ కొట్టిన హాకీ అమ్మాయిలు

**అక్లాండ్, జూన్ 18:** న్యూజిలాండ్‌లోని అక్లాండ్‌లో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ మహిళల నేషన్స్ కప్‌లో భారత అమ్మాయిల జోరు కొనసాగుతోంది. టోర్నీలో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన తమ చివరి గ్రూపు మ్యాచ్‌లో ఉరుగ్వేపై 3-2 తేడాతో భారత్ విమెన్ టీమ్ గెలుపొందింది.ఇరు జట్ల మధ్య ఆసక్తికరంగా సాగిన ఈ మ్యాచ్ ఆరంభంలో ఉరుగ్వే ఆధిక్యం కనబరిచింది. 13వ నిమిషంలో కియారా అపెన్నినో గోల్‌తో ఉరుగ్వే 1-0 ఆధిక్యం చాటింది. ఆ తర్వాతి నుంచి భారత్ అటాక్ పెరిగింది. 24వ నిమిషంలో దీపిక సెహ్రావత్ గోల్ చేసి 1-1తో సమం చేసింది. అనంతరం 43వ నిమిషంలో దీపిక సోరెంగ్ చేసిన గోల్‌తో భారత్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక 55వ నిమిషంలో ఉరుగ్వే గోల్ చేసి స్కోరును 2-2తో సమం చేయడంతో ఉత్కంఠ నెలకొంది. ఆతర్వాతి నిమిషంలోనే దీపిక సెహ్రావత్ అద్భుతమైన గోల్ తో భారత్‌ను 3-2తో ఆధిక్యంలోకి తీసుకెళ్లింది. సెహ్రావత్‌కు ఇది రెండో గోల్. అదే ఆధిక్యాన్ని చివరి నిమిషం వరకు కాపాడుకుని భారత్ గెలుపొందింది. ఈ మ్యాచ్‌కు ముందు భారత విమెన్ టీమ్... అమెరికా, జపాన్‌లను ఓడించి సెమీస్‌కు దూరుకెళ్లింది. ఈ గెలుపుతో గ్రూపు దశను అజేయంగా ముగించిన భారత్... శనివారం చిలీతో సెమీస్‌లో తలపడనుంది.

## మన్‌ప్రీత్ సింగ్ సరికొత్త రికార్డు

**రోటర్‌డామ్(నెదర్లాండ్స్), జూన్ 18:** భారత హాకీ జట్టు స్టార్ ఆటగాడు మన్‌ప్రీత్ సింగ్ చరిత్ర సృష్టించాడు. దేశం తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్‌లో జర్మనీతో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్



మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా మన్‌ప్రీత్ తన 413వ మ్యాచ్ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో హాకీ ఇండియా ప్రస్తుత అధ్యక్షుడు దిలీప్ టిర్కీ పేరిట ఉన్న 412 మ్యాచ్‌ల రికార్డును మన్‌ప్రీత్ అధిగమించాడు. మన్‌ప్రీత్‌కు భారత హాకీ జట్టు కూడా గుర్తుండిపోయే కానుక ఇచ్చింది. ప్రో లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ ఛాంపియన్ జర్మనీపై 3-1 గోల్స్‌తో నెగ్గింది.

అరుదైన మైలురాయి అందుకున్న మన్‌ప్రీత్ సింగ్‌ను హాకీ ఇండియా అభినందించి, 10 లక్షల నజరానా ప్రకటించింది. 15యేళ్లుగా భారత హాకీ జట్టుకు మన్‌ప్రీత్ గుండెకాయలా నిలుస్తున్నాడని, ఆయన నిలకడ అసాధారణమని కొనియాడింది. 2011లో 19ఏళ్ల వయసులో భారత జట్టులోకి అడుగుపెట్టిన మన్‌ప్రీత్ సింగ్... టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు సాధించిన జట్టు సభ్యుడు.ప్రపంచంలోనే అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో మన్‌ప్రీత్ సింగ్ ఐదో స్థానంలో ఉన్నాడు. ఈ మైలురాయిని తన సహచరులు, కుటుంబసభ్యులకు అంకితం చేస్తున్నట్లు మన్‌ప్రీత్ సింగ్ చెప్పాడు. జాతీయ జట్టుకు అత్యధిక మ్యాచ్‌ల్లో ఆడడం గర్వంగా ఉందని... ఒలింపిక్ స్వర్ణం, ప్రపంచ కప్ గెలువాలనేదే తన లక్ష్యమని స్పష్టంచేశాడు.



## ప్రపంచ కప్ క్వార్టర్ ఫైనల్లో మీనాక్షి

**గ్వియాంగ్(చైనా), జూన్ 18:** చైనాలోని గ్వియాంగ్‌లో జరుగుతున్న ప్రపంచ కప్ బాక్సింగ్‌లో భారత బాక్సర్ మీనాక్షి హుడా సత్తా చాటుతోంది. ప్రస్తుతం మహిళల 48 కిలోల విభాగంలో వరల్డ్ నెంబర్ వన్ అయిన మీనాక్షి... 51 కిలోల విభాగంలోకి మారి పోటీపడుతోంది. గురువారం మహిళల 51 కిలోల విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రి క్వార్టర్ ఫైనల్లో పోలాండ్ బాక్సర్ నటాలియా కుచ్వెస్కాపై పడిగుద్దులతో విరుచుకుపడింది. 5-0తో ఏకపక్ష విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్లో కజకిస్థాన్ బాక్సర్ అలువ బల్కిబెకోవాతో మీనాక్షి హుడా తలపడనుంది. కాగా మరో భారత భాక్సర్ అభినాష్ జమ్వాల్ పరుషుల 65 కిలోల విభాగంలో ఇంటిదారి పట్టాడు. అతను కిర్గిజిస్థాన్ బాక్సర్ మిర్జోఖిద్ చేతిలో 0-5తేడాతో ఓటమి పొందాడు.

భారత బాక్సర్లు రెండు విభాగాల్లో పతకాలు పక్కా చేశారు. మహిళల 48 కిలోల విభాగంలో జ్యోతి, 85 కిలోల విభాగంలో జుగ్నూ సెమీఫైనల్స్‌కు చేరుకోవడం ద్వారా భారత్‌కు పతకాలను ఖాయం చేసుకున్నారు.కాగా ఈ బాక్సింగ్ ప్రపంచకప్‌లో ఇప్పటివరకు ఐదుగురు భారత బాక్సర్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. 55 కిలోల విభాగంలో నిఖిల్, 70 కేజీల విభాగంలో దీపక్, 57 కిలోల విభాగంలో ప్రాచి, 65 కిలోల విభాగంలో సనేహా క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు.



గోల్ కొట్టి సంబరాలు జరుపుకున్న లూయిస్ డియాజ్

### పనామా ఆశలకు ఘనా చెక్ * మెక్సికోతో తలపడనున్న దక్షిణ కొరియా * కెనడాతో ఖతర్ ఢీ

## సాకర్ ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్, కొలంబియా అదుర్స్

**లాస్‌ఏంజిల్స్, జూన్ 18**

ఇంగ్లాండ్ ఘనవిజయంతో ఫీఫా ప్రపంచకప్ జైత్రయాత్రను ప్రారంభించింది. క్రొయేషియాను 4-2తో చిత్తు చేసింది. హ్యారీ కేన్ రెండు గోల్స్‌తో జట్టు విజయంలో కీరోల్ పోషించాడు. మరోవైపు 8 ఏళ్ల తర్వాత ఫిఫా బరిలోకి దిగిన కొలంబియా రీ ఎంట్రీ అదిరింది. ఉజ్బెకిస్థాన్‌పై 3-1 గోల్స్‌తో నెగ్గింది.ఇక అదనపు సమయం గోల్‌తో పనామాపై ఘనా విజయం సాధించింది. ఇక గ్రూప్-బిలో స్విట్జర్లాండ్‌తో బోస్నియా- హెర్జెగోవినా, అతిథ్య కెనడాతో ఖతార్, గ్రూప్-ఎలో మెక్సికోతో దక్షిణ కొరియా తలపడనుంది.

### అదరగొట్టిన ఇంగ్లాండ్

హాట్ ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్... తొలి మ్యాచ్‌లో క్రొయేషియాను చిత్తు చేసింది. స్టార్ ఆటగాడు హ్యారీ కేన్ 12వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌తో గోల్‌కొట్టి ఇంగ్లాండ్‌కు ఆధిక్యం అందించాడు. అయితే, క్రొయేషియా ప్లేయర్ మార్టిన్ బతురినా 36వనిమిషంలో చేసిన గోల్‌తో స్కోర్లు సమమయ్యాయి. మళ్లీ 42వ నిమిషంలో హ్యారీ కేన్ చేసిన రెండో గోల్‌తో ఇంగ్లాండ్ ఆధిక్యం 2-1కు పెరిగింది. తొలి అర్ధభాగం అదనపు సమయంలో (45+5వ నిమిషం) పీటర్ ముసా అద్భుతమైన గోల్‌తో క్రొయేషియాను 2-2తో సమంగా నిలిపాడు. రెండో అర్ధభాగంలో ఇంగ్లాండ్ అటాకింగ్ గేమ్‌తో అదరగొట్టింది. జుడె బెల్లిగ్‌హామ్ (47వ నిమిషం), మార్కస్ రాష్‌ఫోర్డ్ (85వ నిమిషం) గోల్స్‌తో ఇంగ్లాండ్ 4-2 తేడాతో క్రొయేషి యాపై విజయం సాధించింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ కేన్... ఫుట్‌బాల్ దిగ్గజం డేవిడ్ బెక్‌హామ్‌ను సమం చేశాడు. మూడు వేర్వేరు ప్రపంచ కప్‌ల్లో గోల్స్ చేసిన రెండో ఆటగాడిగా హ్యారీ కేన్ (2018, 2022, 2026) నిలిచాడు.అతడి కంటే ముందు బెక్‌హామ్ (1998, 2002, 2006) పేరిట ఈ రికార్డు ఉండేది.

### కొలంబియా గ్రాండ్ రీ ఎంట్రీ

గ్రూప్-కేలో జరిగిన మ్యాచ్‌తో కొలంబియా గ్రాండ్ రీ ఎంట్రీ ఇచ్చింది. ఉజ్బెకిస్థాన్‌పై 3-1 గోల్స్ తేడాతో నెగ్గింది. 8ఏళ్ల తర్వాత ఫిఫా కప్ ఆడుతున్న కొలంబియా గ్రాండ్ విక్టరీ కొట్టింది. మొదటి అర్ధభాగంలో డేనియల్ మునోజ్ చేసిన గోల్‌తో కొలంబియా ఖాతా తెరిచింది. తొలి అర్ధభాగం ముగిసేవరకు 1-0ఆధిక్యం నిలుపుకుంది. రెండో అర్ధభాగం 60వ నిమిషంలో ఉగ్లీ ఫైజుల్లావ్ అద్భుత గోల్‌తో ఉజ్బెకిస్థాన్ సమవుజ్జీగా నిలిచింది. ఇది ఉజ్బెకిస్థాన్ జట్టుకు ఫిఫాలో తొలి గోల్. దీంతో ఆ జట్టు అభిమానులకు సంబరాలు చేసుకున్నారు. ఆ తర్వాతి ఐదు నిమిషాల్లోనే డియాజ్ గోల్ సాధించడంతో మళ్లీ కొలంబియా అధిక్యంలోకి వెళ్లింది. ఇక ఇంజ్యూరీ టైమ్ చివరి నిమిషాల్లో కుచో హెర్నాండెజ్ కుడి వింగ్‌లో బంతిని సబ్స్‌ట్యూట్ కాంపాజ్‌కు క్రాస్ చేయగా అతను హెడర్‌తో గోల్‌లోకి పంపించాడు. ఈ విజయంతో కొలంబియా ఖాతాలో మూడు పాయింట్లు చేరాయి. డానియల్ మునోజ్ (40వ నిమిషం), లూయిస్ డియాజ్ (65వ నిమిషం), జామిన్‌టన్ క్యాపాజ్ (90+9వ నిమిషం) కొలంబియా తరఫున గోల్స్ కొట్టారు.

### ఘనామైన విజయం

సాకర్ ప్రపంచకప్‌ను ఘనామైన విజయంతో ప్రారంభించింది. పనామాపై ఏకైక గోల్‌తో విజయం సాధించింది. స్టార్ ఆటగాడు థామస్ పార్టీ లేకున్నా ఘనా చక్కగా పోరాడింది. పనామాను





బెక్‌హామ్‌ను సమం చేసిన హ్యారీ కేన్

నిలువరించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. ఆట అదనపు సమయంలో ఘనా ప్లేయర్ కలేబ్ (90+5వ నిమిషం) గోల్ సాధించాడు. దీంతో డ్రా చేద్దామనుకున్న పనామా ఆశలకు తెర పడింది.

## ఐదో రోజూ లాభాల్లో ముగిసిన మార్కెట్లు

**ముంబయి, జూన్ 18:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్లోనూ లాభాలతో ముగిశాయి. ముడి చమురు ధరలు తగ్గడం, అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సడలడం మార్కెట్ సెంటిమెంట్కు బలాన్నిచ్చాయి. హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల షేర్లు కొనుగోళ్లతో పెరిగితే, ఐటీ షేర్లు మాత్రం ఒత్తిడిలో కొనసాగాయి. బ్రెంట్ క్రూడ్ ధరలు తగ్గడం, అమెరికాఇరాన్ శాంతి చర్చలపై సానుకూల సంకేతాలు, ఎఫ్‌పిఐల కొనుగోళ్లు పునరుద్ధరించటం, బీఎస్ఈ సెన్సెక్స్ 254.36 పాయింట్లు పెరిగి 77,409.98వద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 82.30 పాయింట్లు 24,168 వద్ద స్థిరపడింది. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 4.85 పెరగగా,నిఫ్టీ 4.35 ఎగబాకింది. మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ 6.46లాభం హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్ 1.74శాతం




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1.56 చొప్పున పెరిగాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే బీఎస్ఈ 150మిడ్‌క్యాప్ సూచీ 0.41 పెరిగితే బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.67 లాభపడింది.



## పసిడి వెండి ధరలపై ఫెడ్‌రిజర్వు ఎఫెక్ట్

**న్యూఢిల్లీ, జూన్ 18:**అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గినప్పటికీ బంగారం ధరలు ఆశించిన స్థాయిలో ఊపందుకోవడంలేదు.అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠిన ద్రవ్య విధాన సంకేతాలు ఇవ్వడంతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.గురువారం స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 4,270 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, రోజులో గరిష్ఠంగా 4,330 డాలర్లను తాకింది. మరోవైపు స్పాట్ సిల్వర్ 68.30 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, సెషన్‌లో 69.85 డాలర్ల వరకు పెరిగింది. అమెరికాఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం,హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశాలు పెరగడం వల్ల ముడి చమురు ధరలు తగ్గడంతో ద్రవ్యోల్బణ ఆందోళనలు కొంత తగ్గి బంగారం, వెండి కొనుగోళ్లకు మద్దతు లభించిందని కోటక్ సెక్యూరిటీస్ విశ్లేషించింది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ, ఈ ఏడాది చివర్లో మరోసారి రేట్ల పెంపు అవకాశం ఉందని సంకేతాలు ఇవ్వడంతో బులియన్ మార్కెట్‌పై ఒత్తిడి కొనసాగుతోంది.




## ధరలు పెంచుతున్న టాటా మోటార్స్

**ముంబయి, జూన్ 18:**దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటామోటార్స్ వాణిజ్య వాహనాల ధరలను పెంచుతున్నటువెల్లడించింది. ట్రక్కులు, బస్సులు సహా కమర్షియల్ వాహనాల శ్రేణిలో గరిష్ఠంగా 2.5 శాతం వరకు ధరలు పెంచనున్నట్లు నేడు ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త ధరలు జులై 1 నుంచి అమల్లోకి రానున్నాయి.ముడి పదార్థాల ధరలు, ఇతర ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ భారాన్ని కొంత మేర భర్తీ చేసేందుకు ధరల సవరణ చేపడుతున్నట్లు కంపెనీ వివరించింది.ధరల పెంపు అన్ని వాహనాలపై ఒకేలా ఉండదని తెలిపింది. మోడల్, వేరియంట్‌ను బట్టి పెరుగుదల మారుతుందని పేర్కొంది. ఇదే నెల ప్రారంభంలో టాటా మోటార్స్ తన ప్యాసింజర్ వాహనాల ధరలను కూడా పెంచుతున్నట్లు ప్రకటించింది. పెట్రోల్, డీజిల్ కార్లతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలపై 1.5 శాతం వరకు ధరలు పెంచనున్నట్లు స్పష్టంచేసింది. ఆ పెంపు కూడా వచ్చే నెల నుంచే అమల్లోకి రానుంది. ఇటీవల ముడి పదార్థాల ధరల పెరుగుదల, నిర్వహణ వ్యయాల భారం కారణంగా పలు ఆటో కంపెనీలు ధరలను సవరించాయి. గత నెలలో హ్యుందాయ్ తమ వాహనాల ధరలను రూ.12,800 వరకు పెంచగా, మారుతి సుజుకి కూడా ఈ ఏడాది ప్రారంభంలో పలు మోడళ్ల ధరలను పెంచింది.

## ఎటిఎంల ద్వారానే పిఎఫ్ విత్‌డ్రా

**న్యూఢిల్లీ, జూన్ 18:**ఉద్యోగుల భవిష్య నిది సంస్థ డిజిటల్ సేవలను మరింత విస్తరిస్తోంది. ఈపీఎఫ్‌వో 3.0 కింద పీఎఫ్ ఖాతాదారులు యూపీఐ యాప్‌లు, పీఎఫ్‌కు అనుసంధానమైన ఏటీఎంల ద్వారా నేరుగా తమ నిధులను ఉపసంహరించుకునే సౌకర్యాన్ని ఈ నెలాఖరులోగా అందుబాటులోకి తీసుకువస్తోంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్‌ఆఫ్‌ఇండియా(ఎన్‌పీసీఐ) సహకారంతో రూపొందించిన ఈ వ్యవస్థకు సంబంధించిన టెస్టింగ్ ఇప్పటికే పూర్తయ్యాయి. కొత్త విధానంలో పీఎఫ్ ఖాతాలో ఉన్న మొత్తంలో 75 శాతం వరకు నిధులను వెంటనే బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పీఎఫ్ డబ్బులు తీసుకోవాలంటే క్లెయిమ్ దాఖలు చేసి, ఆమోదం కోసం కొంత కాలం వేచి చూడాల్సి వస్తోంది. కొత్తవ్యవస్థ అమల్లోకి వస్తే ఈ ప్రక్రియ మరింత సులభం, వేగవంతం కానుంది. ఈమార్పుతో ఉద్యోగులకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక సహాయం అందుబాటులోకి వస్తుంది. అదే సమయంలో పారదర్శకత, జవాబుదారీతనం కూడా పెరుగుతాయి. అయితే పదవీ విరమణ నిధుల భద్రత దృష్ట్యా పటిష్ఠమైన ధ్రువీకరణ, మోసాల నివారణ వ్యవస్థలు అవసరమని వారు సూచిస్తున్నారు. డిజిటల్ చెల్లింపుల రంగంలో భారత్ సాధించిన పురోగతిని సామాజిక భద్రతా వ్యవస్థలకూ విస్తరించే ప్రయత్నంగా ఈపీఎఫ్‌వో 3.0ను భావిస్తున్నారు.

## బ్రిటిష్ కార్ల దిగుమతులకు రాయితీ సుంకం

**న్యూఢిల్లీ, జూన్ 18:** భారత్‌యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం అమలులో భాగంగా, వచ్చే 15 ఏళ్లలో బ్రిటన్ నుంచి 3.78 లక్షల సంప్రదాయ ఇంధన (పెట్రోల్, డీజిల్) కార్ల దిగుమతులకు భారత్ కస్టమ్స్ రాయితీ సుంకాలను అనుమతించింది. ఈ ఒప్పందం జూలై 15 నుంచి అమల్లోకి రానుంది. ఆటోమొబైల్ ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న సుమారు 110 శాతం దిగుమతి సుంకం దశలవారీగా 10 శాతానికి తగ్గనుంది. ఇరు దేశాలు కోటా విధానాన్ని అనుసరించనున్నాయి.

సీఈటీఏ పత్రాల ప్రకారం, బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే సంప్రదాయ ఇంధన కార్ల కోటా ఐదో ఏడాదికి గరిష్టంగా 37వేల యూనిట్లకు చేరుతుంది. అనంతరం కస్టమ్స్ సుంకం 10 శాతం వద్ద స్థిరపడుతుంది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.